ఫిబ్రవరి 1974

53

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక



# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

**53**

విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

---

70 పేజీలు 1 రూ.

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

1974 ఫిబ్రవరి  మాస పత్రిక  53



SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad, Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal-506002 (A. P.)

# ఎర్రజెండా

— ఎన్.కె.

ఎర్రజెండేరోరన్నా ఎర్రజెండేరో
మన బతుకు బాటకు వెలుగుదారి ఎర్రజెండేరో
మన సమతకోసం పోరుబాట ఎర్రజెండేరో
ఎర్రజెండేరోరన్నా ఎర్రజెండేరో...

చిక్కులూ చీకాకులాతో చిక్కిపోకండి
చీకట్లను చీల్చు వెలుగుతో పిడికిలెత్తండి
సమసమాజం వచ్చువరకు సమరమేనండి
బతుకు పోరున బంధాలు తెంచిపోరండి... ॥ఎర్ర॥

రక్తంలో తడిసిన ఎర్రజెండే ఎర్రజెండగును
వర్గకసితో పోరు మనిషే ప్రజల మనిషగును
బతుకుతీపిని వొదిలి కదిలినవాడె భాస్కరుడు
త్యాగాలకు వెనుదీయనోడీతరం నాయకుడు ॥ఎర్ర॥

తుపాకి గొట్టంద్వారె మనకు రాజ్యమొచ్చుండి
బంధూకు పట్టి బంధనాలను తెంచుదామండి
తుపాకిదించినోడి మాటను తిప్పికొట్టండి
లాంగ్ మార్చ్‌ను చేయువాడికె లాల్‌సలామండి

ఎర్రజెండేరోరన్నా ఎర్రజెండేరో
మన బతుకు బాటకు వెలుగుదారి ఎర్రజెండేరో
మన సమతకోసం పోరుబాట ఎర్రజెండేరో
ఎర్రజెండేరోరన్నా ఎర్రజెండేరో... ॥ఎర్ర॥

# 'ప్రజను సాయుధంచేస్తున్న రెవల్యూషనరీ నేడుకవి'

విప్లవ రచయితల సంఘం జనవరి 13, 14 తేదీల్లో కర్నూలులో నాల్గవ మహాసభలు జరుపుకుంటున్నది. గుంటూరు మహాసభల తర్వాత విరసం సాహిత్య సాంస్కృతిక రంగాలల్లో గణనీయమైన కృషిచేసిందనడానికి దాని సభ్యులపై ప్రభుత్వం మరోసారి చూపిన దమననీతియే సాక్ష్యం. మహాసభలు మూడునెలలు ఆలస్యమయినా సభ్యులందరూ మధ్యకాలంలో మూడుసార్లు కలుసుకునే అవకాశంవచ్చింది. తెనాలిలో సర్వసభ్య సమావేశం సందర్భంగా, వరంగల్‌లో 'సాహిత్య పాఠశాల' సందర్భంగా, హైదరాబాదులో విప్లవరచయితల అరెస్టుల సందర్భంగా విరసం సభ్యులంతా కలుసుకోగలగడమే కాకుండా గొప్ప బహిరంగసభలు, ప్రదర్శనలు జరుపగలిగారు.

విరసం గర్వించాల్సినఅంశం ఏమిటంటే విరసం సభ్యులు తమ లక్ష్యాన్ని దృష్టిలో వుంచుకొని 'మేడే' ఉత్సవాల్లోను, 'అమరవీరుల సంస్మరణ' సభల్లోను, 'పౌరహక్కుల సభ'ల్లోనూ ప్రజలలో విప్లవ చైతన్యాన్ని కాపాడుతూ పాల్గొన్నారు.

వరంగల్, హైదరాబాదులలో భారత-చైనా మిత్రమండలి సమావేశాలు జరిగి, సంఘాలుకూడ ఏర్పడ్డాయి. ఈ జనవరి 6 న ఒంగోలులో జరిగిన చరిత్రాత్మకమైన ఆంధ్రప్రదేశ్ భారతచైనా మిత్రమండలి సభల్లో విరసం మొత్తంగా, ఒక అంతర్లీనమైన భాగంగా తన కర్తవ్యాన్ని నిర్వహించింది. భారత చైనాప్రజల మైత్రి అనే మహత్తరమయిన స్నేహ సంస్కృతిని సాంస్కృతిక సంస్థఅయిన విరసం తన ప్రయత్నాలద్వారా సాధించాల్సివున్నది. ఈ సంవత్సరం భారతచైనాప్రజల మైత్రికి వంతెనగా విరసం కృషిచేయాల్సి వున్నది.

విస్తృతంగా మౌలికమైన విషయాలు అధ్యయనంచేసే దృష్టితో నాలుగురోజులు అక్టోబర్‌లో 'సాహిత్య పాఠశాల'ను నిర్వహించుకున్నది. సాహిత్యమూ, కళలూ, సంస్కృతీ అన్నీ రాజకీయాలకు లోబడివుంటాయనే మార్క్సిస్టు అవగాహనను విరసం క్రమంగా పెంచుకుంటున్నది.

ఒక్కసారిగా ఇది యీ సంవత్సరమంతా విరసంసాధించిన ప్రగతిగా చెప్పుకోవచ్చునా అంటేమాత్రం దేశంలో విప్లవపోరాటాలు సాధించిన విజయాలకు సంకేతాలు అని చెప్పడమే న్యాయంగా వుంటుంది. నక్సల్బరీ, శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాటకాంతిలో విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించినట్లుగానే యీనాడు తెలుగుదేశమంతటా అలుముకుంటున్న రైతాంగ సాయుధపోరాటవెలుగులే ఇస్నితీర్ల మిలిటెంట్ ప్రజా ఉద్యమాలకు, సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలకు ఉత్తేజాన్ని యిస్తున్నయనేది చారిత్రిక సత్యం. సాయుధ విప్లవ పోరాటాలు సాగుతున్నాయి గనుకనే విరసం సాహిత్య సాంస్కృతిక బాధ్యతలు ఒకఊపుతో ఉత్తేజంతో నిర్వహించగలుగుతున్నది. ఈ సాయుధ సత్యాన్నిగుర్తించి, నెత్తురుతో తడిసిన దీర్ఘకాల ప్రజావిముక్తి పోరాట మార్గంలో ప్రజలతో, ప్రజాసైనికులతో వాళ్ళ పనిముట్లకు, ఆయుధాలకు బాసటగా తన పనిముట్లతో, కలాలతో అడుగులో అడుగువేస్తూ నడవడమే తన పడుగడగా, తన ఉనికిగా, తన ఊహగా విరసం ఉద్యమిస్తుందని ఆశిద్దాం.

9 జనవరి '74

"కొద్ది కాలంలోనే, చైనాలోని మధ్య, దక్షిణ, ఉత్తర రాష్ట్రాలలో కోట్లాది రైతుకూలీలు ఒక వెల్లువలాగ, తుఫానులాగ లేస్తారు. అసాధారణమైన ప్రచండవేగంతో, తీవ్రతతో వచ్చే ఆ ఉప్పెనను, ఏ శక్తి, అది ఎంత గొప్పదైనా సరే, అణచలేదు."

— మావో సె-టుంగ్

చైనాలో ఆ ఉప్పెన వచ్చింది. శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవంతో ఆ వెల్లువ ప్రపంచంలోని కుళ్ళునే ఊడ్చేసే స్థాయికి ఎగిసింది.

కొద్దికాలంలోనే భారత దేశంలో కూడా కోట్లాది రైతుకూలీలు ఒక వెల్లువలాగ, తుఫానులాగ లేస్తారు... దాన్ని ఏ శక్తీ అణచలేదు.

చైనా మార్గమే మనమార్గం. జనచైనాలో భూసంస్కరణలు విప్లవాత్మకంగా ఎనిమిదవ రూట్ ఆర్మీ అమలుచేసిన తీరు గురించి 'ఉప్పెన'లో చదువుతున్నాం. ఈ సంచికలో ఈ నవల మొదటిభాగం పూర్తయి పుస్తకరూపంలో వెలువడింది. రెండో భాగం ఒకేసారి పుస్తకరూపంలో వెలువరించటమా, సీరియల్‌గా ప్రచురించిన తర్వాత పుస్తకంగా వేయడమా అనే విషయంలో పాఠకుల అభిప్రాయం తెలుసుకోగోరుతున్నాం. ఒకేసారి పుస్తకంగా చదువదలచుకున్నవారు సృజన ప్రతి సంచికలో 20 పేజీల దాకా నవలకోసం ఖర్చుకావడం ఇష్టపడడంలేదు. ఒక్కసారి ఎక్కువ డబ్బు పెట్టి పుస్తకంగా కొనుక్కోలేనివారు సీరియల్‌గారావడమే ఇష్టపడుతున్నారు. ఏమైనా నిర్మాణాత్మకమైన సూచన చేయవలసిందిగా పాఠకులను కోరుతున్నాం.



(గత సంచిక తరువాయి)

## 19

మర్నాడు ఉదయమే చావో ఇంటికి బండెడు కట్టెలుతెచ్చి, మూడు గుర్రాలకీ నీళ్ళు పడుతున్నాడు. ఇంతలో లియూ తె-షాన్ ఆదరా బాదరాగా పరుగెత్తుకుంటూ వచ్చి "ఇక్కడ నీలు పడుతున్నావా!" అన్నాడు.

"ఏం, ఏటయినాది ?"

"బందిపోటోల్ల దండొస్తోందట! హాన్ తమ్ముడు 'సాంచియా' దాకా వచ్చేసినాడు ఆడి ఎంట మరోవందమంది వున్నారు- అందరికాడా బందూకులున్నాయి, తెల్లగుడ్డలు కట్టుకున్నారు— హాన్‌గురించి 'సంతాపం'ట. హాన్‌ని సంపేసినాఁవని మనమీద కసితీర్చుకుంటారట. ఊరంతా హడలిపోతాంటే నువ్విక్కడ నీలు పడుతుండావా ?" లియూ వచ్చినంత వేగంగా తిరిగి వెళ్ళిపోయేడు.

చావో ఓ గుర్రం ఎక్కి మిగతా రెండు గుర్రాల కళ్ళేలూ పట్టుకుని యింటికి దౌడుతీసేడు. గుర్రాల్ని అక్కడే విడిచి తుపాకీ తీసుకుని స్కూలువేపు పరుగెత్తేడు. అక్కడ సియావో టెలిఫోన్‌లో మాటాడుతూనే ఆర్డరిస్తున్నాడు. సెక్షన్ లీడర్ చాంగ్‌ని పిలిచి ఇద్దరు స్కౌట్లని సాంచియాకి వెళ్ళేదారి పరిశీలించేందుకు పంపమన్నాడు.

"నువ్ సమయానికే వచ్చేవు," రిసీవర్ చెవిదగ్గర పెట్టుకునే చావోతో మాటాడేడు సియావో.

"జనాన్ని స్థిమితంగా వుండమని చెప్పు. మనం స్థిమితంగా వున్నంతవరకు వెయ్యిమంది బందిపోట్లు ఒచ్చినా మనని ఏఁవీ చెయ్యలేరు. అబ్బ, ఇది పనిచెయ్యటల్లేదు !" రిసీవరు పెట్టేసి మళ్ళీ ఫోన్ చేసేడు.

చావో వూరంతా తిరిగేడు. కొందరు గుర్రబ్బండి సిద్ధంచేస్తున్నారు. కొందరు సామానుతో అటూ యిటూ పరుగెడుతున్నారు. చావో ప్రతి యింటిముందు అరిచేడు.

"అలా బెంబేలుపడిపోకండి. ధైర్యంగా వుండండి. బందిపోటోల్లు మననేటి సేస్తారు? మనకి బయ్యమెందుకేటి? సియావోబాబు జిల్లాపార్టీ కమిటీకి ఫోనుసేస్తాండాడు. ఎనిమిదోదలసైన్యం వచ్చేస్తాది."

అతను పారిపోడంలేదనీ, తమకి ధైర్యంచెప్పడానికే ఒచ్చేడనీ తెలిసేక జనం తగ్గేరు, కొందరు ఇళ్ళకి వెళ్ళిపోయేరు.

"బందూకులు, ఈటెలు తీసుకురండి. మనూరిని మనఁవే కాపాడుకోవాల, కార్యకర్తలతో కలుద్దాం" వీలైనంత పెద్దగా అరిచేడు చావో.

టీమ్‌లీడర్ సియావో ఫోన్ చెయ్యలేకపోయేడు. రిసీవర్ బల్లమీదపడేసి "లైన్ కోసేసేరు"అన్నాడు. కనుబొమలు ముడిచి గదిలో అటూ యిటూ పచార్లుచేయసాగేడు. "అద్దీ! తట్టింది!"అని తనలో అనుకుని చాంగ్‌ని పిలిచేడు.

"సెక్షన్‌లీడర్ చాంగ్, నువ్వు వెంటనే జిల్లాకమిటీకి వెళ్ళి రక్షణబలాల్ని తీసుకురావాలి. ఎవరిదైనా గుర్రం తీస్కో—. రానుపోను ముప్పైమైళ్ళు. ఎనిమిదిగంటల్లో రావాలి."

ఓ చిన్నపుస్తకంలోంచి కాయితంచింపి "జిల్లాపార్టి కమిటీకి: అర్జెంట్. సాంచియాదగ్గర బందిపోట్లు. దాదాపు ఏభై మంది, గుర్రాలతో ఆయుధాలతో వెంటనే బలగాన్ని పంపండి— సియావో. సెప్టెంబర్ 3" అని రాసిచ్చేడు.

సెక్షన్‌లీడర్ చాంగ్ చీటీపట్టుకుని వెళ్ళిపోయేడు. కార్యకర్తల దగ్గరికి జనం. ముగ్గురేసీ నలుగురేసీ వస్తున్నారు— సలహాకోసం, వార్తలకోసం. పాయి తుపాకితో ఒచ్చి తలుపువారగా కూచున్నాడు.

"బందిపోట్ల సంగతి తెలుసా?"అని అడిగేడు సియావో.

"నేను సిద్ధం"అన్నాడు పాయి.

"ఎలా?"

"ఉన్నదాంతోనే ఆల్లని యెదిరిస్తాం— బందూకులు, చిన్న చిన్న తుపాకులు, ఈటెలు, పాతఫిరంగి అన్నీ రడీగావున్నాయి."

"వాళ్ళని ఎదిరించలేకపోతే?"

"పారిపోడఁవే"

"వాళ్ళు అదికూడా అడ్డేస్తే?"

"తిరగబడ్డఁవే. ఆలూ మనలాటి మడుసులేకదా, ఆలనిసూసి బయ్యమేటి?" అంటూ పాయి లేచి నించున్నాడు.

"మంచిది. నువ్ సగం మంది సైనికులతో వూరిగోడకి యివతలవుండు. ఈ తుపాకీ చాంగ్ చింగ్-సియాంగ్ కివ్వు. ఇతన్ని ఉపదళాధిపతిగా వుంచు. మూడో సైన్యం కట్టిన మట్టిగోడ రక్షణకేంద్రాలతో మనం యీ వూరిని బాగా కాపాడగలం. ఆ పాతఫిరంగిని దక్షిణద్వారం బైట కందకంలో వుంచు. నువ్వే తుపాకితో దాన్నిఅడ్డాలి. తూర్పు, పడమట, ఉత్తర ద్వారాలు మూయించేసి అక్కడ కొందరిని కాపలా వుంచు. చాంగ్, మరోయిద్దరు వీధుల్ని కాపలా కాస్తారు. మనం తగ్గాల్సిన అవసరమొస్తే ఉత్తరకాంపౌండులోకి వచ్చెయ్యండి. మామూలు జనమంతా అక్కడాగదుల్లోఉంటారు. ఆయుధాలు చేతపట్టినవాళ్లు బురుజుల్లోవుంటారు ఇలాగయితే మూడు నాలుగు రోజులే కాదు, నెలరోజులయినా వూరునిపట్టి వుంచగలం. ఉత్తరం కాంపౌండులోకి మనం వెనకంజవేసేలావుంటే, ప్రతికుటుంబం వారానికి సరిపడ తిండిపదార్థాలు తెచ్చుకోవాలి"

"మరినువ్వేటిసేస్తావ్‌బాబూ, వూరిడిసిపోతావా ?"అని అడిగేడు పాయి.

"నువ్ పోతానంటే నా బండిలో యిడిసిపెడతా బాబూ" పిరికి ఓల్డ్‌సన్ గబగబా చెప్పేడు. "ఊరు సంగతి పాయి సూసుకుంతాడు".

సియావో సమాధాన మివ్వకుండా పెద్ద లీని పిలిచేడు.

"కామందుల్నీ, వాళ్ళ తొత్తుల్నీ, గూండావెధవల్నీ జాగ్రత్తగా కనిపెట్టండి. వాళ్ళని యిళ్ళలోనే అరెస్ట్‌చేసి వుంచండి. ఎవరేనా కదిలేరా, నా ఆర్డర్‌గా చంపు."

పాయి, పెద్ద లీ, చాంగ్ వూరి రక్షణకోసం తమ కప్పగించిన పనులు నెరవేర్చ డానికి వెళ్ళిపోయేరు. సియావో రివాల్వర్‌తగిలించుకుని, స్కూలు బయటకొచ్చి దక్షిణపు ద్వారంవేపు నడిచేడు. అతనివెనకే మరతుపాకులు తగిలించుకున్న వాన్, చిన్నవాంగ్, లియూ-షెంగ్ నడిచేరు. వారివెనక సైనికులు- వాళ్ళబాయ్‌నెట్లు ఎండలో తళతళలాడు తున్నాయి. ఆ వెనకే చావో, ప్రజలు రకరకాల ఆయుధాలతో- తుపాకులు, ఈటెలు, గొడ్డళ్ళు, పారలు, కర్రలు. ఒకతను "యువాన్ మావో రైతుసంఘం"అని రాసివున్న ఎర్రజెండా పట్టుకున్నాడు. హాన్ ఇంట్లో చావోకి దొరికిన ఎర్రసిల్కుగుడ్డతో తయారు చేసేరు ఆజండా. దానిమీద చావోభార్య తెల్ల అక్షరాలుకుట్టింది. ఆ ఎర్రజెండా చూడ గానే సియావో దాన్ని తీసుకురావద్దన్నాడు. దాన్ని దక్షిణపుద్వారంపక్కనే గోడమీద పాతేరు. అది గాలికి రెపరెపలాడుతూ ఎగురుతోంది.

సియావో, మిగతాజనం దక్షిణద్వారందాటి కందకంమీదవున్న కర్రవంతెనదాటి, రోడ్డెక్కేరు. ముగ్గురు, నలుగురుకలిసి ముందుకి సాగిపోతున్నారు. రోడ్డుకి అటూ యిటూవున్న మొక్కజొన్న వాళ్ళకన్నా ఎత్తుపెరిగిపోయింది. ఇద్దరు స్కౌట్లు తుపాకు లతో ముందువెళ్ళి పొలాలు వెతుకుతూ దారిచేస్తున్నారు.

"త్వరగారండి" వెనకబడినవాళ్ళని చెయ్యివూపుతూ పిలిచేడు సియావో. "అక్కడవున్న రెండు డిబ్బల్లో ఒకదానికాడికి పరుగెత్తాల"

ఇంతలో ఎదురుగా రెండుగుళ్ళ చప్పుళ్ళు వినిపించేయి. చెవులురిక్కిస్తూ సియావో, "వాళ్ళు ఇంకా దూరంగానేవున్నారు. దాదాపు అరమైలుదూరంలో. అది జపాన్ వాళ్ళ మరతుపాకిమోత." అన్నాడు.

కొందరు తుపాకి శబ్దానికి జడిసి కింద బోర్లాపడుకున్నారు.

"లేవండరా్రి. నావెనకేరండి, ఏంప్రమాదంలేదు."అన్నాడు సియావో.

దగ్గర్లోనే పొలంలోంచి మరోగుండు కిందగా దూసుకొచ్చింది.

"చెదిరిపోండి! వంగుకోండి!" సియావో అరిచేడు, తనుమాత్రం నించునే వున్నాడు. ఇంతలో మరోగుండు అతని కుడిచేతిపక్కగా దూసుకెళ్ళింది.

"దెబ్బతగిలిందా?"అంటూ చిన్నవాంగ్, లియూ-షెంగ్ అతనిదగ్గరకు వెళ్ళేరు.

"ప్రమాదమేమిటిబాబూ?"అంటూ చావో, కువో వచ్చేరు.

"ఏంలేదు, కొంచెం గీచుకుందంతే"అన్నాడు సియావో,

"మీరు తొందరగా వంగుకోండి."

ఇంతలో మరో గుండొచ్చి చావో తుపాకీకి తగిలింది. ఉగ్రుడయిపోయేడతను. చావో వంగుకోడానికిబదులు నిటారుగా నించున్నాడు. గుండు వచ్చిన దిక్కుగా తుపాకీ పేలుస్తూ పరుగెత్తేడు. అతని వెనకవున్నవాళ్ళకు అతను మొక్కజొన్నదిబ్బ ఎక్కడం కనిపించింది. తర్వాత చేతులు పైకిలేపి పడిపోయేడు. అతని టోపీ పడిపోయింది. రెండుముక్కలు విరిగిపోయేయి. కాని తుపాకిని కుడిచేత్తో యింకా గట్టిగా పట్టుకునే వున్నాడు. బట్టలపంపకంలో అతని కిచ్చిన నీలంచొక్కా నెత్తుటితో తడిసి ముద్దయిపోయింది.

"ఎక్కడ తగిలింది?" సియావో చావోపక్కనే చతికిలబడ్డాడు. అతని కుడిచేతికి కట్టువుంది. ఎడమచేత్తోనే జాగ్రత్తగా చావోతలని ఒళ్ళోపెట్టుకున్నాడు. సియావో వాన్‌ని కట్టుకట్టమన్నాడు. అవసరమైతే జిల్లా ఆస్పత్రికి పంపమని చెప్పేడు. లేచి నించుని గుండు వచ్చిన దిక్కుగా పేల్చేడు. శత్రువు కొంతసేపు ఆగేడు. సియావో జనంతో ముందుకు సాగేడు.

కువో వచ్చి చావో పక్కన కూచున్నాడు.

"చైర్మన్ చావో!" చావో పాలిపోయిన ముఖం చూసేసరికి కువోకి గొంతు అడ్డుపడింది. ఇంకేమీ చెప్పలేకపోయేడు. చావో మెల్లగా కళ్ళువిప్పి వగురుస్తూ "ఎల్లండి, పోరాడండి. నా తుపాకీ తీసుకో. నన్నొగ్గేయండి"అన్నాడు నెమ్మదిగా.

తుపాకీ ప్రేలుడు ఎక్కువయింది. పక్కలనుంచీ గుళ్ళు దూసుకు పోయేయి, చావో మీదికి మట్టి ఎగిరిపడింది.

"మీరంతా వెళ్ళిపొండి. నాకు తోడుగా ఒక్కరుండండి" అన్నాడు వాన్.

గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంటూ కువో 'ఊ'ని వుండ మన్నాడు. తర్వాత చావో చెయ్యి తట్టి, తుపాకి తీసుకులేచేడు.

"తూటాలు" అన్నాడు వాన్

కువో చావో తూటాల బెల్టు తీసి తను తగిలించుకున్నాడు. వెలిసి పోయిన ఆకు పచ్చ బెల్టు రక్తంతో జిగురుగా వుంది.

కువో సైనికుల్ని కలుసుకుని సియావోతో పాటు ముందు కురికేడు. వెయ్యి మంది వరకూ గ్రామస్తులు కూడా అరుస్తూ ముందు కురికేరు. అకుల గలగల, అడు పులు దూరమవగానే పళ్ళు బిగించడం ఆపి, మూలిగేడు చావో.

"అబ్బా! అయ్యో!"

వాన్ చావో కోటు విప్పేడు. పొట్టకి కుడివైపుగా చెయ్యి దూరేటంత పెద్ద గాయమయింది.

"మరోదెబ్బ కొట్టెయి"అని బతిమాలికున్నాడు.

"బాగయిపోతుందిలే"అన్నాడు వాన్. గాయం ఆపడానికి ప్రయత్నిస్తుంటే అతని కళ్ళల్లో నీరుతిరిగింది. చూని బండితెమ్మన్నాడు- చావోని జిల్లా ఆసుపత్రికి తీసుకుపోడానికి.

"నన్ను బేగి సంపెయ్యండి"అని మూల్గేడు చావో.

"నువ్ బాగయిపోతావ్. ఆస్పత్రికి తీసుకుపోతాం"

తుపాకి పేలుడుశబ్దం తగ్గిపోతోంది- అంటే బందిపోట్లు బాగా దెబ్బతిన్నారన్న మాట. సియావో, మిగతావాళ్ళు ఓ దిబ్బ ఎక్కేరు. అక్కడినుండీ బందిపోట్లు మొక్కలచాటున అటూ ఇటూ పాకడం కనిపిస్తోంది.

ఒకపక్క శత్రువుని దూరంగావుంచుతూనే మరోపక్క సైనికులు రక్షణగా తమచుట్టూ రాళ్ళు, ఇటికలు పేర్చేరు. సియావో కొందరిని తమ పారలతో, ఈటెలతో

కందకాలు తవ్వపనిచెప్పేడు. యుద్ధం ఎన్నిరోజులైనాసరే జనాన్ని పోరాటానికి సిద్ధం చేయసాగేడు సియావో.

బందిపోట్లు మళ్ళీ ముందుకు రాసాగేరు. దిబ్బదగ్గర్లోకి వచ్చేరు. సియావో సైగచెయ్యగానే అందరూ మొదటవరసలోవున్న వాళ్ళమీద పేల్చేరు. ఇద్దరు గాయ పడ్డారు. మిగిలినవాళ్ళు పారిపోయేరు.

కొద్దిసేపుపోయేక మళ్ళీ ముందుకొచ్చేరు. ఈమారు గుంపుగారాకుండా ఇద్ద రిద్దరుగా విడిపోయి, రాళ్లపేర్చినచోటికి వచ్చేరు.

"నువ్కాసేపు ఆగుతమ్ముడూ" పక్కనేవున్న సైనికుడితో అన్నాడు హువా యంగ్-సీ. ఆ సైనికుడి కుడిచేతికి దెబ్బతగిలింది. హువా తన తుపాకీదాచి శత్రువు తుపాకి ఒకటి, చచ్చిపోయిన బందిపోటు తూటాలూ తీసుకున్నాడు. ఇంతలో ఓ గుండు అతని గడ్డిటోపిలోంచి దూసుకుపోయింది. వెంటనే బోర్లాపడి తుపాకీని రాతి మీద పెట్టేడు. మిగిలినవాళ్ళని కదలొద్దని చెప్పేడు. ఎడంకన్ను మూసి, కుడిచెంప తుపాకీకి ఆనించేడు. గాని ట్రిగ్గర్ లాగలేదు. బందిపోట్లు ఇంకాదగ్గరికి వచ్చేరుగాని హువా కదల్లేదు.

"వెధవా! కాల్చవేరా తొత్తుకొడకా!" కుడిచెయ్యి సలుపుతున్నా తన తుపాకీ ట్రిగ్గర్ లాగబోయేడు సైనికుడు. కాని తుపాకీలో తూటాలేదు. తలెత్తి చూస్తే, హువా యింకా పేల్చడంలేదు. అతను ముందుకి దూకి తుపాకీతో హువాని కొట్టబోయేడు.

"తొందరలేదు. నువ్సూడు" అన్నాడు హువా.

హువా ట్రిగ్గర్ లాగేడు. ఒక బందిపోటు పడిపోయేడు. మరోసారి— మరో బందిపోటు పడ్డాడు. మూడోదెబ్బకి ముందువాళ్ళు చెదిరిపోయేరు. వెనకనున్నవాళ్ళు కొంతసేపు సందేహించి మళ్ళీ పారిపోయేరు.

"నీపేరేంటి?" అన్నాడు సైనికుడు, ఆనందంగా హువా చెయ్యినొక్కుతూ,

"హువా. 'సూటిగుండు' అనికూడా అంతారు. కొద్దిరోజుల్లో పప్పన్నం ఎడతాడు" అన్నారెవరో.

"ఆడిమాటలు ఇనకు బాబూ" అని నవ్వుతూ అన్నాడు. హువా తుపాకి వదల కుండానే.

టీమ్‌లీడర్ సియావో అందరినీ తూటాలు లెక్కపెట్టుకొమ్మన్నాడు. ఆ సైనికు డికి ఒక్కతూటాకూడాలేదు. మిగిలినవాళ్ళకి చాలా తక్కువున్నాయి. 65 నంబర్ తూటాలన్నీ కువోకిచ్చేరు. అతను చావో తుపాకి వాడుతున్నాడు. 79 నంబర్ తూటాలన్నీ హువాకిచ్చేరు. అతను శత్రువు తుపాకీ వాడుతున్నాడు. హువా ముందు

నించున్నాడు. తూటాలన్నీ అయిపోయినా రక్షణ సైన్యం రానిపక్షంలో బాయ్‌నెట్లతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నారందరూ— అప్పుడు సియావో కువోని పిలిచి ఆదేశా లిచ్చేడు. కొద్దిసేపటికి కువో, చిన్ అనే సైనికుడు దిబ్బపక్కగావున్న పొలం గట్ల పక్కనుంచీ పాక్కుంటూ పొదల్లోకి వెళ్ళిపోయేరు.

ఉన్నట్టుండి శత్రువుకు దూరంగా తుపాకీచప్పుళ్లు వినిపించేయి. శత్రువులో కొంత కలకలం చెలరేగింది. వాళ్ల జిల్లా కమిటీనుంచి రక్షణబలం వచ్చిందనుకుని అటు తిరి గేరు. ఇటువైపుగా కొద్దిమందిని మాత్రమే వుంచేరు.

"అసలు బలాన్నంతా అటు తిప్పుకుంటున్నారు" అని నవ్వేడు సియావో. తుపాకీ దించి పొగాకు చుట్టుకుంటూ హువాని

"ఇంత తక్కువ తూటాలతో రాత్రివరకు ఆపగలవా?"

"ఆపగలననుకుంటా బాబూ"

"నీకంత గురి ఎలాకుదిరింది?"

"నాను బుడతగా వున్నపుడు ఏటకెల్లీవోన్ని. అలాగే గురికుదిరినాది. సరిపడ తూటాలుంటే నాయాల్లందర్నీ ఇయ్యాలే సఫా సేసీసీవోల్లం" అంటూ మళ్ళీ తుపాకీ సర్దు కున్నాడు హువా.

"హువా శీతాకాలంలో ఏటకెల్తే దెబ్బకి రెండు పిట్టలు కొట్టుకొస్తాడు" అన్నా రెవరో.

"పిట్ట తేలికేగాని లేడితోనే వస్తాది తంటా. పీ అడుగు ఇనంగానే రయ్యని దూసుకుపోతాది. దానికి మరి గుండు తగల్దే!"

"ఎలుగుబంటికూడా కష్టమేగదా?" సిగరెట్టుపొగపీలుస్తూ అడిగేడు సియావో.

"దాని మెలకువ ఎరికయితే తేలికే. మొదటిదెబ్బగాని తగలకుంటే నువ్ ఎం టనే తప్పుకోవాల, అది నీమీదికే వస్తాది. పక్కకి తప్పుకోకపోతే నీపని అయినట్టే. ఎలుగుని సంపాలంటే తెలివీ, ధైర్యంకూడా కావాల. దాన్ని సూస్తేనే ఒంకలు వుడ తాయి."

సాయంత్రానికి బందిపోట్లు మళ్ళీ యిటుతిరిగేరు. వెనకపక్క తుపాకీ చప్పుళ్ళు వుత్త నాటకమని తెలిసినట్టుంది. ఈసారి జోరుగా సాగించేరు. గుండుమీదగుండు దూసుకొస్తోంది, ఒక గుండుకి సియావోటోపీ ఎగిరిపోయింది, కొంచెం జుట్టుతోపాటు. చిన్నగాయమే అయింది. హువా నెమ్మదిగా తనపనికానిస్తున్నాడు. ఏదైనా తల పైకి లేవగానే 'ఢన్'మని కొట్టేస్తున్నాడు.

"దొంగనాయాళ్లు, మళ్లాముందుకురుకుతున్నారు"అన్నాడు హువా సియావోతో.

"వాళ్ళకి ఎదురెల్దాం రండయ్యా"అంటూ సియావో, హువా ముందుకురికేరు, దిబ్బ దిగసాగేరు.

"సంపండి. బయ్యంనేదు. ఇప్లవంలో సావుకి ఎనకాడకూడదు, బందిపోటు హాన్‌ని సంపితేగాని మనసు సల్లపడదు" అంటూ గర్జించేడు హువా. గర్జిస్తూనే తుపాకీ పేల్చేడు. సియావో పేల్చేడు. ఇద్దరు బందిపోట్లు పడిపోయేరు.

వెనక వుండిపోయినవాళ్ళు సియావోవెనకే పరుగెత్తేరు. ఈ కొలుమాత్రమే వున్నవాళ్ళు చచ్చిపోయిన బందిపోట్ల తుపాకులు, తూటాలు తీసుకున్నారు. అలా నాలుగు తుపాకులు, లెక్కలేనన్ని తూటాలు పట్టేరు. ఇక హువా విజృంభించేడు— దెబ్బతర్వాత దెబ్బ, గుండుతర్వాత గుండు. ఈసారి తలలకుకాకుండా శరీరాలకే గురి చూస్తున్నాడు— తేలికని. ప్రతి పదిమందిలోనూ అయిదుగురిని దెబ్బకొట్టగలుగుతున్నాడు.

"పొడుగుమెడహాన్!" శవాల్లో పొడుగుమెడ చూసి ఎవరో ఆనందంగా అరిచేరు. ఇంతకు ముందు అతను పారిపోవడంవల్ల జనం కొంత బెదురుగావున్నారు. కాని ఇప్పుడు నిబ్బరం ఒచ్చింది. వాళ్ళకోశత్రువు తగ్గేడు. వెనకనున్నవాళ్లుకూడా ముందుకొచ్చేరు. ఇంకా యుద్ధం జరుగుతుద్న సంగతే మర్చిపోయి అందరూ హుషారుగా మాట్లాడుకుంటున్నారు.

"అది తిక్క కుదిరినాది."

"జరగాల్సిందే జరిగింది."

"సచ్చేక ఈడి మెడ మరీ పొడుగయిపోనాది."

"ఏట్రా మొగం చిట్లించినావ్? బాదగా వున్నదా? కానీ నిన్ను సుకంగా వుండనిస్తే మాఁవందరం సవ్వమా? బేగిపోయి నీ అరోనంబరుహాన్‌ని కల్సుకో. నరకంలో నీకేసు యిసేరనకి రడీగున్నాది." ఎవరో తాపీగా పొడుగుమెడ హాన్‌తో కబుర్లాడుతున్నారు— వాడింకా వినగలిగినట్లు!

ఇంతలో మళ్ళీ బందిపోట్లలో కలకలంరేగింది. తుపాకీ శబ్దాల్లోంచి దూరంగా మెషిన్‌గన్ల శబ్దం వినిపిస్తోంది. సియావో చెవులు రిక్కించేడు చిన్నవాంగ్‌గొంతుతూ అరిచేడు.

"కామ్రేడ్స్, మన రక్షణ దళం ఒచ్చేసింది. బందిపోట్ల కాడ మెషిన్ గన్స్ లేవు. ముందుకురకండి! కామ్రేడ్స్, ముందుకి! బందిపోట్లని చంపండి!" ఉత్సాహంగా కిందికీ పైకి గెంతుతున్నాడు చిన్నవాంగ్. ఎదురొచ్చే గుళ్ళని పట్టించుకోకుండా పేలుస్తున్నాడు.

"ముందుకి!" లియూ-షెంగ్‌కూడా పేలుస్తున్నాడు. అతని చెమటకి కళ్ళద్దాలు తడిసిపోయేయి- కుడిచేత్తో తుపాకీ పట్టుకుని ఎడంచేత్తో చెమట తుడుచుకున్నాడు. మళ్ళీ "ముందుకి!" అని అరుస్తూ పరుగెత్తేడు. సియావో, హువాల కళ్ళు నిప్పులుచెరుగుతున్నాయి. వాళ్ళు ఒళ్ళు తెలీకుండా పోరాడుతున్నారు. అందరిదీ ఒక్కటే మాట, ఒక్కటే ఆదర్శం: కామందుల్ని, బందిపోట్లను పూర్తిగా తుడిచిపెట్టేయ్యాలి."

వీళ్ళలా అరుస్తూ ముందుకు వురుకుతుండే మొక్కజొన్నచేలోంచి కాకీబట్టలు వేసుకున్న మనుషులు కనిపించేరు వాళ్ళే సైనికులు!* ఒకతను తుపాకీ వూపుతూ,

"కామ్రేడ్స్, ఇక పేల్చకండి! తూటాలు వృథాపోనివ్వకండి! వాళ్ళందర్నీ చుట్టిముట్టి పట్టుకుంటాం"అని అరిచేడు.

"చంపకుండానే ఒట్టుకోగలవా?"అని హువా ఎదురు అరిచేడు.

"తప్పకుండా! బందిపోట్లను అలాగే పట్టుకోవాలి. ఒక్కడైనా పారిపోలేడు. నామాట నమ్మండి."

గ్రామస్తులు, సైనికులు పేల్చడం ఆపేరు. బందిపోట్లు వెనక్కి వెనక్కి బురదలోకి జరిగేరు.

అక్కడ బురదలో ఒక్కొక్కళ్ళే బందిపోట్లందరూ మోకాళ్ళమీదపడి, తుపాకులు పైకిలేపి శరణుకోరేరు. ఒక సైనికుడు ఒక గ్రూపుని పొలాల్లోంచి పైకి లాగగానే గ్రామస్తులంతా ఈటెలు హత్తుకుంటూ చప్పట్లుచరచేరు.

"అలు ఎయ్యిమందిదాకా ఉంటారేటి?" అన్నారొకరు, సైనికుల్ని ఉద్దేశించి.

"నేడు, ఓ కంపెనీ వుంటారంతే"నని జవాబొచ్చింది.

బందిపోట్లని నిరాయుధుల్నిచేసి, కట్టిపడేసేరు. దాదాపు ఏభైమందిలో ముప్పై ఏడుగురిని పట్టుకొన్నారు. మిగిలినవాళ్ళు చచ్చిపోయుంటారు. కంపెనీ కమాండర్ పేరు 'మా'- బొద్దుగావున్నాడు, పెడల్పుముఖం, పెద్దపెద్ద కనుబొమ్మలు. సియావో ముందుకెళ్ళి అతనిచెయ్యి పట్టుకున్నాడు. వాళ్ళిద్దరూ పాతస్నేహితులు.

"నీ కబురు మధ్యాన్నం అందింది"అన్నాడు మా. "సెక్షన్‌లీడర్ చాంగ్ బందిపోట్లు వూరిమీద పడ్డారేమోనని యువాన్ మావోకే వెళ్దామన్నాడు. కాని నాకు ముందు సొంచియావచ్చి, తర్వాతనే వూరువెళడం మంచిదనిపించింది నేననుకున్నది నిజమయింది- నువ్వు ఇంతసేపూ వాళ్ళని ఆపగలవని నాకు తెలుసు."

---

* సంయుక్త ప్రజాస్వామ్య సైన్యం.

"ఖైదీలని యువాన్ మావో తీసుకుపోదామా?" నవ్వుతూ అడిగేడు చియావో.

"కాదు వాళ్ళని జిల్లా కమిటీకి తీసుకుపోవాలి. తర్వాత బందిపోట్లు ఎలా వుంటారో చూపించడానికి 'ఎమెన్ ఫో' తీసుకుపోవాలి."

"కాని మాకు హాన్ తమ్ముడు- ఏడోనంబరుహాన్ని ఒడిసెయ్యాలి. యువాన్ మావో పల్లెజలకి అతనుకావాలి. మిగతావాళ్ళని మీరు తీసుకుపొండి. అతన్ని ఎవరు గుర్తుపడతారు? మనం తీసుకుపోదాం."

చాలామంది అతన్ని వెదికేందుకు ముందుకొచ్చేరు. అందరినీ వెదికేక ఎవరో అరిచేరు. "ఆడు పారిపోయుంటాడు. ఇక్కడలేడు"

"పారిపోయేడా?" బాధగా అరుపులు.

"ఈ సిన్ని సేపలు దేనికి? అసలు సేపలలోంచి తప్పుకున్నాది."అన్నాడు హువా.

"పులి మళ్లీ గూడు సేరుకున్నాది. యువాన్ మావోకి ఇంకా పెమాదమే!" ఓ గడ్డిటోపీమనిషి కంపెనీ కమాండర్ 'మా'దే పూచీ అయినట్టు నిష్ఠురంగా అన్నాడు.

"వన్నెపులుగుకన్నా జిత్తులమారిపిట్ట, నక్కకన్నా జిత్తులమారి జంతువు, ఏడో నంబరు హాన్‌కన్నా జిత్తులమారి మనిషీ నాకెక్కడా అవుపళ్లేదు" అన్నాడు మరొకడు.

"ఆడు రాచ్చసుడు" అన్నాడు హువా. "కిందటేడు ఆడు మనూరు వచ్చినాడు కదా, అప్పుడు కర్రో, మరతుపాకో సేతపట్టుకునే తిరిగేవోడు. పగలు కాపలా వుండేవోలు. రాత్రిల్లు దోచుకోను వూరిమీద పడిపోయేవోలు. పెట్టెల్లోంచీ, అలమర్లలోంచి అన్నీ తీసుకునేవోడు. ఆడోల్ల గుడ్డలూడదీసి నించోబెట్టి తనివితీరా సూసేవోడు".

"ఆడు పెతీ యింటినీ రగడ సేసీవోడు. మిగతాదికాక వందగుర్రాలు తీసుకుపోనాడు" అన్నాడు గడ్డిటోపీ మనిషి.

"ముప్పై ఇల్లని తగలెట్టీసినాడు".

" 'కూ' కోడల్ని తీసుకుపోనాడు, తర్వాత దొరికినాది"

"వాడిది ఏ యూనిట్?" అనడిగేడు సియావో.

"కొమింటాంగ్ పెబుత్వంలో మూడో సైన్యపోడు అదేటో సంరచ్చనా సైన్యం. సరిగా ఎరికనేదు" అన్నాడు హువా.

"ఆడు బతికేవుంటే ముక్కలు ముక్కలుగా నరుకుతాం" అన్నాడు గడ్డిటోపీ మనిషి, హాన్ తమ్ముడు తన గుర్రం ఎత్తుకుపోవడం గుర్తొచ్చి.

కంపెనీ కమాండర్ 'మా' కొంచెం చిత్తరపడ్డాడు ఇంత బలగంలోంచి బందిపోట్లనాయకుడు ఎలా తప్పుకొనుంటాడు? ఉన్నట్టుండి 'అతను చచ్చిపోయేడేమో'ననిపించిందతనికి. ఆ మాటే సియావోతో చెప్పేడు.

"ఏడోనంబరు హాన్ చచ్చిపోయివుండొచ్చు. అయినా ఆ వెధవల్ని మరోసారి అడుగుదాం. ఈలోగా మీరు శవాలు వెదకండి".

కంపెనీ కమాండర్ ఖైదీలని ఎదురుప్రశ్నలేసేడు. కొందరు అతను పారిపోయేడన్నారు. కొందరు చచ్చిపోయేడన్నారు. కొందరు వజ వజ వణకడంతప్ప ఏదీ చెప్పలేకపోయేరు. సియావో హువాని, గడ్డిటోపీమనిషిని శవాలు వెదకమన్నాడు. జొన్న, మొక్కజొన్న చేలలో, రెల్లుగడ్డిలో మొత్తానికి ఓ డజనుమందిదాకా చచ్చిపడి వున్నారు. వాళ్ళ అయుధాలు, తూటాలు తీసేసుకున్నారు. వాళ్ళలో పొడుగుమెడహాన్, హాన్ అంగరక్షకుడు లీచింగ్-షాన్ కూడా వున్నారు. కాని ఏడోనంబరు హాన్ ఏది?

"ఇల్లిడిగో!" హువా అరిచేడు.

"ఎక్కడ?" ఒక్కసారిగా అందరూ అడిగేరు.

"ఇడుగో!" పొలం చివర దుబ్బుల్లోంచి వచ్చింది హువా జవాబు. అందరూ విజయగర్వంతో ముందుకుసాగుతూండగా మళ్ళీ 'ఢన్'మంది! హువా పేల్చేడు.

"ఏటి యింకా సవ్వనేదేటి?" గడ్డిటోపీ మనిషి అడిగేడు.

"సచ్చినాడు గానీ అడు పారిపోకుండా మరోగుండు తగిలించీసినాను" అన్నాడు హువా!

"సచ్చినోడు ఎలా పారిపోతాడు?" అన్నారెవరో. అందరూ నవ్వేరు. అందరు పొదల్లోకి దూకేరు. ఏడోనంబరు హాన్ గడ్డిలో వెల్లకిలా పడుండడం చూసేవరకు ఎవరికీ నమ్మకం కుదర్లేదు.

పొదలన్నీ తొక్కేస్తూ ఇంకా ఇంకా జనం వచ్చేరు. బందిపోట్లని ఓడించినందుకు బందిపోట్లనాయకుడు చచ్చిపోయినందుకు అంతా ఎంతో ఆనందంగావున్నారు. కొందరు రేగుపళ్ళు కోసేరు, కొందరు కంకుల్లేని జొన్నకాడలు నమిలేరు, చెరుకంత తియ్యగా వున్నాయి కాని అన్నిట్లోకి బందిపోట్లనాయకుడి చివరఘట్టమే అందరినీ ఆకర్షించింది. వాడి అంతాన్ని అందరూ కళ్ళారా చూస్తున్నారు.

"నువ్ నిజంగానే ఏడోనంబరుహాన్‌వేనా?" ఎవరో ఆ శవాన్ని అడిగేరు!

"మరైతే దోపిడీసెయ్యవేం?"

"ఆడోల్ల గుడ్డలూడదియ్యవేం?"

"గుర్రాలు దోచుకోవేం ?"

"ఇళ్ళు తగలెట్టవే ?"

"నువ్ ఎంతమందిని సంపేవో యాదస్తుందా : పోలేరమ్మపండగ మూడురోజులూ ఎంతమందిని సంపేవ్ ? ఎన్ని కుటుంబాలు నాశనం సేసీసినావు ?"

"నీ అన్న నీకన్నా ముందే పోయేడు. పోయి ఆడిని కలుసుకో. ఇద్దరూ కలిసి నరకానికి పొండి."

తర్వాత అందరూ నెమ్మదిగా ముందుకినడిచేరు. పొలాలు దాటి సియావోదగ్గరికి వచ్చేరు. అక్కడ సియావో, కంపెనీ కమాండర్ 'మా' దొరికినసామాను లెక్కపెడుతున్నారు— ముప్పైఆరు తుపాకులు, ఓ మరతుపాకీ, బందిపోటునాయకుడువాడిన ఓ పెద్దతుపాకీ. ఆ పెద్ద తుపాకీని 'మా'కి కానుకగా ఇచ్చేరు. పన్నెండు తుపాకులు, తూటాలు సైనికులు తీసుకున్నారు. మిగతావి జిల్లాకమిటీకి వెళ్ళేయి.

హూవా, మిగిలిన గ్రామస్తులు 'మా'చేసిన సాయానికి కృతజ్ఞత తెలియజేసేరు. అంతకు ముందు బందిపోటునాయకుడు పారిపోవడం 'మా'దే'పూచీఅని మాట్లాడినందుకు సిగ్గుపడ్డారు.

" 'మా' బాబూ, మాతో రెండ్రోజులు వుండరాదా?" గ్రామస్థుడడిగేడు.

"కామ్రేడ్ మా! నీ సైనికులందర్నీ ఒట్టుకొచ్చెయ్యి. మాకాడ తినేందుకు మంచిదినేపోయినా శానా మొక్కజొన్న వున్నాది".

"నేను తప్పకుండా వచ్చేవాణ్ణే. కానీ ఈరాత్రికే మేం జిల్లా కమిటీకి వెళ్ళిపోవాలి. ఇక్కడికి పదిమైళ్ళదూరం. అందుకని మీవూరు రాలేముబాబూ".

"అదెలాగవుతాదిబాబూ, మావూరిని బందిపోట్లకాన్నించి కాపాడినావుకదా, మరి మాకాడ మంచినీళ్లైనా ముట్టవా? ఇప్పుడే ఎల్లిపోవాలా? నేదు! నేదు!" అంటూ 'మా' చెయ్యిపట్టుకున్నాడు ఓ ముసలతను.

"నువ్ మావూరురాకపోతే మమ్మల్ని సిన్నసూపుసూస్తున్నావన్నమాట" అన్నారింకొకరు. అందరూ 'మా'చుట్టూ, అతని సైన్యంచుట్టూ చేరేరు. కొందరు 'మా'ని గట్టిగావాటేసుకున్నారు. మరికొందరు మిగతావాళ్ళని లాగసాగేరు. ఇదిచూసి సియావో, లియూ-షెంగ్, చిన్నవాంగ్ వాళ్ళకి పరిస్థితి వివరించేరు. సైనికులకి ఎన్నో పనులుంటాయి. ఎవరో వుండిపొమ్మన్నారని ఆ పనులు ఒదులుకోలేరు.

అప్పుడు 'మా'ని ఒదిలి ఇంటిదారిపట్టేరు.

"పళ్ళు, కాయలు, మొక్కజొన్నలుకోసి మన సైనికులకిద్దాం. సరేనా?" అన్నాడు హూవా.

"సరే"నంటూ వందలాది గొంతులరిచేయి.

"ఇదెవరిపొలం?" అని హువా అడిగేడు.

"ఎవరిదైతేనేంలెద్దూ, తర్వాత ఆ రైతుకి చెప్పొచ్చు". అంతాకలిసి మూడొందల మొక్కజొన్నకంకులు, రేగుపళ్ళు, రకరకాల కాయలుకోసి పరుగెత్తేరు. సైన్యం అప్పటికే కొంతదూరంవెళ్ళేరు. వారివెనుకే పరిగెత్తి ఇవన్నీ జేబుల్లోకుక్కేరు.

తర్వాత శవాన్ని పాతిపెట్టడానికి ఇరవైమందిని అట్టిపెట్టి, కార్యకర్తలు, రైతు సంఘం ఆఫీసర్లు, మిగతా జనం వూరుచేరేరు. అప్పుడే సూర్యుడస్తమిస్తున్నాడు. పశ్చిమాన ఎర్రని మేఘాలు మండిపోతున్నట్టున్నాయి. ఎండిపోతున్న జొన్నచేలు, పచ్చగావున్న మొక్కజొన్నచేలమీదుగా జనం మోసుకొస్తున్న ఈటెలు తళతళమెరుస్తున్నాయి. ఈరోజు జరిగినవి చర్చించుకుంటూ నడుస్తున్నారు. కొత్త తుపాకులు, చచ్చిపోయిన బందిపోట్లు, యింకా ఎన్నో, ఎన్నెన్నో. వెనకాల ఎవరో పాటందుకున్నారు :

> "కమ్యూనిస్టుపార్టీ లేకుంటే
> కొత్తచైనా ఏదీ, ఏదీ ?"

ముందునడుస్తున్న సియావో వెనక్కి తిరిగి చూసేడు. చిన్ కనపడలేదు.

"ఎవరేనా చిన్‌నిగాని, కువోనిగాని చూసేరా ?"

"నేదే" హువా అని వెనకవున్నవాళ్ళని "వైస్‌సెయిర్మెన్ కువో అల్లక్కడున్నాడా ? సియావో బాబు పిలుస్తున్నాడు."

కువోని ఎవ్వరూ చూళ్ళేదు. వాళ్ళకి భయమేసింది. చైర్మన్ చావోకి దెబ్బలు; వైస్‌చైర్మన్ కువో మాయం ! ఏం చెయ్యాలో తోచక అందరూ ఆగిపోయేరు.

"కువోని ఎవరు వెదుకుతారు ?" సియావో ప్రశ్న.

"నేను" అన్నాడు చిన్నవాంగ్.

"నేకూడా" లియూషెంగ్ కూడా తయారయేడు.

"నాసూను" కలిసేడు హువా

ముగ్గురూ మళ్ళీ సాంచియా వెళ్ళేరు, కూడా అయిదుగురు సైనికులు. వాళ్ళు సాంచియా చేరేసరికి సంజచీకట్లు ముసురుకుంటున్నాయి. అక్కడక్కడా జనంశవాల్ని పాతిపెడుతున్నారు. చిన్నవాంగ్ వాళ్ళని ఆ ప్రదేశమంతా వెదకమన్నాడు. కువో వెళ్ళినవేపు వెళ్ళేడు చిన్నవాంగ్. దగ్గర్లోనే ఆకుల గలగల. అతను తుపాకీతీసి 'ఎవరూ?' అన్నాడు.

"నానే! కామ్రేడ్ వాంగ్‌ఏనా?" చిన్‌గొంతులా వినిపించింది. గట్టిగాఅరుస్తూ అక్కడికి దూసుకెళ్ళేడు చిన్నవాంగ్.

"ఇక్కడేవున్నారు! కామ్రేడ్స్, యిటురండి!"

అందరూచేరేరు. కువోకి, చిన్‌కి గాయాలుతగిలేయి. ఒకరికి ఛాతీమీద, మెడమీద, మరొకరికి ఎడంకాలుమీద. ఇద్దరూ నడవలేకుండావున్నారు. దాహంఎక్కువై దగ్గర్లోనేవున్న నీటిమడుగువేపు పాకుతున్నారు. గొంతులు ఎండిపోవడంవల్ల బందిపోట్ల గురించి అడక్కుండా "దాహం! దాహం!"అని అతికష్టంమీద చెప్పేరు.

గాయాలు తగిలినప్పుడు చల్లటినీరు తాగగూడదని చిన్నవాంగ్‌కు తెలుసు. అదే బురదనీరయితే మరీ ఘోరం. వాళ్ళకి నీళ్ళివ్వగూడదనుకున్నాడుగాని వాళ్ళబాధ ఎక్కువయింది.

"కామ్రేడ్ వాంగ్! కసిన్ని నీళుపొయ్యిబాబూ సచ్చి నీకడుపునపడతా" అని కువో బతిమాలసాగేడు

చిన్‌కయితే కోపమొచ్చి తిట్టసాగేడు:

"కామ్రేడు వాంగ్! నువ్ అసలు యిప్లవకారుడివేనా? మాకు నీళెందుకివ్వవ్?"

చిన్నవాంగ్ వాళ్ళకి నీరు మంచిదికాదని వివరించేడు. కాని వాళ్లు వినేస్థితిలో లేరు. ఇంతలో ఓ బండి అటుగావచ్చింది. "కనిపించేరా?"ఎవరో అడిగేరు. అది పాయి గొంతు.

వెంటనే బండిలో గడ్డీపరిచి గాయపడినవాళ్ళిద్దర్నీ అందులో పడుకోబెట్టేరు. బండి యువాన్ మావోవేపు కదిలింది. అప్పుడే అక్కడ వూరిజనం కార్యకర్తలని కువోగురించి ఆరాతీస్తున్నారు.

కార్యకర్తలు, సైనికులు దక్షిణద్వారంచేరగానే జనం యుద్ధాన్నిగురించి ప్రశ్నల పరంపర కురిపించేరు. కొందరు నినాదాలిస్తుంటే, మరికొందరు పంటచేతికొచ్చినపుడు పాడేపాటలు పాడుతున్నారు. మరికొందరు ఏవేవో పాటలు పాడేస్తున్నారు— చాంగ్ చింగ్-సియాంగ్ బాజాబజంత్రీలవాళ్ళని కూడగట్టేడు. డప్పులు, డోళ్ళు మోగించేస్తున్నారు,

ఓల్డ్‌సన్ కార్యకర్తల దగ్గరకువెళ్ళి, జనంకేసి తిరిగి,

"బందిపోటోల్లు ఓడిపోతారని నాకు ముందేఎరిక. టీమ్‌లీడర్ సియావోకి ఎవరేనా ఎదురు నిలవగల్రా?" అన్నాడు,

"అమడదూరాన తుపాకిగుండుకి ఇందాకిందాకే ఎవర్రయ్యా ఒనికినారు?" అని పాయీ నవ్వేడు.

"నాను ముసిలోణ్ని నీలాగా నానూ కుర్రోణ్నయితే ఏ భైమందికాదు, అయి దొండలో, అయిదువేలో వచ్చినా దెబ్బకి ఎగరగొట్టేద్దును".

టెలిఫోను లైను బాగుపడింది. సియావో జిల్లాపార్టీ కమిటీతో మాట్లాడేడు. సెక్రెటరీ సియావోని అభినందించేడు. చావో ఆస్పత్రికి వెళ్ళేదారిలోవున్నాడనీ, చాలా రక్తం పోవడంవల్ల, పేగులు తెగిపోవడంచేత ఆ రాత్రిగడవడమే కష్టమనీచెప్పేడు.

"ఇవేళరాత్రి గాయపడ్డవారిని మరోయిద్దర్ని పంపుతున్నాం. జాగ్రత్తగా చూచుకుంటారని ఆశిస్తున్నాం" అన్నాడు సియావో, ఫోన్ పెట్టెయ్యగానే పాయిని పిలిచి, ఓ బండిలో ఇద్దరు సైనికులతో కువోనీ, చావోనీ, జిల్లా ఆసుపత్రికిపంపమని చెప్పేడు సియావో,

## 20

బందిపోటుదళంమీద తమగెలుపును చాటుకోడానికి మర్నాడు గ్రామస్థులు సంబరం జరుపుకున్నారు. ఇంకా కోతలు మొదలవలేదు, అందరూ ఏవో చిన్నచిన్నపనులు చేసుకుంటున్నారు. కొందరు మట్టిగోడల్ని మళ్ళీ మెత్తుతున్నారు, కొందరు కాంగ్ బాగుచేసుకుంటున్నారు, కొందరు పైకప్పు కన్నాలు పూడుస్తున్నారు, కొందరు చేపలు పడుతున్నారు, కొందరు గుర్రాలకి చెమ్కీలు తయారుచేస్తున్నారు. తొట్లు కడుగుతున్నారు. ఇంతలో వూరికి వుత్తరాన డప్పుమోగి, బాకాలు వినిపించేయి. చొక్కాల్లేకుండానే కుర్రాళ్ళు, చుట్టలుకాలుస్తూ ముసలివాళ్ళు బైటకొచ్చేరు. కొంచెంసేపయేక పనిపాటలు చేసుకుంటున్నవాళ్ళకూడా ఏంజరుగుతోందోనని బైటకొచ్చేరు.

స్కూలు ఆవరణలో పెద్దగుంపు చేరింది, పాటలుపాడుతూ చాంగ్ చింగ్-సియాంగ్ డాన్సుచేస్తున్నాడు. చుట్టూచేరిన జనాన్ని. "కామ్రేడ్స్! మనం ఏడోనంబరు హాన్‌ని ఓడించేసినాం. ఇప్పుడు మనసంగం వుక్కుకన్నా బలంగున్నాది. మీరు పాడమంతున్నారు. ఏ పాటపాడను?" అన్నాడు

*"మాలుఅమ్మకం పాటపాడు"అన్నాడు ఓల్డ్‌సన్, అందరికీ వెనకగా ఓ బండిమీద కమ్చీ తిప్పుకుంటూ నిల్చున్నాడు. అంతక్రితం అతను గడ్డికోసుకురావడానికి స్కూలుదాటి వెళ్ళేడుకాని. ఆ పాటలువిని, మనసుమార్చుకుని తిరిగొచ్చేడు.

---

* యాంగ్‌కో సంగీత నాటకం. 12వ శతాబ్దంలో యెన్ చింగ్ అనే రైతు విప్లవకారుడు లియాంగ్ కొండలదగ్గర్నుండి పట్టణానికి మిలిటరీ సమాచారం కోసం చిల్లరవస్తువుల వర్తకుడుగా వేషం వేసుకువెళ్ళడం వివరిస్తుందీ పాట.

"యువాన్ పావోతుంగ్ చెల్లెలు యెన్‌చింగ్‌ని తిట్టడం" చాంగ్ తన బొంగురు గొంతుతో పాడేడు. చిరతలు తాళంవేసేయి:

"ఏటిఒడ్డుననిన్ను నీతల్లికన్నాది
నీతిమాలిన వెధవ అవుతావని ఎరగదూ"

ఇదిపాడుతూ చాంగ్ ఓల్డ్‌సన్‌ని చూపించేడు. అందరూ పక్కన నవ్వేరు. సియావో చిన్నవాంగ్, లియూ-షెంగ్‌కూడా నవ్వేరు.

"ఈ ఎదవ సూడు ! ఈడిని పెంచి పెద్దచేసి పాటలునేర్పితే ఆడి బాబుకే ఎసరు పెడుతుండాడు" అని ఓల్డ్‌సన్‌కూడా నవ్వేడు.

"ఇది శానా పెద్దది, ఏదైనాసిన్నది పాడు" అన్నారెవరో.

" 'పుచ్చకాయ పగిలింది' పాట పాడు."

చిరతలుకొడుతూ చాంగ్ పాడేడు:

<u>పుచ్చకాయపాట :</u>

గదిలో కూచుని పువ్వులు కుట్టే
గడసరి పిల్లకు ఎదలోన
చిన్నవానిపై తలపులురేగా
సర్సున బయటకు దూకిందీ ॥

చెంపలకద్దా పౌడరుకొందీ
కూరకు రొయ్యలు పీతలు కొందీ
జడలో తురమను జాజులుకొందీ
ఒడిలో ఇన్నీ చిక్కబట్టుకొని
సందిడి కందని కరుబూజాతో
సరసర వెలుపలి కొచ్చిందీ ॥

అయ్యో ! అయ్యో !

దబదబ కురిసే వర్షం వెలుపల ॥
తడబడుతూనే దూకిందీ
జర్సిన జారీ పావడ ఎగిసీ
దిసమొల మొగ్గొకచేసిందీ ॥

పువ్వులు, పీతలు, రొయ్యలు చెదరీ
పౌడరు తడసీ కరిగిందీ
దోరగపండిన కర్బూజా— ఆ
దెబ్బకు పగిలీ విచ్చిందీ

అయ్యోహ్ ! అయ్యో !

ఒచ్చేఏటికి— ఇదిగో ఒట్టు
ఇంత చేసినా పిల్లగాడికి
తడిలో బురదను ముంచినవాడికి
ఇస్తాలే— జత తాబేళ్ళు !

అందరూ నవ్వుతూ చప్పట్లు చరిచేరు.

"ఇలాంటి పాతపాటలొద్దు. ఏదైనా కొత్తదిపాడు"అని అరిచేరెవరో.

"అవును, కొత్తపాట !"అందరూ అరిచేరు.

"సరే, ఎనిమిదో దళం పాటలు పాడతా" లియూ-షెంగ్‌ని చూస్తూ అన్నాడు చాంగ్.

అందరూ హర్షధ్వానాలు చేసేరు. పాత పాటలు విని విసిగెత్తిన పిల్లలు పొడుగువాళ్ళ కాళ్ళసందుల్లోంచిదూరి వచ్చేరు. వాళ్లు యింతసేపూ యుద్ధపు ఆట ఆడుకుంటూ వాళ్ళపాటేదో పాడుకుంటున్నారు. ఇప్పుడు చాంగ్ పాట వినసాగేరు:

వీస్తున్నాయి వీస్తున్నాయి
వసంతగాలులు వీస్తున్నాయి
వస్తున్నాడు వస్తున్నాడు
మావో సె-టుంగ్ వస్తున్నాడు

అపారమాతని శక్తి
అదిగదిగో ఆకాశంలో
వెంటను వున్నది ఎవ్వరో ?
వేలకువేలూ సైనికులు

బాకాలూదుతున్నారు. చాంగ్ పాట అయిపోగానే ఓల్డ్‌సన్ లియూ-షెంగ్‌ని 'తెల్లవెంట్రుకల అమ్మాయి' పాట పాడమన్నాడు. అందరూ పాడమని గొడవపెట్టేరు. ముందుకొచ్చి అతను పాడేడు:

ఉత్తర పవనం వీచింది
మంచు తునకలు లేచాయి

ఉన్నట్టుండి బైట అలజడిరేగింది. ఎవరో నమ్మలేనట్టుగా, 'సీ, అలాంటి మాటలనకు, కళ్లుపోతాయి !' అన్నారు.

"ఉత్త పుకారు"

"నిజంవేనరా్రి, నిజంవే. మీరే సూస్తారుకదా! ఇంతకుముందే శవం 'యాంగ్ చియాతియన్' దాటింది".

గా్రిమస్థులకి పాటలమోజు పోయింది. అందరూ ఇంకేమైనా కబురుతెలుస్తుందేమోనని గుంపుగా జేరేరు. డప్పులు, బాకాలు అన్నీ ఆగిపోయేయి. పాట మధ్యలో ఆపి 'ఏంజరిగింద'ని చిన్నవాంగ్ని అడిగేడు లియూ-షెంగ్.

"చావో..." చిన్నవాంగ్ గొంతు బొంగురుపోయింది. "చచ్చిపోయాటడ".

"ఆఁ! చావో చచ్చిపోయాడా?" లియూషెంగ్ కళ్ళల్లో నీరునిండింది.

చావో శవాన్ని చూసేందుకు చాలామంది ఎదురువెళ్ళేరు. పశ్చిమద్వారం చేరగానే దూరంగానే ఎండిపోయిన జొన్నమొక్కల్లోంచి, పచ్చపచ్చని మొక్కజొన్న చేలోంచి ఓ శవపేటిక కనిపించింది. దాన్ని ఎనమండుగురు మోస్తున్నారు. జనం కూడా దాని వెనకజేరి దానితోపాటే నెమ్మదిగా వూళ్ళోకొచ్చేరు. ఊరికి మధ్యలోవున్న పెద్దరోడ్డుదాటి స్కూలు జేరుకున్నారు. స్కూలు ఆవరణమధ్యలో దించేరు. ఎవరో చిక్కడునూనె దీపంవెలిగించి పేటికదిగువ చెక్కమీదవుంచేరు. మరికొందరు టమాటాలు, ఆపిల్పళ్ళు, బుద్ధుడిముందుంచే పసుపుపచ్చ కాగితాలు చిన్నబల్లమీద వుంచేరు. టోపీలు చేత్తోపట్టుకుని పేటికముందు గుంపులుగా నిల్చున్నారు. కొందరు కింద ఆకుల మీద కూచున్నారు. కొందరు మౌనంగా కూచున్నారు, కొందరు గుసగుసగా

'అతనిపెళ్లానికి ఎరికేనా?'

'ఓల్డ్సన్ చెప్పేందుకెల్లేడు'

'అల్లదిగో, వచ్చేసినాది!'

చావో భార్యతోగూడ పాయిభార్య, చాంగ్భార్య, సో-చూ, పందులకాపరి వూచియా-ఫూ వున్నారు. మిగతా ఇద్దరు ఆడవాళ్ళు ఆమె పడిపోకుండా పట్టుకున్నారు. ఆమె పల్చనిముఖం ఒడిలిపోయింది. ఆమె ఏడవడంలేదుగానీ, పిడుగులాంటి కబురుకు నిర్ఘాంతపోయింది. ఆమె అలా నడుస్తూంటే అందరూ గౌరవసూచకంగాలేచి నిల్చున్నారు.

కాని శవపేటికచూడగానే మోకాళ్ళమీదపడి ఏడవసాగింది. ఆమెకొడుకు సో-చూ, పందులకాపరికూడా ఆమెతోపాటు ఏడ్చేరు. అక్కడున్నవారంతా కన్నీరు కార్చేరు. చావో చాలా మంచిమనిషని, అతను తమకోసమే చచ్చిపోయేడనీ, అందరికీ తెలుసు. అతని చిన్నకుటుంబం చెప్పలేనంత దరిద్రం అనుభవించింది, లెక్కలేనన్ని కష్టాలు ఎదుర్కొంది. కాని వాటినించీ పూర్తిగా బైటపడకముందేచావోవెళ్ళిపోయేడు.

'దేవుఁడో! దేవుఁడో! నానిప్పుడేమిసేతురా దేవుఁడో! నన్నొగ్గిసి పోయినావు కదరా!'అంటూ ఆమె ఏడ్చింది.

'లేవవేమిరా అయ్యా' అంటూ సో-చూ వెక్కెక్కి ఏడ్చేడు.

సియావో తన దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. అటూ యిటూ పచార్లుచేస్తూ చావోని తల్చుకున్నాడు- అతని సాహసం, పార్టీలోచేరడం. అతనికి గుండె పిండేస్తున్నట్లువుంది. కన్నీరు కనపడనీకుండా తలదించుకునే వున్నాడు. ఓచెట్టు కింద కూచుని చేత్తో మట్టికెలుకుతూ కూచున్నాడు. అక్కడ ఓ చిన్నగొయ్యి పడింది. ఈ అర్థంలేనిపనితో సియావో కొంచెం తేరుకున్నట్టున్నాడు, లేచి డప్పులవాళ్ళ దగ్గర కెళ్ళేడు. మామూలుగా అతను సంగీతానికి ఎక్కువసమయం వెచ్చించేవాడుకాదు. కాని ఇప్పుడు డప్పులు, బాకాలుకలిసి తన దుఃఖాన్నితగ్గించి, తనలోని పోరాట పటిమని నిలుపుతాయనిపించింది.

'ఏదైనా వాయించండి' అన్నాడు మెల్లగా.

రాగం సన్నగా సాగింది. ఓ విషాదగీతం- ఇసక పైన 'హంసగానం'వాయించేరు. సంగీతంతో అందరూ కొంత తేరుకున్నారు.

తన భావాల్ని కొంత సంబాళించుకోగల్గేక, చిన్నవాంగ్, లియూ-షెంగ్‌లతో కలిసి ఓ చెట్టుకింద పార్టీమీటింగు పెట్టేడు సియావో. చావో యూ-లిన్‌ని మరణానంతరం పూర్తిపార్టీ మెంబరుగా తీసుకోవచ్చా అన్నదిప్రశ్న. అందరూ ఏకగ్రీవంగా సమ్మతించేరు. సియావో కార్యకర్తల ఆఫీసుకెళ్ళి జిల్లాపార్టీకమిటీకి ఫోనుచేసిచెప్పేడు అతను తిరిగొచ్చేసరికి చావోభార్య ఏడుస్తూనేవుంది.

'ఓర్నాయనో, నువ్‌లేకుండా నేనెలాబతికేదిరో!' డప్పులమోత, బాకాల కూత వినిపించకుండా చావోభార్య ఏడుస్తోంది.

'ఏడవకమ్మా, ఇక ఏడవకు,'అంతకన్నా ఎవరుమాత్రం ఏంచెప్తారు, అందరూ ఏడుస్తూనే వున్నారాయె!

బుద్ధుడి ముందుంచే కాగితాలు వెలిగించేరు. ఆపొగ శవపేటికమీదికి లేచింది. పేటికచుట్టూ అందరూ అర్ధచంద్రాకారంలో నిల్చున్నారు. డప్పులు ఆపేరు. ఉత్తర క్రియలు ప్రారంభమయేయి. అందరూ పిల్లలతోసహా పేటిక ముందు మూడుసార్లు ఒంగేరు. అది అయిపోగానే ఓల్డ్‌సన్ శవపేటిక మూతతీసి చావోభార్యని ఆఖరిసారిగా చూచుకోనివ్వాలన్నాడు. మూతతీస్తూండగా చావోభార్య నీరసంగా లేచి నిల్చుంది.

ఓల్డ్‌సన్ వెంటనే వారించేడు. 'అమ్మా, కళ్లు తుడుచుకో. అతనిమీద ఒక్క కన్నీటిబొట్టుకూడా రాలగూడదు'అని.

తీన్‌తాత 'నీసిడ పడనివ్వకు !' అని సలహా యిచ్చేడు.

'అలా చేస్తే నీ ఆరోగ్యం పాడవొచ్చు'నని ఓల్డ్‌సన్ చెప్పేడు.

ఆమె ఇవేవీ పట్టించుకోలేదు. కళ్లుతుడుచుకోనూలేదు. తన నీడ సంగతికూడా చూసుకోలేదు. ముందుకు ఒంగి పాలిపోయిన మొఖం, మాసినగడ్డం చూస్తూ యింకా బిగ్గరగా ఏడ్చింది, నిలువెల్లా ఒణుకుతోంది, కన్నీరుధారలై కారింది.

ఓల్డ్‌సన్. మరో ఇద్దరు కలిసి వెంటనే మూతపెట్టేసేరు.

ఆమె ఇంకా ఏడుస్తూనేవుంది: "అయ్యో, నీకెన్నికష్టాలొచ్చేయిరా. నీకూ ఇచ్చేరు గుడ్డలు. కాని ఎన్నాళ్ళో తొడుక్కోలేదుకదరా !"

కొందరు చావోమీద చిన్నచిన్న ఉపన్యాసాలిచ్చేరు. అతను ఎంతసేవచేసేడో చెప్పేరు అతని జ్ఞాపకార్థం ఏంచెయ్యాలో చర్చించేరు.

"చావో శానాబాగా పనిచేసేవోడు" అన్నాడు ఓల్డ్‌సన్. "కోడికుయ్యకముందే లేసి, పొద్దోయిందాకా అందరిబాగుకోసం పాటుపడేవోడు. మనందరికోసం పన్జేసేవోడే గాని తన సొంతానికేటీ సూస్కోనేదు. ఏదైనా మనందరికీ ముట్టేకే తను తీసుకునేవోడు. అతను మన మంచి సెయిర్‌మన్."

"చావోనాగే అంతా సేవసెయ్యాల !"అని పాయి అరవగానే అందరూ అందుకున్నారు.

ఓల్డ్‌సన్ యింకా చెప్పేడు: "అతనిది క్లాస్ 1, గ్రేడ్ 1, కానీ అతను క్లాస్ 3, గ్రేడ్ 3 గుడ్డలే తీసుకున్నాడు. అతను ఏటి తీసుకున్నాడో ఎరికేనా? మూడు సింకి పంట్లాంలు, మూడు సింకి సొక్కాలు. పెల్లాంతో ఏటన్నాడు? "ఇంతకుముందులాగాకాక యిప్పుడియేనా దొరికేయి, అంతేశాన !"అని.

దీంతో చావోభార్య మళ్ళీ పెద్దగా శోకాలుపెట్టింది. "అమ్మా నువ్వలాఏడమాక. నువ్వేడిస్తే నాను మాటలు మర్చిపోతుండా"నన్నాడు ఓల్డ్‌సన్, జనంవేపు తిరిగి "అతనికలేడు. మనకోసవే సచ్చిపోయేడు. మనం సచ్చినోళ్ళకి సాయంసెయ్యాలా, మిగిలినోల్లకా?"అని అడిగేడు.

"అతనికుటుంబాన్ని సూస్కోవాల"అన్నారు గ్రామస్థులందరూ ముక్తకంఠంతో

"మన సెయిర్‌మన్ చావో మనందరికోసం సచ్చిపోయేడు" అన్నాడు చాంగ్ గుంపులోంచిలేస్తూ. "ఇప్లవంలో తనపని తాను సేసేడు ఇప్పుడతనికుటుంబం ఇబ్బందుల్లోవున్నది. మనందరం సాయంసెయ్యాల. తిండీ గుడ్డానేకుండా ఒగ్గిస్తామా? ఒగ్గికూడదు, ఏతంతారు?"

"ఒగ్గికూడదు"వెయ్యిగొంతులొక్కసారి పలికేయి.

"మరయితే ఒకోగ్రూపులో చర్చించండి."

అంతవరకు చిన్నవాంగ్, లియూ-షెంగ్ మరోకొద్దిమంది యువకులు కలిసి వాన్, చూ చెప్తున్న వివరాలు వింటున్నారు. చావో పొట్టకి కుడివైపుగా గుండుతగిలిందట. ఆ గాయంలోంచి పేగులు పైకొచ్చేసేయట. వాటిని లోపలికి తోయడానికి ప్రయత్నించేరట. కాని మరోగుండుతో తనని చంపేయమని పళ్ళబిగువున చెప్పేడట చావో.

"కామ్రేడ్ చావో, నీకేంకాలేదు. బాగయిపోతావ్"అని చెప్పేడట వాన్.

ఆసుపత్రిగేటులోకి వస్తూండగా చావోరక్తం కక్కుకున్నాడట. బండి ఆగింది. వాన్ చెయ్యి అందించడు.

"నాను సచ్చిపోతున్నా"నన్నాడట. ఏంవైనా చెప్పాలనుందేమోనని అడిగేడట వాన్. కాని అతను తల అడ్డంగా ఊపి,

"నానింక సెప్పాల్సింది ఏటీన్లేదు. నాను పోతున్నా. కాని ఇప్లవకారుడికి సావంటే బయ్యంనేదు"అని నెమ్మదిగా అన్నాడట. అంతే, మరి మాటలేదట.

అతను చనిపోయేక జిల్లాకమిటీ అతనికి కొత్తబట్టలు, శవపేటిక ఇచ్చేరట.

ఇప్పుడు పాయి పేటికముందు నిల్చున్నాడు. చిన్నవాంగ్, లియూ-షెంగ్ కూడా అటువచ్చేరు. పాయి కళ్ళు ఎర్రిగావున్నాయి. చాలా కొంచెం మాటాడేడు.

"మనందరం రైతులమే. 'బూఁవిలో ఒక్క ఇత్తునాటితే, ఏలకొద్దీ ఇత్తులు మొలుస్తాయి'. ఇది మనందరికీ తెలుసు. చెయిర్‌మన్ చావోని కొమింటాంగ్ బందిపోట్లు సంపేరు. మనందరం సంగాన్ని బలపర్సాలి. అందులో సేరాలి, మనందరిదీ ఒకటే బాట- చావో సావుకిబదులుగా మనం కామందుల్ని, చియాంగ్-కై-షేక్ ఇప్లవ ఎతిరేక సైన్యాన్ని, కొమింటాంగ్‌ని నాసినంసెయ్యాల, నామరూపాలునేకుండా సెయ్యాల"

అందరూ నినాదాలిచ్చేరు. పెద్దలీ ముందుకొచ్చి చొక్కావిప్పుకున్నాడు:

"చెయిర్‌మన్ చావో కామందులకి ఇరోది. అల్లరాజ్జెంలో అతను పడరాని పాట్లు పడ్డాడు. ఆనాడు అతని కట్టెలకి అగ్గెట్టేసు. ఈనాడు కొమింటాంగ్ బందిపోటోల్లు అతనిపేనాలే తీసేరు. మనం ఇది ఒప్పం: సెడ్డోల్లందర్నీ, బందిపోటోల్లందర్నీ కతంసెయ్యాల!"

జనం నినాదాలిస్తూండగా సియావో ముందుకొచ్చేడు. తన స్నేహితుడి మరణం పట్ల దుఃఖాన్ని ఆపుకుంటూ, ఇలా అన్నాడు:

"కామ్రేడ్ చావో యువాన్ మావో గ్రామానికి తగినబిడ్డ. అతను మనకోసం బందిపోట్లతో పోరాడుతూ ఘనంగా చనిపోయేడు. అతని నిస్వార్థం, ధైర్యం మన

పూపిరికావాలి. అతని జ్ఞాపకార్థం ఇంతవరకూ రైతుసంఘంలో చేరనివారంతా చేరాలి, అతని జ్ఞాపకార్థం మనం మన సంఘాన్ని బలపరచుకోవాలి. మన సంఘాన్ని ఎవరూ ఛేదించలేనంత గట్టిగా, ఉక్కులా తయారుచెయ్యాలి. కామ్రేడ్ చావో చనిపోయేనాటికి చైనా కమ్యూనిస్టుపార్టీలో సొంతం సభ్యుడుకాడు. ఇప్పుడు యువాన్ మావో పార్టీ బ్రాంచితరపున చెప్తున్నాను. హోచూ జిల్లాపార్టీ కమిటీ ఇక్కడినిర్ణయాన్ని బలపరిచి, కామ్రేడ్ చావో యు-లిన్‌ని మరణానంతరం పూర్తి పార్టీమెంబరుగా గుర్తించింది".

జనంలోంచి చప్పట్లు ఉరుముల్లా వినిపించాయి. చాంగ్ ఆదేశంతో భేరీలు మోగేయి. ఎర్రజెండా ఎత్తేరు. నీలాకాశంకింద, ఆకుపచ్చని చెట్లమధ్యగా ఎర్రజెండా గర్వంగా రెపరెపలాడింది. ఆడవాళ్ళు, పిల్లలు పాట అందుకున్నారు "కమ్యూనిస్టు పార్టీలేనిదే కొత్తచైనా లేనేలేదు". పాయి, హువా, మరోముగ్గురు సైనికులుకలిసి బందిపోట్లదగ్గర గెల్చుకున్న కొత్తతుపాకులతో గౌరవసూచకంగా పైకిపేల్చేరు. తాపీగాకూర్చుని కబుర్లుచెప్తున్న ఓల్డ్‌సన్ ఉలిక్కిపడ్డాడు, తలమీదటోపీ కిందపడి పోయింది!

'పేల్చేముందు సెప్పలేరేటి? మళ్లీ బందిపోటోల్లు ఒచ్చేసినారనుకున్నా!'అంటూ వాపోయేడు.

హాన్ చుట్టాలు, స్నేహితులు, తొత్తుబతప్ప గ్రామస్థులంతా ఊరేగింపులో పాల్గొన్నారు.

'హంసగానం' విషాదగీతాన్ని వాయించేరు. ఊరేగింపుకి ముందు ఎర్రజెండా ఎగిరింది. జనం అరిచేరు:

"కామ్రేడ్ చావోబాటే మనబాట!"

"చావోలా సేవచెయ్యండి!"

"బందిపోటోల్లని నాసినంచెయ్యండి!"

"దెబ్బకిదెబ్బ తియ్యండి!"

చివరికి ఊరేగింపు ఉత్తరద్వారందాటి నదిఒడ్డు చేరుకుంది. పెద్దలీ, మరికొంతమంది కుర్రాళ్ళుకలిసి తీన్‌తాతకూతురి సమాధిదగ్గర్లోనే గొయ్యితవ్వేరు. అందులోకి శవపేటిక దించుతుంటే చావోభార్య మళ్ళీ పెద్దగాఏడుస్తూ పేటికముందు పడిపోయింది. ఆ తడిమట్టి, ఆకుపచ్చనిరెల్లు అంతా యథాస్థానంలోకి నెట్టేరు అక్కడ ఓ చిన్నగుట్ట లేచింది. ఎర్రని సంజెకాంతుల్లో, ఎర్రఎర్రని జొన్నకంకులమధ్య మందంగాపారే ఏటి ఒడ్డున మరో విషాదగీతం- 'పెద్దగోడమీద మృతవీరుల్ని గుర్తుచేసుకో!'- ఏడుస్తున్న వారి గొంతుల్నిమించిన శృతిలో ఆ విషాదగీతాలాపన సాగింది.

తర్వాత రోజురోజుకీ రైతుసంఘ సభ్యత్వానికి దరఖాస్తులు కుప్పలుగావచ్చేయి. దాదాపు వందమందిదాకా చేరేరు. వాళ్ళలో చాలామంది సియావోదగ్గరకొచ్చి, కమ్యూనిస్టుపార్టీలో చేరాలన్నట్టు చెప్పేరు.

పాయి చెప్పింది నిజమయింది: "బావిలో ఒక్కవిత్తు నాటితే, వేలకొద్దీ మొక్కలు మొలకెత్తుతాయి :"

# 21

కువో, చిన్ యువాన్‌మావో వచ్చిన కొద్దిరోజుల్లో సియావోకి జిల్లా పార్టీ కమిటీ నుంచి పిలుపొచ్చింది—ఇంతవరకు జరిగిన పనిని సమీక్షిస్తూ సమావేశం జరగనున్నదనీ, ఇక ముందు చేయవలసిన కార్యక్రమాలగురించి ఆవూరి ప్రజలకి వివరించి ఒదిలేసెయ్య మనీను. అతన్ని మరో చోటకి బదిలీ చేస్తున్నట్లనిపించిది. అతను వెంటనే కువో, పాయి, పెద్దలీలతో మాట్లాడి కార్యకర్తల మీటింగు జరిపేడు. లియూ-షెంగ్ ఆవూళ్ళోనే వుండి పనిసాగించ వలసిందిగా నిర్ణయమయింది.

వెళ్ళిపోయే ముందురోజు సియావో సంఘానికి వెళ్ళేడు. కువో కాలు యింకా బాగుపడలేదు. కాంగు మీదే పండుకునే వున్నాడు కాంగు చివరగా కూర్చుంటూ సియావో మొదలెట్టేడు:

"లియూషేంగ్, సెక్షన్ లీడర్ చాంగ్ ఇక్కడే వుంటారు. మీకేదైనా సందేహాలొచ్చినపుడు వాళ్ళని కలపండి".

"నాను నాపనికి పనికిరాననిపిస్తోంది" అన్నాడు కువో.

"ఏంభయపడకు. నువ్వు పేదల్ని విశ్వసించు, నువ్వు ఎంత మందిని సంప్రదిస్తే నీ నిర్ణయాలు అంత గొప్పగా, తెలివిగా వుంటాయి".

"మా సంగం ఇంకేటి సెయ్యాల?" సియావో కొంత సేపు ఆలోచించి

" 'తూ' ఎలాంటివాడు? అతనికి భూమి ఎంతవుంది?. అని అడిగేడు.

"దుస్త్రయంలోని 'తూ' ఏనా? ఆడికీ వూళ్లోనే నూటఅరవై ఎకరాలదాకా వుంటాది. ఖైట వూళ్లల్లో ఎంత వున్నదో నాకు ఎరికనేదు"

"జనం అతన్ని ఎదిరిస్తారా?"

"అతన్ని ఎదిరించాలని ఎవరికీనేదనుకుంటా. ఆడి మారుపేరు 'మంచోడు'; ఆడు జనాన్ని బాగా మాయజేస్తాడు. ఆడి సెడ్డతనం ఏటో శానామందికి ఎరికనేదు".

"చెడ్డవాడుకాని కామందు ఎలావుంటాడు?"అని అడిగేడుసియావో. ఆశ్చర్యంగా.

"పెతీకామందు సెడ్డోడే, నాకెరికే. కాని ఆ సంగతి ఇంకా అందరికీ తెలీదే!"

"జనం అతన్నిగురించి ఆలోచించేలా నువ్వుచెయ్యాలిమరి. అన్నట్టు, అతని కింద ఎంతమంది కంబార్లున్నారు?"

"పదిమందిపైనే వుంతారుబాబూ"

"ఒక్కొక్కరు ఎంత పొలంమీద పనిచేస్తారు?"

"సుమారు పదెకరాలు"

"పదెకరాలకి ఎంతపండుతుంది?"

"పంటబాగుంతే ముప్పైపుట్లు"

"అయితే ఏడాదిచివరకి కంబారికి పుట్టిఇస్తాడా?"

"నేదే. ఏడో ఎనిమిదో బస్తాలిస్తారు"

"అదీ! ఇప్పుడుతెల్సిందా కామందు కూలీల్ని ఎలా పీల్చేస్తున్నాడో! ఇలాగే వాదించాలి. ప్రతీ భూకామందు నెత్తురుతాగేవాడేనన్న సంగతి వాళ్ళకిచెప్పాలి. ప్రతి మనిషికీ తన శ్రమఫలితాన్ని తిరిగి తీసుకునే అధికారంవుంది. వివరాలు మాటాడేటైం లేదు. కాని ఇదిమాత్రం గుర్తుంచుకో: జమీందారీవ్యవస్థని కూలదోయడానికి, కామందుల్ని రూపుమాపడానికి, మనకి హక్కుంది. ఏమన్నాఅయితే నీకుదన్నుగా నేనుంటాను. సరే, నేనికవెళ్ళాలి. లియూ-షెంగ్ని కలుస్తూండు. రేపటికి నాకొకబండి చూపెట్టగలవా? సరే, మరివుంటాను. అయ్యో లేవకు, లేవకు, ఉంటా!"నని సియావో వెళ్ళిపోయేడు.

సియావో వెళ్ళిపోతుంటే కువోకి బాధనిపించింది. అతను కాంగుదిగకపోయినా కిటికీలోంచి సియావోని చూస్తూనేవున్నాడు. సియావో తీన్‌తాత ఇంట్లోకివెళ్ళిపోయేక గాని తిరిగి పడుక్కోలేదు

తీన్‌తాతకికూడా వెళ్తున్నట్టుచెప్పేక చావోభార్యని, పాయిన్ని, పెద్దలీనికూడా కలిసేడు సియావో. అతను స్కూలుచేరేసరికి అర్ధరాత్రిదాటింది. అందరూ నిద్రపోయేరు. లియూ-షెంగ్‌నిలేపి తెల్లవారేవరకూ మాటాడేడు.

"పాపం, చావోభార్యకి చాలాకష్టం. ఆమెని బాగాచూసుకోండి. సో-చూని వచ్చేఏడు బడికిపంపడం మర్చిపోకండి" సియావో కళ్ళుమూతలుపడుతున్నాయి.

"సో-చూ! చావోకొడుకా?"అని అడిగేడు లియూ-షెంగ్. అతనికి ఇంకా మాటాడాలనేవుంది.

"ఊఁ" మెల్లగా జవాబుచెప్పి నిద్రలోకి జారుకున్నాడు సియావో. అతను పూర్తిగా చిక్కిపోయేడు. ముప్పైఏళ్ళకే అతనిజుట్టు నెరిసిపోయింది.

మర్నాడు పొగమంచు అలుముకుంది. ఎండ ఎర్రగాకాస్తోంది. ఉదయం చాలా హాయిగావుంది. తమ విజయంతర్వాత కార్యకర్తలకికూడా ఆ వుదయమంత హాయిగా వుంది.

"ఒకేవూళ్ళోవుంటే చిరాకు. నాకు వెళ్ళాలంటే హాయిగావుంది." అన్నాడు చిన్నవాంగ్.

"నాకు ఇక్కడ వుండి పోవటమే బాగుంది. ఒకచోటు అలవాటయేక మరో చోటు బాగోదు" అన్నాడు లియూ-షెంగ్.

ఎవరిపని వాళ్ళకి బాగుంది.

స్కూలు ముందు ఖాళీజాగాలోకి బండివచ్చి ఆగింది. నాలుగు గుర్రాలు కట్టి వున్నాయి. బండి ఆగగానే మెడలు ముందుకు సాచి సకిలించేయి. కాళ్ళతో నేలని గీకేయి. నవ్వుతూ. కొరడా ఝళిపిస్తూ కిందికి గెంతేడు ఓల్డ్‌సన్.

"మళ్ళీ నువ్వేనా!" బండిలోకి సామాను ఎక్కిస్తూ అడిగేడు చిన్నవాంగ్.

"మరి నానుకాక ఎవరు? ఈ వూళ్ళో యీ పనికి నన్నుమించినోన్ని రమ్మను" ముడతలు పడ్డ ఓల్డ్‌సన్ ముఖం మీద ఓ చిరునవ్వు వెలిగింది.

"కానివ్వండి తొందరగా" సైనికుల్ని తొందరచేసేడు సియావో. "ఓల్డ్‌సన్, తిన్నగా పోనియ్యి. అందరూ పనుల్లో వున్నారు. ఎవర్నీ కదిలించాలని లేదు" అన్నాడు

దక్షిణ ద్వారం చేరేసరికి పెద్దగుంపు అడ్డేసింది—సియావోకి వీడ్కోలు చెప్ప డానికీ, ప్రతి ఇంట్లో నుంచి, ప్రతిరోడ్డు మీదనుంచి ఆడ మగ అందరూ వచ్చేరు. బండి మీదకి మొక్కజొన్న పొత్తులు, పళ్ళు, కాయలు విసిరేరు.

"ఇంకా ఏస్తే గుర్రాలు బండి నాగలేవు. ఆగండి" అంటూ గుర్రాల్ని అదిలించే డు ఓల్డ్‌సన్. గుర్రాలు ఓ చిన్న గుట్టదిగి మళ్ళీ రోడ్డెక్కేయి.

సూర్యుడు ఉదయిస్తున్నాడు—రకరకాల రంగులు ప్రదర్శిస్తూ జొన్న, మొక్క జొన్న పంటకొచ్చేయి. ఆకుపచ్చని మర్రిఆకులు, మిగతా చెట్ల ఆకులు బంగారం రంగుతో మెరుస్తున్నాయి.

"కొద్ది రోజుల్లో మంచు కురిసేలా వుంది అన్నాడు ఓల్డ్‌సన్. "మంచులో పంట మరిక పెరగదే! ఇక అందరూ కోతలు మొదలెట్టేస్తారు. అందుకే కోతల కాలంలో వారంరోజులు, ఏవీ పనుల్లేని చైత్రమాసంలో నెల రోజులపెట్టు. అంత అడావుడిప్పుడు"

"సరైన సమయానికి కోతలు పూర్తిగాకపోతే?"

"సలిలో సచ్చేలా కష్టపడాల్సిందే!"

బండి మళ్ళీ దిగుతోంది. ఆ ప్రదేశం వానాకాలంలో రొచ్చు రొచ్చుగా వుంటుంది. కానీ ఇప్పుడు ఎండిపోయింది.

ఓల్డ్‌సన్ నీకు గుర్తుందా? ఇదేచోట ఆరోజు హాన్ బండివాడు నీ మీద బురద తుళ్ళించేడు!"

"ఎందుకు మరుపొస్తాది బాబూ? అప్పుడు హాన్‌దే రాజ్జెం. అడి మాపేశాసనం. అడికి మనం నవ్వాలనుంటే మనం బతకలేవేఁ. ఇప్పుడు అడిసూరీడు పోయి మన సూరీడు పైకొచ్చేసినాడు. నువ్‌గాని రాకపోతే మాకు ఇయాల ఇయాలలాగా వుండేదా సియావో బాబూ?" అన్నాడు ఓల్డ్‌సన్.

"అదుగో, మళ్ళీమొదలు!" అని నవ్వేడు చిన్నవాంగ్.

"నాను నిజం సెప్తున్నాను, అంతే"అని తప్పించుకున్నాడు ఓల్డ్‌సన్.

"చేసిందంతా వూళ్ళోవాళ్ళే, వాళ్ళు లేకుండా మేమేంచెయ్యగలం?"

"సియావో బాబూ, నానోటి అడుగుతాను సెప్తావా? ఇది పెజారాజ్జెం కదా,? మరి పెజలు సెప్పింది ఇనుకోవద్దా?" అని తెలివిగా అడిగేడు ఓల్డ్‌సన్.

"అవును, వినాలి" అన్నాడు సియావో.

"అద్దదీ, మరయితే నువ్వే అంతా సేసినావని మా(పంతాం. మాపు సెప్పినాం కాబట్టి నువ్ ఇనుకోవాల. జిల్లాకమిటీలో కూడామామాటే నెగ్గుతాది. అల్లుమాత్రం ఎలా కాదంతారు? నీ మంచి అంతా యువాన్ మావో వూరోల్లకి తెలిసినాదికదా. అల్లకి కూడా తెలుస్తాది. అల్లంతానిన్ను పొగిడేస్తే నన్ను మర్సిపో మాకు బాబూ!"

"పోనిద్దూ, అక్కడికి మధ్యాన్నానికి చేరుకోవాలి" అన్నాడు సియావో నవ్వుతుంటూ.

"నువ్ కంగారు పడమాకు. నీకెందుకు మజ్జాన్నానికల్లా నిన్నక్కడ దిగబెడతా" నని కొరడా ఝుళిపించేడు ఓల్డ్‌సన్. దుమ్ములేపుతూ జోరుగా దౌడు తీసేయి గుర్రాలు —ఏదో పెద్ద జంతువు తోకలా వెనక దుమ్ము లేచింది. మధ్యాహ్నం కాకముందే కనుచూపు మేరలో ఇళ్ళు, చెట్లు కనిపించేయి— అదే జిల్లాకేంద్రం.

[మొదటిభాగం పూర్తయిపోయింది.]

## చైర్మన్ మావో రగిలించిన తూర్పు పవనం:

"కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం ప్రపంచ విప్లవాకాశంలో ఆధునిక రివిజనిజ మనే కారుమేఘం కమ్మినపుడు, ఒకవ్యక్తి కలాన్ని చేతపట్టి ఈ కారుమేఘాల్ని తరి మికొట్టే తూర్పుపవనాన్ని రగిలించాడు. ఈ కలంవీరుడు యెవరో కాదు. అతడు చైర్మన్ మావో"అని జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరిస్తూ కామ్రేడ్ చారు మజుందార్ ఒక సందర్భంలో అన్నారు.

చైర్మన్ మావో నేటి యుగంలోని గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టు మహోపాధ్యా యుడు. నేడు ఆయన 80వ జన్మదినోత్సవం. 75 కోట్ల చైనా విప్లవ ప్రజలేగాక ప్రపంచంలో దోపిడి పీడనలకు గురౌతున్న జాతులు ప్రజలు చైర్మన్ మావో జన్మ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఆయన చిరకాలం జీవించాలని వారంతా హృదయ పూర్వకంగా కోరుకొంటున్నారు. ఎందుకంటే యావత్ మానవాళికీ, భారత ప్రజా నీకానికీ గొప్ప ఉపాధ్యాయుడు, అత్యంత ప్రేమపాత్రుడైన మిత్రుడు చైర్మన్ మావో. శ్రామికవర్గ శాస్త్రీయ సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజాన్ని ఆయన కాపాడాడు. అభి వృద్ధిచేశాడు. దానిని సంపద్వంతం చేశాడు. ఆయన బోధనలే నేటి యుగపు మార్క్సి జం-లెనినిజంగా చైర్మన్ మావో ఆలోచనా విధానంగా మానవాళి విముక్తికి మార్గ దర్శకం అయ్యాయి.

1953లో కామ్రేడ్ స్టాలిన్ కన్నుమూశాడు. 1956లో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్‌లో కృశ్చెవ్ రివిజనిస్టు కార్యక్రమం వికృతంగా బయటపడింది.

ఆ సమావేశంలో ఆధునిక రివిజనిస్టులు 'మూడు శాంతులు' ప్రతిపాదించారు. ఒకటి: శాంతియుత సహజీవనం, రెండు: శాంతియుత ఆర్థిక పోటీ. మూడు: శాంతియుత పరివర్తన. ఇలా ఆధునిక రివిజనిస్టులు బెరన్‌స్టీన్, కాటస్కీల విద్రోహ సిద్ధాంతాలను దుమ్ముదులిపి ముస్తాబుచేశారు.

ప్రపంచ విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు ఆధునిక రివిజనిస్టులు ప్రతిపాదించిన ఈ మూడుసిద్ధాంతాలనూ చైర్మన్ మావో తుత్తునియలుచేశాడు. వారి దాడినుంచి శ్రామిక వర్గ సిద్ధాంతాన్ని కాపాడాడు; అభివృద్ధి చేశాడు.

సామ్రాజ్యవాదమంటేనే యుద్ధం:

భిన్నమైన సామాజిక వ్యవస్థలుగల దేశాలమధ్య వుండవలసిన ఒకానొక సంబంధంగా శాంతియుత సహజీవనాన్ని కామ్రేడ్ లెనిన్ వివరించారు. కానీ దాన్ని సోషలిస్టు దేశాలు అనుసరించాల్సిన విదేశాంగ విధానంయొక్క సాధారణపంథాగా ఆధునిక రివిజనిస్టులు దిగజార్చారు. ఒకే దేశంలోని వివిధవర్గాల మధ్య వుండవలసిన సంబంధంగా కూడా శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని వీరు అన్వయించారు. సామ్రాజ్యవాదులకూ పీడితజాతులకూ మధ్య, పీడకవర్గాలకూ పీడితవర్గాలకూ మధ్య శాంతియుత సహజీవన సంబంధాన్ని ప్రతిపాదించారు.

బానిసత్వంలో మగ్గుతున్న పీడిత జాతులూ, పీడితవర్గాలూ విప్లవయుద్ధాలు చేయకూడదనీ, 'ఒక నిప్పురవ్వ ప్రపంచయుద్ధంగా ప్రజ్వరిల్లుతుంద'నీ దానితో శాంతియుత సహజీవనానికి భంగంవాటిల్లుతుందనీ ఆధునిక రివిజనిస్టులు ప్రపంచయుద్ధమనే బూచిని చూపి విప్లవప్రజలను లొంగదీయాలను చూశారు.

అణ్వాయుధాల ఉత్పత్తి యుద్ధస్వభావంలోనే మార్పు తెచ్చిందని, యుద్ధంలో అణ్వస్త్రాలే నిర్ణయాత్మకమైనవని, ఆయుధశక్తిముందు మానవశక్తి మోకరిల్లక తప్పదని ఆధునిక రివిజనిస్టుల వాదన.

యుద్ధము-శాంతి సమస్యపై ఈ రివిజనిస్టు సిద్ధాంతాలను చైర్మన్ మావో పటాపంచలు చేశారు. ఈ సమస్యలపై మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాలను వీరి దాడినుండి కాపాడాడు చైర్మన్ మావో యిలా చెప్పాడు: సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం., సామ్రాజ్యవాదం వున్నంతవరకూ యుద్ధప్రమాదం వుంటుంది. సమాజంలో వర్గాలు ఏర్పడినప్పటినుండి, వ్యక్తిగత ఆస్తి ఏర్పడినప్పటినుండి విప్లవయుద్ధాలు జరుగుతూనే వున్నాయి.

ప్రపంచ ప్రజలందరూ మూడవ ప్రపంచయుద్ధం వస్తుందా? రాదా? అని చర్చిస్తున్నారు. మనం కమ్యూనిస్టులం. నిశ్చయంగా శాంతిని కోరుకొంటాం. యుద్ధాన్ని వ్యతిరేకిస్తాం. మనకు యుద్ధం అనవసరం. కానీ సామ్రాజ్యవాదులు మరొకయుద్ధాన్ని ప్రారంభించాలని పట్టుబడితే, అందుకు మనం భయపడకూడదు. 'సామ్రాజ్యవాదులు గోరీ కట్టబడేవరకు వారు గౌతమ బుద్ధులుగా మారరు' అని చైర్మన్ మావో స్పష్టం చేశారు. 'విప్లవం యుద్ధాన్ని నివారిస్తుంది. లేదా యుద్ధం విప్లవాన్ని తెస్తుంది' అని ఆయన నిర్వచించాడు.

ఇంకా ఆయన ఇలా వివరించాడు: ప్రపంచశాంతిని సాధించటానికి మనంసోదర దేశాలతో స్నేహసహకారాలను ఇంకా అభివృద్ధి చేసుకోవాలి. మనతో శాంతియుతంగా

జీవించాలనుకొంటున్న దేశాలన్నిటితో సరిహద్దులను పరస్పరం గౌరవించుకొనే ప్రాతిపదికపై సాధారణ దౌత్యసంబంధాలు ఏర్పరుచుకోవాలి. అయితే శాంతియుతసహజీవనం సోషలిస్టుదేశాల సాధారణ విదేశాంగ విధానం కానేరదు. సోషలిస్టు దేశాలు అంతర్జాతీయ విప్లవ కర్తవ్యాలను నెరవేర్చవలసివుంటుంది. కార్మికవర్గ విప్లవ అంతర్జాతీయత సోషలిస్టుదేశాల విదేశాంగ విధాన సాధారణపంథాగా వుండాలి. ఆసియా, ఆఫ్రికా, లాటినమెరికా దేశాల్లో జరుగుతున్న జాతీయ విముక్తి పోరాటాలను సోషలిస్టు దేశాలు ఖచ్చితంగా బలపర్చాలి." "ప్రపంచంలోని అన్నిదేశాల్లో సాగుతున్న న్యాయమైనపోరాటాలను బలపర్చి తీరాలి"అని చైర్మన్ మావో స్పష్టం చేశాడు.

అణ్వాయుధాలవల్ల ప్రపంచ చరిత్రగమనం మారదు. అణుశక్తి కన్న మానవ శక్తి మిన్న. యుద్ధంలో అంతిమంగా జయించేది న్యాయంకోసం పోరాడుతున్న ప్రజలు; ప్రజలే. మారణాయుధాలు కలిగివున్న సామ్రాజ్యవాదులు, అభివృద్ధినిరోధకులు కాదు అని ఆయన చెప్పారు. సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులతోపాటు వారి అణ్వాయుధాలుకూడా కాగితపు పులులేనని ఆయన ఉద్ఘాటించారు.

అమెరికన్ సామ్రాజ్యవాదులకు అణ్వాయుధాలున్న రోజుల్లోనే 1949లో చైనా విముక్తి పొందింది. 1953లో కొరియాలో అమెరికన్ సామ్రాజ్యవాదం మట్టికరిచింది. ఇండోచైనా మూడుదేశాల ప్రజలు వాడిని తరిమితరిమి కొడుతున్నారు. ఆధునికరివిజనిస్టులు చెప్పేవిధంగా ఏ ఒక్కయుద్ధం ప్రపంచయుద్ధంగా గానీ, అణుయుద్ధంగా గానీ మారలేదు. పైగా జాతీయ విముక్తి యుద్ధాలు. విప్లవ యుద్ధాలు, సామ్రాజ్యవాదుల్ని బలహీన పరుస్తున్నాయి. యుద్ధాలు రెండురకాలు— ధర్మయుద్ధాలు, అధర్మయుద్ధాలు. అభివృద్ధికోసం జరిగే యుద్ధాలన్నీ ధర్మమైనవి. న్యాయమైనవి. అభివృద్ధిని నిరోధించేందుకుసాగే యుద్ధాలన్నీ అధర్మమైనవి. అన్యాయమైనవి. అధర్మ యుద్ధాలను కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తారు. ధర్మయుద్ధాలను వారు వ్యతిరేకించరు. పైగా అందులో చురుకుగా పాల్గొంటారు. వాటికి నాయకత్వం వహిస్తారు.

తుపాకిగొట్టంద్వారానే రాజకీయాధికారం సిద్ధిస్తుంది :

దోపిడీ ప్రభుత్వాలను శాంతియుత ఆర్థికపోటీలో సోషలిస్టుదేశాలు ఓడించాలనీ, అంతవరకు పీడిత జాతులూ పీడిత ప్రజలూ విప్లవ పోరాటాలకు తలపడరాదనీ ఆధునిక రివిజనిస్టుల హేయమైన మరోవాదన.

చైర్మన్ మావో ఈ రివిజనిస్టు కుతర్కాన్ని ఇలా ఖండించాడు: ఈవాదం గతితార్కిక భౌతికవాద సూత్రాలకే విరుద్ధం. ఏ దేశంలోనైనా విప్లవాన్ని సాధించవలసినది ఆ దేశప్రజలే. సోషలిస్టు దేశాలు ఆ విప్లవ పోరాటాలకు సహాయకర పాత్రను మాత్రమే వహించగలవు.

ఎన్నికలద్వారా పెట్టుబడిదారీ విధానం సోషలిస్టు వ్యవస్థకు శాంతియుతంగా పరివర్తనచెందవచ్చని ఆధునిక రివిజనిస్టులు ,వాదిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కఠోరమైన అనుభవాలు మనముందున్నాయి. నూతన సమాజాన్ని గర్భందాల్చిన పాత సమాజానికి బలప్రయోగం మంత్రసానివంటిదని మార్క్సు మహాశయుడు ఉపదేశించాడు. బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని ధ్వంసంచేసి శ్రామికవర్గ రాజ్యాంగ యంత్రాన్ని నెలకొల్పాలని కామేడ్ లెనిన్ పదే పదే హెచ్చరించాడు. చైనా, రష్యా విప్లవాలు యీ వాస్తవాన్నే రుజువుచేశాయి. ఈ సత్యాన్నే సూటిగా "తుపాకిగొట్టంద్వారానే రాజకీయాధికారం సిద్ధిస్తుంది"అని చైర్మన్ మావో బోధించాడు. వర్గాలున్నంతవరకూ వర్గ పోరాటాలు తప్పవని ఆయన వివరించాడు.

## జాతీయ విప్లవాల ప్రాధాన్యత :

వర్తమాన యుగంలోని పరిస్థితులను శాస్త్రీయమైన పద్ధతిలో చైర్మన్ మావో పరిశీలించాడు. నేటి ప్రపంచంలో నాలుగు ముఖ్యమైన వైరుధ్యాలున్నాయని ఆయన వివరించాడు: 1) సోషలిజానికీ సామ్రాజ్యవాదానికీమధ్య వైరుధ్యం 2) సామ్రాజ్యవాదానికీ జాతీయ విప్లవాలకూ మధ్య వైరుధ్యం 3) పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడిదారీ వర్గానికీ శ్రామికవర్గానికీ మధ్య వైరుధ్యం 4) సామ్రాజ్యవాదుల మధ్య వివిధ పెట్టుబడిదారీ గ్రూపుల మధ్య వైరుధ్యం. ఈ నాలుగు వైరుధ్యాలలో సోషలిజానికీ, సామ్రాజ్యవాదానికీ మధ్యగల వైరుధ్యం మౌలికమైన వైరుధ్యం. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీవిధానం నిర్మూలించబడేవరకూ యీ మౌలిక వైరుధ్యం వుంటుంది.

మౌలిక వైరుధ్యం కొనసాగుతున్న సమయంలోనే మరొక వైరుధ్యం ఒకానొక దశలో పరిపక్వదశకు చేరుకొంటుంది. ఆ వైరుధ్యం తక్షణ పరిష్కారాన్ని కోరుతుంది. అదే ఆదశలో ప్రధానమైన వైరుధ్యం. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటం ద్వారానే మిగిలిన వైరుధ్యాలను పరిష్కరించగలం. ప్రస్తుతం సామ్రాజ్యవాదానికీ జాతీయ విముక్తి ఉద్యమాలకూ మధ్యగల వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం. ఆసియా, ఆఫ్రికా, లాటినమెరికా విశాలప్రాంతాల్లో చెలరేగుతున్న జాతీయవిముక్తి పోరాటాలు సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయటంలో కీలకమైనపాత్ర వహిస్తాయి. సామ్రాజ్యవాదుల ప్రపంచ వ్యూహాన్ని పటాపంచలుచేస్తున్న జాతీయ విముక్తి యుద్ధాలప్రాధాన్యతను గ్రహించాలి. 'ఈ విప్లవాలను బలపరచటమూ, భౌతికసహాయాన్ని అందజేయటమూ సోషలిస్టు దేశాల కర్తవ్యం"అని చైర్మన్ మావో సూచించాడు.

రష్యన్ నూతన జారులు 'మూడుశాంతుల'సిద్ధాంతం చేతబట్టి ప్రపంచాన్ని పంచుకోటానికి అమెరికన్ సామ్రాజ్యవాదులతో 'పోటీ-సహకారం'అనే దోబూచులాట ఆడుతున్నారు.

ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు వుండేదేమీలేదు :

అర్ధవలస-అర్ధఫ్యూడల్ దేశమైన చైనాలోని నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం-లెనినిజాన్ని అన్వయించి చైనా విప్లవ విజయానికి ఛైర్మన్ మావో బాటనువేశారు. శ్రామికవర్గ నాయకత్వాన రైతాంగం ప్రధానశక్తిగా గ్రామాల్లో ప్రజాసైన్యాన్ని నిర్మించాలి; గ్రామీణ విప్లవ స్థావరాలను నెలకొల్పాలి. అంతిమంగా పట్టణాలను చుట్టిముట్టి, దేశాన్ని విముక్తి చేయాలనే ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని ఛైర్మన్ మావో రూపొందించారు.

ఆధునిక రివిజనిస్టులు ముందుకుతెచ్చిన ఆత్మహత్యా సదృశ్యకరమైన శాంతియుత పరివర్తనపంథాను వోడించి దానికి ప్రత్యామ్నాయంగా అజేయమైన ప్రజాయుద్ధ పంథాను ప్రపంచ విప్లవ ప్రజలకు ఛైర్మన్ మావో అందించాడు. 'ప్రజాసైన్యంలేకపోతే ప్రజలకు మిగిలేదేమీలేద'ని నొక్కి చెప్పాడు. ప్రజలపై దృఢంగా ఆధారపడి, వారి సంపూర్ణ సహకారంతో ప్రజాసైన్యంచేసే యుద్ధమే ప్రజాయుద్ధమని ఆయన వివరించాడు.

శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవం :

'లెనిన్ తపస్సు, స్టాలిన్ సేద్యం'తో జయప్రదమైన సోవియట్ విప్లవ విజయాలు చివరకు రివిజనిస్టులు చేజిక్కించుకొన్నారు. సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ విధానం పునరిద్ధరించబడింది. పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించబడిన తర్వాత అది సామ్రాజ్యవాద దేశంగా తప్ప మరోవిధంగా వుండలేదు. అక్కడ నూతనతరహా బూర్జువావర్గం తలెత్తింది. నిరంకుశ పెట్టుబడిదారీవిధానం ఆవతరించింది. లాభాపేక్ష చట్టబద్ధం చేయబడింది. ఆర్థికవ్యవస్థ సైనికీకరణ చేయబడింది. మాటల్లో సోషలిజం, చేతల్లో సామ్రాజ్యవాదం అమల్లోకివచ్చింది. తూర్పు యూరప్దేశాలను తన వలసవాద కౌగిలిలో బంధించి వుంచేందుకు 'పరిమిత సార్వభౌమాధికారం'— పాన్‌స్లావిజపు వికృత సిద్ధాంతం తిరిగి జీవంపోసుకొంది. వెనుకబడిన దేశాలకు 'రుణంపెట్టి రణం'తెచ్చే అవినీతి దాపురించింది. ఆయుధాలు అమ్ముకునే 'మృత్యుబేహారులు' తయారయ్యారు. కార్మికవర్గ పార్టీ "ప్రజలందరిపార్టీ"అయింది. కార్మికరాజ్యం "ప్రజలందరి రాజ్యం"అయింది. సోవియట్ యూనియన్‌లో శ్రామికవర్గం తన రాజ్యాధికారాన్ని కోల్పోయింది.

ఇలా సోవియట్ యూనియన్‌లో రివిజనిజం పుట్టి పెరగటానికిగల కారణాలేమిటి? పెట్టుబడిదారీవ్యవస్థ పునరుద్ధరణకు కారణంఏమిటి? సోషల్‌సామ్రాజ్యవాదం ఎందుకు తలెత్తింది? అనే సమస్యలను ఛైర్మన్ మావో నిశితంగా పరిశీలించాడు. పై అనుభవంనుండి గుణపాఠాలుతీసి శ్రామికవర్గ సిద్ధాంతానికి నూతన సంపదను జోడు చేశాడు.

శ్రామికవర్గ నియంతృత్వం తరువాత వర్గరహిత కమ్యూనిస్టు వ్యవస్థ ఏర్పడే వరకూగల సుదీర్ఘ కాల మందంతటా వర్గాలూ, వర్గపోరాటాలూ వుంటాయని ఆయన నిర్ధారణ చేశాడు.

సోషలిస్టు నిర్మాణదశలో ఆర్థికరంగంలోనేగాక సిద్ధాంత, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో అన్ని రంగాలలో దోపిడీవర్గ ఆలోచన అవశేషాలపై తీవ్రమైన పోరాటాలు జరపాలనీ, ప్రజల్లో సోషలిస్టు చైతన్యం పటిష్ఠవంతంగా పాదుకొనేలా చేయాలనీ, ఇదిచాలా కీలకమైన కర్తవ్యమని ఆయన నొక్కిచెప్పారు.

సోవియట్ యూనియన్‌లో వర్గపోరాటాన్ని శక్తివంతంగా, విజయవంతంగా నిర్వహించలేకపోవటమే ఈ దుష్ఫలితాలకు కారణమని తేల్చిచెప్పారు. సోవియట్ యూనియన్‌లో రివిజనిస్టు ముఠా నాయకత్వంలోకి వచ్చిన తదుపరి దేశంలో కార్మిక వర్గ పోరాటాలకు విద్రోహంచేసింది.

పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం చైనాకుకూడా ఎదురయింది. లీషావ్‌చీ నాయకత్వాన వొకవర్గం అక్కడ పెట్టుబడిదారీ పునరుద్ధరణకు ప్రయత్నించింది. సోషలిస్టు సమాజ నిర్మాణానికి సాంకేతిక అంశాలపైన, సైనిక పాటవానికి అధునాతన ఆయుధ సంపత్తిపైన ఆధారపడాలని ఈ వర్గం వాదించింది. సోషలిస్టు సమాజ నిర్మాణానికి ప్రధానంగా ప్రజల చైతన్యంపైన, సైనికపాటవానికి సైనికులకు మనం అందించే సోషలిస్టు చైతన్యంపైన ఆధారపడాలని చైర్మన్ మావో వివరించారు.

సోవియట్ యూనియన్ అనుభవాలనూ, చైనా నిర్దిష్టపరిస్థితులనూ పరిగణనలోకి తీసుకొని శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవానికి చైర్మన్ మావో స్వయంగా పిలుపిచ్చాడు. శ్రామికవర్గ నియంతృత్వాన్ని పటిష్ఠవంతంచేయటం, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించటం, సోషలిస్టు నిర్మాణాన్ని జయప్రదంచేయటం- ఇవి సాంస్కృతిక మహావిప్లవ లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్యసాధనకు పార్టీ కార్యకర్తలపై సాధారణ సభ్యులపైనేగాక కోట్లాది ప్రజలమీద ఆయన ఆధారపడ్డాడు. "పోరాటం- విమర్శ- పరివర్తన"అనే సూత్రాన్ని అనుసరిస్తూ పెట్టుబడిదారీ మార్గస్థులను, పెట్టుబడిదారీ ఆలోచనలనూ పద్ధతులనూ విమర్శించేందుకు చొరవ తీసుకోవలసిందిగా ఆయన ప్రజలను ఉద్వేగపర్చాడు. మూడుకోట్లమంది రెడ్‌గార్డులు ఆయన నాయకత్వాన "పెట్టుబడిదారీ ప్రధానకేంద్రం"పై ధ్వజమెత్తి దానిని ధ్వంసంచేశారు. 'ప్రజలకు తిరగబడే హక్కువుంది' అని చైర్మన్ మావో ప్రకటించారు. బూర్జువా ఆలోచనలపై, పద్ధతులపై పోరాటం హేతుబద్ధంగావుండాలనీ, చర్చల్లో బలప్రయోగం పనికిరాదనీ ఆయన సూచించాడు. "సాంస్కృతిక మహావిప్లవంలోకూడా రాజకీయాధికార సమస్యే కీలకమై

నది"అని నొక్కి చెప్పాడు. శ్రామికవర్గ నియంతృత్వంక్రింద విప్లవాన్ని కొనసాగించే మార్గాన్ని ఆయన వెలిగించాడు. 'ఇంకా అనేక సాంస్కృతిక విప్లవాలు జరగాల్సి వుంది'అని భవిష్యత్ దర్శనంచేశారు.

ఈ విధంగా చైర్మన్ మావో ఆధునిక రివిజనిస్టులుసాగించిన క్రూరమైనదాడుల నుండి మార్క్సిజం-లెనినిజాన్ని కాపాడాడు. దానిని అభివృద్ధిచేశాడు. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా సిద్ధాంత రాజకీయరంగాలలో నిశితమైన పోరాటం సాగిస్తూ ప్రజా యుద్ధ మార్గంలో విప్లవాలను జయప్రదం చేయటం, వర్తమాన ప్రపంచంలో జాతీయ విముక్తి ఉద్యమాల ప్రాధాన్యతను నొక్కిచెప్పటం, శ్రామికవర్గం రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొన్నతర్వాత శ్రామికవర్గ నియంతృత్వంక్రింద విప్లవాన్ని కొనసాగించటం- అంటే అక్కడ పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి సోషలిజాన్ని జయప్రదంగా నిర్వహించేందుకు అనేకసార్లు శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవాలు నడపటం,- అనేవి చైర్మన్ మావో ఆలోచనావిధానంలో ప్రధానమైన అంశాలు. ఇదంతా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి మహానాయకుడు చైర్మన్ మావో సే-టుంగ్ అందించిన అమూల్యమైన కానుక.

చైర్మన్ మావో రగిలించిన తూర్పు పవనం నేడు ప్రపంచం నలుమూలలా ప్రచండ వేగంతో వీస్తోంది. దోపిడి రక్కసి మూకల దుర్గాలను చుట్టుముడుతోంది. ఇది విప్లవాల యుగం. సామ్రాజ్యవాదం సంపూర్ణంగా కూలిపోయి సోషలిజం ప్రపంచవ్యాపితంగా విజయంపొందే యుగం. ఈ యుగంలో ప్రపంచవిప్లవానికి చైర్మన్ మావో, ఆయన ఆలోచన, ఆయన రచనలే మార్గదర్శకం. "భువిని దివిగా చేయనున్న"ఈ మహత్తర తిరుగుబాటుకు ఆయనే నాయకుడు.

కామ్రేడ్స్! చైర్మన్ మావో రగిలించిన తూర్పుపవన తాకిడులు మనదేశ తీరాలను ఏనాడో తాకినయ్. నేడు మనం విప్లవయుద్ధంలో నిమగ్నమైయున్నాం. చైర్మన్ మావో ఆలోచనా విధానంవెలుగులో మన ఈ విప్లవయుద్ధాన్ని ముందుకుతీసుకొని పోతామనే శపథమే చైర్మన్ మావోకు మన అభినందనలుగా వుండాలి.

ఈ శుభ సమయంలో చైర్మన్ మావోకు మన హృదయపూర్వక అభినందనలు అందజేద్దాం. అజేయమైన చైర్మన్ మావో ఆలోచన వర్ధిల్లాలని, ఆయన చిరకాలం జీవించాలనీ ముక్తకంఠంతో నినదిద్దాం. చైర్మన్ మావో నాయకత్వాన జనచైనా దృఢమైన సోషలిస్టు దుర్గంగా, ప్రపంచ విప్లవప్రజల ఆశాజ్యోతిగా వర్ధిల్లాలని నినదిద్దాం. చైర్మన్ మావో నాయకత్వంలో ప్రపంచ పీడిత ప్రజల, పీడిత జాతులమధ్య నెలకొన్న బలోపేతమైన ఐక్యతను వేనోళ్ళ కీర్తిద్దాం.

చైర్మన్ మావో వర్ధిల్లాలి! ఆయన చిరకాలం జీవించాలి!
మావో ఆలోచనావిధానం వర్ధిల్లాలి!
విప్లవ కేంద్రం జనచైనా వర్ధిల్లాలి!
భారత విప్లవం వర్ధిల్లాలి!
ప్రపంచ విప్లవం వర్ధిల్లాలి!

డిసెంబర్ 26, 1973

చైర్మన్ మావో మన ఉపాధ్యాయుడు
చైర్మన్ మావో మనకు మిత్రుడు
చైర్మన్ మావో మనకు మార్గదర్శి

మావో కవిత్వం :

## విప్లవ కాల్పనికత? విప్లవ వాస్తవికత?

కె. వి. రమణారెడ్డి

మార్క్స్ కవిఅని కొందరికైనా తెలిసి వుంటుంది. మావో కవి అని అనేకులకు తెలుసు. మావో పద్య గద్య రచనలు రెండింటిలోనూ సమానమైన ప్రజ్ఞ చూపించాడు. అంతేకాదు, విరామసమయాల్లోగాక విముక్తి పోరాటకాలం అంతటా అటు వ్యాసాలూ ఇటు పద్యాలూ నిరంతరంగా రాస్తూవచ్చాడు. రెండింటిలక్ష్యం ఒక్కటే. విప్లవసాధన.

పసితనంలోనే పద్యరచన ప్రారంభించిన మావో తన తొలిచదువుల ప్రభావంతోటి ప్రాచీన ప్రామాణిక కావ్యాల (క్లాసిక్స్) రచనారీతిని చేబట్టాడు. పురాణకాలపు చక్రవర్తులగురించి, సంఘటనలగురించి, ఆయన పద్యాలలో ఎన్నో ప్రస్తావనలు (అల్యూజన్స్) ఎదురై ఆధునిక పాఠకులకు చిక్కులు కలిగిస్తాయి. అది తనకు తెలుసుకాబట్టే ఏదో ఒకరూ అలా తప్ప తక్కిన యువకవులంతా నవ్యకవిత్వ రూపాలనే ఆశ్రయించాలనీ, తనను ఈ విషయంలో మార్గదర్శకుడుగా ఎంచగూడదనీ నోరువిప్పి చెప్పడం జరిగింది. రూపం ఎలాంటిదైనా, మావో కవిత్వసారం మాత్రం పరమ ఆధునికం.

వెనకటి చరిత్రితాలూకు సంకేతాలనూ పూర్వకవి సమయాలను వాడుకచేసివా, ప్రస్తుత మహాచారిత్రిక ఘటనలను నిర్దేశించడమే కవి ఉద్దేశం. కమ్యూనిస్టుగా తన అనుభవాలూ కవిగా తన అనుభూతులూ యీ పద్యాలలో ఏకీభావం పొందాయి.

చైనాసాహిత్యంలో మేలుబంతులనదగిన రచనలన్నీ చదివిఉండడంచేత, మావో వాటి పద్ధతులను సొంతంచేసుకోగలిగాడు. 'షి'అనే ఒక పాత్రీచీనకావ్య సంకలనం లోనూ 'జు'అనే మరొకదానిలోనూ చేరిన కావ్యాలకు ఒక లక్షణం సర్వ సామాన్యం. అదేమిటంటే, భావం ఎంత నిర్నిబద్ధంగానైనా ఉంటుందిగాని రూపం మాత్రిం మహా పకడ్బందు. మావో పద్యాల లక్షణంకూడా యిదేనని వాటిని అనువదించి ఉపోద్ఘాతం రాసిన మైఖేల్ బుల్లాక్, జెరోమ్‌చెన్‌లు అంటారు. ఇలాంటి పద్యాలకు మాటపొదుపరితనమనేది ముఖ్యం, అనువాదాల్లో సాఫీగా కనిపించపచ్చుగాని, మూలంలో మాత్రం మావో పద్యాలలోని మాటల విన్యాసం కోపాన్నీ ద్వేషాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ సంగ్రామోత్సాహాన్నీ వెలిబుచ్చుతూ ఉద్రేక నిర్భరంగా వుంటుందనికూడా వాళ్లు రాస్తారు. విలాపధోరణిలోరాసిన ఒక గేయం, కవిత్వగుణం అంతగాలేని 'లాంగ్‌మార్చ్' అనే మరొకగేయం, ఈ సామాన్యీకరణకు భిన్నమైన రచనలని పేర్కొంటారు. మావో వచనానికిగాని, కవిత్వానికిగాని సాధారణమైన లక్షణం మొరటుఅందం, పల్లెప్రాంతపు సూటిదనం అని వాళ్ళ అభిప్రాయం. అయితే కవిత్వంలోలాగా వచనంలో మావో గాఢోద్రేకాలు కానరావు. వచనంలో స్థిమితం, తర్కబద్ధత ముఖ్యం.

మావో కవిత్వధోరణి 'సోషలిస్టు రియలిజం'కాదని సోవియట్ సాహిత్యవిమర్శకులదాకా యెందుకు, చైనీస్ సాహిత్య విమర్శకులే అంటున్నారు. 'రివల్యూషనరీ రొమాంటిసిజం' (విప్లవ కాల్పనికత)అని సోవియట్ విమర్శకులు నింద్యార్థంలో అంటే అందులో నిందించదగినదేదీలేదని చైనీస్ విమర్శకుల తీర్పు. 'కాల్పనికత' అంటేనే కమ్యూనిస్టు విమర్శకులు ముఖం మరోవైపుకు తిప్పుకోవడం పరిపాటి అయిపోయింది గాని నిజానికి, కాల్పనికతకు వాస్తవికతతో కులవైరంలేదు, ఉండనక్కర్లేదుకూడా. వెనుకచూపు మాత్రిమే కలిగిన కళాధోరణిని కాల్పనికధోరణి అంటూ ఈసడించడం మాత్రిమే తెలిసిన విమర్శకులూ విమర్శకమ్మన్యులూ, కాల్పనికతకు ముందు చూపు గూడా ఉండవచ్చునని మరిచిపోతున్నారు. విప్లవ విజయంపట్ల అకుంఠితమైన ఆత్మవిశ్వాసం, పోరాటాలపట్ల గాఢమైన అనురక్తి, భవిష్యత్తులో సమసమాజ నిర్మాణంపట్ల ఉత్కంఠతోగూడిన ఎదురుచూపు-ఇవన్నీ కాల్పనికతనూ వాస్తవికతనూ సమ్మేళనం చెయ్యగల ఒక నూతన కళాధోరణికి లక్షణాలు కావచ్చు; అప్పుడు కాల్పనికత విప్లవ కాల్పనికత అవుతుంది. వాస్తవికత విప్లవ వాస్తవికత అవుతుంది. 'గతకాలము

మేలు వచ్చు కాలముకంటెన్' వైఖరికాదిది. మావో పద్యాలలోకెల్ల మణిపూస అని రాబర్ట్ పేష్న్ వర్ణించిన 'స్నో' (మంచు) లో, గత చరిత్రకుచెందిన మహావీరులను ప్రస్తావించాక,

To find heroes in the grand manner
We must look rather in the present.

(ఉదాత్త వీరులను చూడగోరితే, మనం వర్తమానకాలంలోనేచూడాలి.) అన్నాడంటే ఈ చివర రెండు చరణాలలో మావో తన యథార్థమైన వైఖరిని ప్రదర్శించాడనాలి: మొత్తం చైనాచరిత్రలో మహావీరులు ఈనాటి విప్లవకారులేగాని నిన్నటి చక్రవర్తులూ యోధులూ కారు. మవోది పూర్తిగా నేటి చూపుకూడాకాదు, రేపటిచూపే. గతకాలానికిచెందిన వీరులను పేర్కొనడంద్వారా అభిమానించాడనుకొంటే, దేశసమైక్యత సాధనలో వాళ్లు కృషిచేసినందుచేతనే. వాళ్ళు యెన్నడో ప్రారంభించీ, అసంపూర్తిగా సాధించీ, మళ్ళీ కాలక్రమంలోచెడిన ఐక్యతనూ, జాతినిర్మాణాన్నీ నేటి విప్లవకారులు కొనసాగిస్తున్నారు. పరిపూర్తి చేస్తున్నారు. ఇంకా ముందుకు తీసుకుపోతున్నారు. రచయితలూ కళాకారులూ పరిపూర్ణ మానవప్రేమను సాధించేకాలం వర్గరహితసమాజ స్థాపన తర్వాతనేనని 'ప్రాబ్లమ్స్ ఆఫ్ ఆర్ట్ అండ్ లిటరేచర్'లో మావో అన్నాడు. 'మంచి గతమున కొంచెమేనోయి'అనే వైఖరి యిది.

జీవితక్రమంలో నిత్యనూతన విషయాలను దర్శించి, ప్రపంచాన్ని ఎప్పటికప్పుడు మార్పుకు లోనౌతున్నట్టుగా ప్రతికొత్తనూ ఉత్సాహంతో చేరబిలిచేవైఖరి, మొలకల్లాంటి ఈ నూతనాంశాలను వృక్షాలయేట్టుగా పెరగనిస్తూ ఈ గతిక్రమాన్ని కళలో ప్రతిబింబించడం, వాస్తవికతకు భిన్నమైన పనికాదు. వాస్తవికతకు కాల్పనికతను జోడించవలసిన అవసరంఉంది. ఉన్నవాటిని ఉన్నట్లుగానేగాక, మార్పుచెందుతూ పరిపూర్ణతవైపు సాగుతున్నట్టుగాకూడా చూడడంలో తప్పులేదు సరికదా, ఇదేఒప్పు. కాని సోవియట్ విమర్శకులు ఈ ధోరణిని నిరసిస్తూ, వాస్తవానికీ దీనికీ ఎ.తో దూరమున్నట్టూ, కళా సృజన విషయంలో వస్తుపరమైన దృక్పథాన్ని (ఆబ్జెక్టివ్)గాక స్వీయమానసికమైన దృక్పథాన్ని (సబ్జెక్టివ్) చైనీస్ సాహిత్య సిద్ధాంతవేత్తలు చేపట్టినట్టూ విమర్శించారు. ('కమ్యూనిస్టు', మాస్కో. జూన్ 1964 సంచికలో 'అగెన్స్ట్ డాగ్మాటిజం అండ్ వల్గరైజేషన్ ఇన్ లిటరేచర్'అనే వ్యాసంనుంచి 'ప్రాబ్లెమ్స్ ఆఫ్ కమ్యూనిజం', సెప్టెంబరు- అక్టోబరు 1964 సంచికలో ఉదాహృతం.)

వాస్తవాన్ని ప్రతిబింబించడంలో కళాకారుడి మనస్సు చేతులుముడుచుకుని కూర్చోదు. దానిద్వారానే వాస్తవ ప్రపంచం కళలో ప్రతిఫలిస్తుంది. దీన్ని స్వీయమానసిక వైఖరి అనడం గుడ్డితనం.

"కొయ్యబొమ్మలు"గాని మానవమూర్తులూ వస్తువిన్యాసాలూ కళలో రూపొందాలంటే కళాకారుడి మనస్సు వాస్తవానికి అధీనమైకూడా, దానికిగల వంకరలనూ వికారాలనూ తొలగించుకుంటూ ఆదర్శదృష్టిని వాస్తవ చిత్రిణకు అనుసంధానించవలసి ఉంటుంది.

మావో పద్యరచనలలో ప్రముఖంగా మనకు కనిపించే వస్తువు ప్రజాసామాన్యం కాదు, విశాలమైన ప్రకృతి దృశ్యాలేనని ఒక విమర్శ ఉంది. ప్రజాసామాన్యం విషయం అటుంచి, ఈ ప్రకృతిదృశ్యాల చిత్రిణ ప్రామాణిక చైనీస్ కావ్యరచనకు సర్వసాధారణమేననాలి. అయితే యిది జడప్రకృతి కాదు. గాలివానలు, మంచుపొరలు, సూర్యుడు, చంద్రుడు, నీళ్ళూ పూలూ–వీటన్నిటిలోనూ ప్రాణం స్పందిస్తూంటుంది. భూమి సమస్తం మార్పుకు లోనౌతూఉన్నట్టుగామావో దాన్ని దర్శిస్తాడు. ఈ ప్రకృతి రామణీయానికి వెనకటికవుల్లా తాను సమ్మోహితుడై వుండవచ్చుగాని, ప్రకృతిని లోబరచుకొని దూరాన్నీ కాలాన్నీ జయించడమే కవిగా మావో కోరిక. కార్యశూరుడుగా కూడా తన అభిలాషఅదే. "ఆకాశానికి ఆనుకొని అమూల్యమైన నాఖడ్గాన్ని ఒరనుంచి తీయగలిగితేనా"అని ఒక పద్యపాదంలో కాల్పనికధోరణిలో మావో అన్నప్పుడు, గతకాలంలోని మహావీరులూ కవులూ ఐనవారిని అనుసరిస్తున్నాడనిపిస్తుంది. దృఢ నీల శిలానిర్మితమైన ఆకాశాన్ని పర్వతాలలో అందుకొని ఆనుకోవడం వారందరూవాడినకవి సమయంలాంటిది. మావోవిషయంలో మాత్రం, ఈ కాల్పనిక ప్రవృత్తి లలితశబ్దాలనుగాక ఖటువైన మాటలను ఆశ్రయిస్తుంది. కత్తులు ఊహాకృపాణాలుకాదు, నిజమైన బలమైన పదునైన కత్తులే. పులి, డ్రేగన్ వగైరా యధార్థమైన, కల్పితమైన జంతువులు అలంకారానికోసం తెచ్చిపెట్టేవికావు, వాస్తవప్రపంచంలోని వివిధచారిత్రక శక్తులకో వ్యక్తులకో అవి సంకేతాలు. మావో పద్యాలు ఉబుసుపోకకు రాసినవికావు. చైనీస్ కమ్యూనిస్టుపార్టీ సల్పిన సంకులపోరాటంలో కొన్ని తుపాకిమోతలు, మరికొన్ని బల్లేల పొడుపులు, అన్నీకూడా ఆ మహాప్రస్థానంలో మైలురాళ్లు, ప్రాచీన కావ్యరూపాల వెనక పరమ ఆధునికమైన కవి హృదయ స్పందనలు.

మావోతెచ్చే ఉపమానాలూ వాడే ప్రతీకలూ అన్నీ సార్థకమైనవే. ఉదాహరణకు, 'చాంగ్షా'అనే పద్యంలో, పర్వతశిఖరంపైపుగా పైకిలేస్తూన్న మేఘాలనే తీసుకుందాం. అంతర్యుద్ధకాలంలో కోమింటాంగ్ కిరాతక కృత్యాలనుచూసి ఎర్రసేనపొందిన ఆగ్రహాన్ని ఇవి సూచిస్తాయని చైనీస్ వ్యాఖ్యాతలంటున్నారు. వ్యాఖ్యానంలేకుండా వివరణలేకుండా మావో పద్యాలు బోధపడే అవకాశంతక్కువ. కవి ఆశ్రయించిన ప్రతీకాత్మకపద్ధతే (Symbolism) ఇందుకు కారణంగాని పదాల, పదబంధాల, క్లిష్టతగానీ జటిలతగానీ కారణంకాదు.

గొప్పనాయకుడు కాకపోయినా, కవిగానైనా మావోకు ఆధునికచరిత్రలో స్థానం ఉండేది. అయితే నాయకుడై ఉండడం మావో కవిత్వ ప్రఖ్యాతికి ఎంతోకొంత ఉపకరించిందని జెరోమ్‌చెన్, మైకేల్‌బుల్లాక్‌లు అన్నారు. వెనకటి చక్రవర్తుల్లో కొందరిలాగా మావో కార్యశూరుడేగాక కవికూడా కాబట్టి ఈ రెండుపనులూ ఒకదానినొకటి అంటగొనడం అనివార్యం. నేటి చైనీస్ కవుల్లో మావో అసాధారణమైన కవి. 'అసాధారణమైన' అనడం ఎందుకంటే, ప్రాచీన ప్రామాణిక కావ్యరూపాలనూ కవి సమయాలనూ వాడేకవి ముఖ్యంగా తానొక్కడే కాబట్టి. అధికారంలోకి రాకముందునుండే, కవిగా మావోను విశ్వవిద్యాలయాలు గుర్తించాయి. ముఖ్యంగా "మంచు" అనేది మావో రాశాడని తెలిసినవెంటనే, విశ్వవిద్యాలయాలు మావో కవిత్వాన్ని సమాదరించసాగాయి.

దేశ చరిత్రలో పడిదుడుకులనుమీరిన నిరంతరాయత, నేటికిగల నిన్నటిపునాది, భవిష్యత్తులో వర్తమానం సాధించబోయే సమగ్రత- ఇదంతా మావో కవిత్వానికి ప్రాణమూలమైన వస్తువు. ఆధునిక నాగరికతా సంకేతాలు-హైడ్రోఎలక్ట్రిక్ స్టేషన్లు వగైరా-కూడా 'ఈత'అనే పద్యంలో దర్శనమిస్తాయి. మావో క్రియాశీలత, కమ్యూనిస్టుకార్యోత్సాహం, అంజన కవిత్వంలోగూడా కనిపిస్తుంది. "మహాసముద్రాల స్థానంలో మల్బెరీతోపులు వెయ్యడం"అంటే తీవ్రమైన మార్పును కలిగించడం కవిగాకూడా మావో లక్ష్యం. ఇది వట్టి కాల్పనికత ఎలాగౌతుంది? అయినా, దీనికి వెనకచూపు మాత్రమే వున్నట్టు ఎవడు తీర్పుచెప్పగలడు? ఆ మాటకువస్తే, కమ్యూనిస్టు సమాజ నిర్మాణం గురించి మార్క్స్ కాల్పనికప్రవృత్తినే చూపాడనాలి. వాస్తవికత భూమి అయితే కాల్పనికత ఆకాశం. "మిన్నులు కూలిపోయేట్లుంటే ఆకాశాన్ని మనం స్తంభాలు కట్టి నిలుపుదాం"అని ఒక పద్యంలో మావో అన్నమాటలు ఆదర్శోన్ముఖమైన వాస్తవికతను చూపెడుతాయి. మట్టిపురుగు మాత్రమే కాదు, మింటబోయే విహంగంకూడా కవిని ఆకర్షించాలి.

కాల్పనికత, వాస్తవికత—పరస్పర సహాయకాలైన కళాధోరణులని మావో తన కవిత్వంద్వారా సాధించి చూపినకవి. విలక్షణమైన కవి. విప్లవకాల్పనికతనూ విప్లవ వాస్తవికతనూ సమన్వయింపజేశాడు. ఉభయసామాన్యమైన అంశం విప్లవమే.

"పెట్టుబడిదారీవర్గం, తన్ను నాశనంచేసే ఆయుధాలను సృష్టించుకోడమే కాక, వాటిని చేబట్టి పోరాడగల మనుష్యుల్ని కూడా - శ్రామిక వర్గాన్ని - సృష్టించుకొంది."

—మార్క్స్, ఎంగెల్స్.

మావో కవితలు :

## ఈత *

(1956)

చాంగ్షా జలాలను రుచిజూచానో లేదో,
వూచాంగ్‌లో ఇప్పుడు చేపలకూర తింటున్నాను.
యాంగ్‌ట్జీ మహానదికి అడ్డంపడి ఈదాను,
చూ ఆకాశాన్ని నాముందు కనుగొంటున్నాను.
గాలికొట్టినా వానపడినా నాకు లెక్కలేదు,
ఇంటిలోగిటిలో ఒళ్ళుకదలకుండా పచారుచేసేందుకంటె
ఇది చాలానయం.
ఈరోజు నాకు స్వేచ్ఛ!
నీటివార నిల్చుని కన్ఫ్యూషియస్ అన్నాడట:
'నిఖిల ప్రకృతీ ప్రవహించి పోతోంద'ని.

తెరచాపలు ఊగాడుతున్నాయి,
తాబేలూ పామూ మూగబడివున్నాయి.
ఘనవిజయాలు నా కళ్ళముందు లేస్తున్నాయి దృశ్యాలై,
ఉత్తర దక్షిణాలను కలుపుతూ ఒక వంతెన
నింగిలోనూ నీటిమీదనూ బాట వెయ్యబోతుంది.
వూషాన్ మేఘాలనూ వర్షాన్నీ అపుజేసేందుకై
పశ్చిమాన కట్టబోతాము రాతిగోడలు.
ఇరుకైన కొండచరియలన్నీ ప్రశాంత సరోవరంగా చేరికొంటాయి.
ఇంకా పర్వతదేవత ఉండి ఉంటే,
ప్రపంచమంతా మారిపోయిందని చూడబోతుంది.

---

* యాంగ్‌ట్జీనదిలో వూచాంగ్ నుంచి హాంకోవరకు ఈతగొట్టిన తర్వాత 1956 మేలో మావో ఈ రచన చేయడం జరిగింది.

## కుమో - జోకు జవాబుగా *

(1961)

భూమిలోనుండి గాడ్పూ పిడుగూ వెలికురికాయోలేదో
భూతమొకటి వెంటనే వెలువడింది జీర్ణాస్థికల ప్రోగునుండి.
సన్యాసి[1] మహాబుద్ధిశాలికాదుగాని బోధిస్తే నేర్చుకోగలడు,
పిశాచి[2] అలాకాదు, నష్టంకలిగించగలదు, మహామాయావి.
బలిష్ఠమైన తన గదాదండాన్ని నిబ్బరంగా పైకెత్తి, బంగారుకోతి
పదివేలయోజనాలధూళిని తుడిచిపెట్టింది ప్రపంచంనుండి.
నేడు, మహానీయుడైన సన్ దృష్టాంతాన్ని చూపి ప్రశంసిస్తున్నామంటే,
దుర్భేధల చిత్తడినెమ్మగాలి మళ్ళీ దట్టమైఉన్నది కాబట్టే.

---

* మావో ఈ రచనచేసింది నవంబరు 17, 1961 నాడు. 'సన్ వు-కుంగ్ జీర్ణాస్థికలభూతాన్ని ముమ్మారు జయించాడు అనే చలనచిత్రం చూశాక' శీర్షికతో కుమో-జో ఒక పద్యం రాస్తే, దానికి జవాబుగా మావో ఈ రచనచెయ్యడం జరిగింది.

1) పైకథలో సన్యాసి (మంక్) మహాబుద్ధిశాలికాదు (ఎ సింపుల్ ఫెలో) గాని బోధించినా గ్రహించజాలనంత మందమతీ కాదు. ఈ సన్యాసి కృషేవ్‌కు ప్రతీక. 1961 నాటికి కృషేవ్ గురించి మావోకు బొత్తిగా ఆశ చావలేదని ఈ పద్యం తెలుపుతున్నట్టు స్టూవర్ట్ ష్రామ్ వ్యాఖ్యానిస్తాడు. అప్పటికే సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 22వ కాంగ్రెసు జరిగింది. నిజానికి మావోకు ఏవైనా భ్రమలు మిగిలివుంటే, వాటిని అది నిర్మూలించి ఉండాలి.

2) పిశాచి అమెరికన్ సామ్రాజ్యవాదానికి ప్రతీక.

# కుమో - జోకు జవాబుగా *

(1963)

మన చిన్ని[1]గోళం మీద
ఈగలు కొన్ని గోడల[2]కేసి కొట్టుకుంటున్నాయి,
రొదపెడుతూ,
బిగ్గరగా మొరబెడుతూ కొన్ని
రోదిస్తూ కొన్ని.
పూలుతొడుగుతూన్న లోకస్ట్‌వృక్షాన్ని[3] అధిరోహిస్తున్నాయి చీమలు
ఘనమైన తమ దేశంగురించి గొప్పలు చెప్పుకొంటూ
చీమలు చెట్టును విదిలించడమంటే మాటలుకాదు

---

* 1963 జనవరి 9 న మావో ఈ రచన చేశాడు. దానికి రెండు రోజులక్రితం ప్రావదా పత్రిక మొదటిసారిగా నోరువిప్పి చైనాను బహిరంగంగా విమర్శించింది. మొత్తం అంతర్జాతీయ పరిస్థితిని మనస్సులోపెట్టుకొని ఆత్మవిశ్వాసాన్నీ చైనా శక్తిసామర్థ్యాలవిషయంలో విశ్వాసాన్నీ యీ రచనలో మావో వెల్లడించినట్టు స్టువర్ట్ ష్రామ్ వ్యాఖ్యానించాడు.

1) భూగోళం పెద్దదే కావచ్చుగాని, దాన్ని తన ఇష్టాధీనంగా మార్చివెయ్యగల కమ్యూనిస్టువిప్లవకారునిదృష్టికి, చిన్నదే.

2) ఈ గోడలు సరైన మార్క్సిజం-లెనినిజంను సూచిస్తాయి. ఇంపీరియలిస్టు ఈగలు గోడలకేసి కొట్టుకుచస్తాయి.

3) ప్రాచీన చైనీస్ కథ ఒకటి యీ లోకస్ట్‌వృక్షాన్ని ప్రస్తావిస్తుంది. పూలు తొడుగుతూన్న ఆ వృక్షాలు నిండారిన సీమను దర్శించినట్లుగా ఒకడు కలగంటాడు. ఆ దేశపు రాజు తనకుమార్తెను అతనికిచ్చి పెళ్ళిచేసి సత్కరిస్తాడు. ఇదంతాకల. వాడు మేలుకొనేసరికి, తన ఇంటికిటికీబయటగల లోకస్ట్ వృక్షాన్ని చీమలపుట్టనుంచి చీమలు ఎక్కుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ పద్య పాదంలోని 'చీమలు' ఆధునిక రివిజనిస్టులు.

పడమటిగాలి ఇపుడిప్పుడే ఆకులురాలుస్తోంది చాంగ్ఆన్[4] మీద
ఈలలేస్తూ గాలిని కోసుకొంటూ ఎగురుతున్నాయి కరకుటమ్ములు[5]
ఒకదాని వెంబడి మరొకటై
ఎన్నెన్ని జరూరు పనులు!
పరిభ్రమిస్తున్నాయి మన్ను మిన్నులు
కాలం ఒత్తిడిచేస్తూంది
పదివేల సంవత్సరాలు మహాదీర్ఘ కాలం
పట్టుకోవాలి మనం నేటిదినాన్ని.[6]
సముద్రాలునాలుగూ ఉవ్వెత్తుగా లేస్తున్నాయి, కుపితమౌతున్నై
మేఘాలూ జలాలూ.
ఖండాలారూ వణుకుతున్నాయి, వాయువూ పిడుగూ
కట్లు తెగ్రించుకొంటున్నాయి.
ఒక్కగానొక్క శత్రువైనా శేషించకుండా
హానికరమైన క్రిమికీటకాలను తుడిచిపెట్టాలి మనం.[7]

---

4) ఒక ప్రాచీన చైనీస్ కావ్యంలో, ఆనాటి రాజధాని అయిన చాంగ్ఆన్ మీద ఒక శరత్కాలవాయువు వీచి ఆకులు రాల్చడం వర్ణితం. ఇక్కడ చాంగ్ఆన్ మొత్తం చైనాకు సంకేతమనుకోవచ్చు ఆ గాలి విప్లవ ప్రభంజనం, మరి ఆకులు విప్లవ విరోధులు, అని చైనీస్ వ్యాఖ్యాతల వివరణ.

5) కరకుటమ్ములు తన విరోధులమీద చైనాతీస్తూన్న దెబ్బలు.

6) ఈ పద్యంలో చివరిపాదాలు అన్నీకూడా సత్వర దేశ పరివర్తన విషయంలో మావో శ్రద్ధాసక్తులను సూచిస్తాయి. కాని, స్టూపర్డు షాప్ ఉద్దేశంలో, ఇవి తొందరపాటును, దానిఫలితమైన 'గ్రేట్ లీప్'ఉద్యమాన్నీ సూచిస్తాయి.

7) ఈ క్రిమికీటకాలు అటు సామ్రాజ్యవాదులూ ఇటు రివిజనిస్టులూ.

## మంచు *

ఈ ఉత్తరాది సీమలో మంచుల నెగగాడ్పులో
ఒత్తైన మంచులో ఒక వెయ్యి ఎకరాల ప్రాంతం
సుడిదిరిగే మంచులో మరో పదివేల ఎకరాల ప్రాంతం.
మహాకుడ్యానికి అటూ ఇటూ చూడు-
మేరలేలేక పరచుకొన్న కాటిబీడు.
ఎల్లోనది ఎగువనూ దిగువనూ
అల్లకల్లోలమైన అలలగోలే.
పర్వతాలమీద నర్తిస్తున్నాయి వెండిమిన్నాగులు
బయళ్లలో విశృంఖలంగా వర్తిస్తాయి శీతాకాలం మదగజాలు:
ఆకాశం ఎత్తుతోటి మనఎత్తు కొలుచుకోవాలని కోరిక.

ఆకాశం నిర్మలంకానీ ఎండకాయనీ!
ఎర్రోటి పండంటిపిల్ల తెల్లటిదుస్తులు ధరించినట్లు

---

* మావో కవితలలో ఇది మణిపూస అని రాబర్ట్ పేఘ్నె అంటాడు. 1936లో దీన్నిరాసి నిర్లక్ష్యంగా ఒక మిత్రుడిచేతికిచ్చాడు. ఆ మిత్రుడు అచ్చువేయించాడు. ఆ క్షణంనుంచి విద్యావంతులైన చైనీయులకు మావో మంచికవిగా కూడా పరిచయమయ్యాడు. చైనా భూమికి మావో ప్రణయకవిత యిది అని పేఘ్నె వర్ణిస్తాడు. చైనీయులకు ఎరుపు సంతోషానికీ శృంగారానికీగూడా సంకేతమైనరంగు. అందుచేత 'ఎర్రోటిపిల్ల' అన్నప్పుడు శృంగారంకూడా ధ్వనిస్తుందని అంటాడు. చైనాదేశపు చరిత్ర సమస్తం సూక్ష్మంగా ఇందులో ఉంది- దాని ఐతిహ్యాలతో, అందచందాలతో. ప్రకృతి దృశ్య సంపుటాలతో సహా. ఇంతకొద్ది పరిధిలో ఇన్ని కొద్ది మాటలతో చైనాను కవిమనకు సాక్షాత్కరింపజేయగలిగాడంటే ఇది గొప్ప సిద్ధికింద లెక్కేనని పేఘ్నె అంటాడు, చివరిచరణం మరీ భావ బంధురం- ఎందుకంటే, మావో గత చరిత్రనూ పురాణకాలపు చక్రవర్తులనూ పేర్కొన్నా, వారి లోపాలనుకూడాచూపి, నిజమైన వీరులు. సంస్కృతి సంపన్నులు ప్రస్తుతకాలంలోనేఉన్నారుగాని గతంలో కాదంటాడు. నేటి విప్లవకారులే చరిత్రకంతటికీ మకుటాయమానమైన వీరులు.

ఎంత అందంగా ఉందో భూమి!
ఈ పర్వతాల, నదుల చక్కదనం ఎలాంటిదంటే
లెక్కలేనంతమంది వీరులు పోటాపోటీగా దీనివెంటబడ్డారు.

షిహువాంగ్, వూటి చక్రవర్తులు విద్యాసంస్కార విహీనులు.
తాయ్‌జుంగ్, జాయ్‌జు చక్రవర్తులు ధీరోదాత్తులుకారు.
ఒక్కతరం కాలం దైవానుగ్రహం అనుభవించాడు జెంగిజ్‌ఖాన్
గద్దలను నేలగూల్చేందుకు విల్లెక్కుపెట్టడమే అతని నేర్పు.
ఇప్పుడు వారంతా గతించారు—
మహోదాత్త వీరులు వర్తమానకాలంలోనే ఉన్నారు.

## కున్‌లుంగ్ పర్వతం *

సూటిగా వాయుసీమలోకి భూమిమీదుగా లేస్తూ
సమున్నతమైన కున్‌లుంగ్, సకలప్రపంచ సౌఖ్యాలకు
యజమానురాలు
ముప్పైలక్షల జేడ్‌డ్రేగన్లు[1] మిన్నంటిపోతున్నాయి,
గట్టిమంచు మిన్నులను తూట్లుపొడుస్తూంది.
వేసవిలో కరిగిన మంచు
నదులలో పొంగి పొర్లుతూంది.

---

* హిమాలయాలు దేవతా ధామాలని మనం అనుకొంటే, చైనావాళ్లు కున్‌లుంగ్ పర్వతాలు దేవలోకమనుకుంటారు. టిబెట్‌లో ఎక్కడో ఉన్నాయని ఊహ.

1) ముప్పైలక్షల జేడ్‌డ్రేగన్‌లనుగురించి తన పద్యపాదానికి మావోయే స్వయంగా వివరణ ఇచ్చుకొన్నాడు: "ముప్పైలక్షల జేడ్‌డ్రేగన్లు పోట్లాడుకోగా వాటి పొలుసులు ఆకాశంలో అంతా ఎగురుతున్నాయి' అనే ఒక పాతనానుడివుంది.

మనుష్యులిక చేపలూకావచ్చు తాబేళ్లూకావచ్చు.
వెయ్యిశరత్తుల పిమ్మట తీర్పుచెప్పేవాడెవ్వడు మనకు,
శిక్షిస్తూ అనుగ్రహిస్తూ?

ఉన్నత పర్వతాలతోటి నేనిలా అంటున్నాను:
'ఇంతెత్తుగా ఎందుకు? ఇంత మంచు ఎందుకు?'
మిన్నుకు ఆనుకొని ఒరనుండి నా అమూల్యమైన ఖడ్గాన్నిలాగి
నిన్ను మూడు ముక్కలయేట్లుగా కోయగలిగితినా,
యూరపుకు పంపుతానొకటి
అమెరికాకు ఇస్తాను రెండవది
అట్టిపెడుతాను చైనాకోసం మూడవది.
నీ వెచ్చదనాన్నీ చలినీ పంచుకొంటుంది యావత్ ప్రపంచం
నెలకొంటుంది అలా ఇలాతలమంతటా మహాశాంతి.

---

మొదట్లో మంచు ఎగరడానికీ దీనికీ పోలికవుండేది. అయితే మంచునిండిన కొండలకు నేను దీన్ని అన్వయించాను. ఒక సంవత్సరం వేసవికాలంలో మిన్‌పర్వతాలపై నిల్చునివుండగా, కళ్లు మిరుమిట్లుగొలిపేంత తెల్లగా ఉన్న పర్వతాలు నృత్యంచేస్తున్నట్లుగా అమర్చి ఉన్నట్టనిపించింది. వానరరాజు ('పశ్చిమానికి ప్రయాణం'అనే ప్రాచీన చైనీస్‌నవలలో ముఖ్యపాత్ర) ఆ పర్వతాలను సమీపించేసరికి అవి మండిపోసాగాయని, తాటాకు విసనకర్రతోటి అతడామంటలను ఆర్పివేశాడని, అప్పుడవి తెల్లబడ్డాయని ఒక జానపదగాథ వుంది."

'డ్రెగన్'అనేది పాముకాదు, పక్షీకాదు, రెండూకలిసిన సంకీర్ణ ఊహాజంతువు. దాని నాసారంధ్రాలనుంచి జ్వాలలూ ధూమమూ వెలువడుతూ వుంటాయట. అది చాలా బలిష్ఠమైనది. చైనీయులకు పవిత్రమైన జంతువుల్లో ఒకటి.

# నాంకింగ్ నగరం స్వాధీనమైనప్పుడు *

చుంగ్ శిఖరం[1] చుట్టూ హఠాత్తుగా కొట్టిందొక గాలివాన
సాహసోపేతులైన యోధులు లక్షోపలక్షలు మహానదిని దాటుతున్నారు
అపూర్వమైన ఠీవితో పొంచుంది పెద్దపులి, చుట్టగా చుట్టుకుంది డ్రేగను[2]
కల్లోలితం ప్రపంచం సమస్తం, సముత్సాహంగా దృఢంగా ఉన్నాము
యావన్మందిమీ మేము,
గుండెచిక్కబట్టి చెదిరిన శత్రుబలాన్ని వెన్నాడుదాం పట్టండి.
చూ నియంతను[3] అనుకరించి ప్రశంసలుపొందడం మనకు తగదు.
మిన్నులకుగూడా అనుభూతి ఉన్నపక్షాన అదీ ముదిమికి లోబడుతుంది.
మానవలోకాన్ని శాసించే సూత్రం సాగరాలస్థానంలో మల్బెరీ తోపులు
వేయడమే[4].

---

* ఇది 1949 ఏప్రిల్‌లో రాసింది. నాంకింగ్ నగరం 1949 ఏప్రిల్ 23 న ప్రజావిమోచనసైన్యానికి వశమైంది. ఆ తర్వాత కొద్దిరోజులకే మావో దీన్ని రాయడం జరిగింది.

1) చుంగ్ శిఖరం నాంకింగ్ నగరానికి తూర్పున ఉంది.

2) సైనికవ్యూహనిపుణులైన ప్రాచీనరచయితలు నాంకింగ్‌ను పొంచున్నపెద్దపులితోను, చుంగ్‌పర్వతాన్ని చుట్టగాచుట్టుకున్న డ్రేగనుతోను పోల్చారు.

3) ప్రాచీనసైన్యవ్యూహనిపుణుడు, శత్రువును చుట్టుముట్టినప్పుడు ఊపిరిసలపనంతగా నొక్కివెయ్యకుండా, తప్పించుకుపోయేవీలు కలిగించాలని అన్నాడు. అది పొరపాటని మావో అభిప్రాయం.

4) ఈ వాక్యానికి అర్థం "తీవ్రమైన మార్పును సాధించడం"అని స్టూవర్ట్ ష్రామ్ రాస్తాడు.

# దోపిడీ విధ్వంసక డైనమైట్ విప్లవం

ఎన్నార్ 'భోలా'

విప్లవం అంటే
బందిపోటుతనమనీ
విప్లవకారుడంటే
ఖూనీకోరనీ

పిరికి దమననీతిని ప్రదర్శిస్తున్న
ఫాసిస్టు ప్రభుత్వ
తప్పుడు ప్రచారంతో

కావాలని
ఎందరో వీరుల్ని
విప్లవకారుల్ని

బ్లాకులో దొరుకుతున్న
కొనుగోలుదారుల ప్రభుత్వం
భద్రతలపేరున
పైశాచికంగా కాల్చివేసింది-

బాబోయ్! రక్తం! నెత్తురూ!
నెత్తీ నోరూ కొట్టుకు
అరిచారు ప్రజలు...

కాదు- అది పులుముకున్న బురద
బల్లగుద్ది వాదించారు
పెట్టుబడిదారి ప్రతినిధులూ—

మానవత్వం నశించిన
మేజిస్ట్రేట్ కలం
నెత్తురునిజం పలుకలేదు
పచ్చి అబద్ధపు నలుపే కార్చింది.

విప్లవం అంటే
దౌష్ట్య-దేశద్రిమ్మరితనం కాదనీ
దోపిడీ విధ్వంసకడైనమైట్ అనీ
విప్లవకారుడు చేసేది
హత్యకాదు
దౌష్ట్యాన్ని హతమార్చడమనీ
అవసరమనీ
అందరూ అనుకుంటున్నారు
విరసంవాళ్ళు విడమర్చి చెప్తున్నారు
జనమంతా సన్నద్ధం అవుతున్నారు-

నిప్పంటేనే
నీళ్ళల్లో చేతులుంచి
ఉఫ్ఫ్! మని ఊదుకునే
బూర్జువా ప్రభుత్వం కొంపకే
నిప్పంటుకుంది

దేశం నాలుగుచెరగులా
విప్లవం మంటలు రగుల్కొన్నయ్
పెట్టుబడిదారీ పురుగొక్కటీ
పారిపోవడానికి వీల్లేకుండా
అడవుల్లో ఆకు ఆకు మాటునా
కసితోతుపాకి నోరుతెరుచుకునివుంది-
ఇక
ఈ బూటకపు ప్రజాస్వామ్యం పనే
ఈ బూర్జువా ప్రభుత్వం పనే.

పోదాం పదే జాతరో
శ్రీ కాకుళ యాతర
పోరు పదే జాతరో
పోదాం పదే జాతరో
అది ఏమి జాతరమ్మా ॥అది॥
లేనోళ్ళ జాతరమ్మా
పోదాం పదే జాతరో...

గోసి పేల్కాగాళ్ళు
గొంగడి బొంతగాళ్ళు
పూటకు లేనోళ్ళు
పనిజేసి బతికెటోళ్ళు
ఉన్నోళ్ళ తలలుదెచ్చి
ఉట్లు గొడ్తుంద్రంట
పోరు పదే జాతరో...

నాటు బాంబులన్ని
మూట గట్టుకోవాలి
గొడ్డండ్లు కొడవండ్లు
బండ్లు నింపుకోవాలి
ముసలవ్వల, చంటోళ్ళను
వెంటబెట్టుకోవాలె
పోరు పదే జాతరో...

బందూకులు బర్మారులు
బండ్లె బెట్టుకోవాలి
బండి మీద ఎర్రని
జండ లెత్తుకోవాలి
జండకే జై గొడుతు
బండి ముందు నడుపాలె
పోరు పదే జాతరో...

రాముని భీముని
బండికి గట్టాలె
పిల్ల జెల్లాకెమో
ఖిల్లాలు ఇయ్యాలె

పోదాం పదే జాతరో...

ఎవడన్న బండికి
అడ్డము దల్గితె...
అడ్డ గొయ్యతోని
ఆరుపారు జెయ్యాలె
పోరు పదే జాతరో...

దొరకంట్ల బడకుండ
బిరబిరా నడవాలె
సుక్క బొడువక ముందే
పక్కూరు కెల్లాలె
ఒకవేళదొరగాడు బండికడ్డముదల్గితె
గవిని కాడికి దెచ్చి గావుబట్టి పోవాలె
పోరు పదే జాతరో...

మనవూరి సేటును
కనిపెట్టి నడవాలె
ఎనుక ముందు జూసి
బండి ముందు నడుపాలె
ఒకవేళ సేటుగాడు
బండికడ్డమువొస్తె
ఏనె గుండ్లాకాడ
పానమూ దీయాలె
పోరు పదే జాతరో...

నాక పక్కనుండి
నక్కి నక్కి పోవాలె
పిల్లలేడ్వాకుండా
పాలిచ్చు కోవాలె
ఒక వేల అమీన్‌గాడు
బండికడ్డము దల్గితె
బండి కిరిసి గట్టి
బొక్కలిరిసి వేయాలి
పోరు పదే జాతరో...

## కార్మిక కర్షక విద్యార్థులు....

కార్మిక కర్షక విద్యార్థులు - ముగ్గురు గూడిరంట
ఒరన్న ముగ్గురు గూడిరంట
దోపిడి దొంగల ఖతంజేయుటకు – నడుంగట్టిరంట
ఒరన్న నడుం గట్టిరంటా ॥కార్మిక॥

మావో సూక్తులే వారికి ఉన్న – మహాబలంబంట
ఒరన్న మహా బలంబంట
ఆ మహా బలముతొ పేదప్రజలను – కూడగట్టిరంట
ఒరన్న పోరు సల్పిరంట ॥కార్మిక॥

ఉన్నోని గుట్టు లేనోళ్ళకంతా – ఇప్పిసెప్పిరంట
ఒరన్న ఇప్పిసెప్పిరంట
ఉన్నోని రాజ్యం ఉన్నంతవరకు – సుఖంలేదురంట
లెనోనికి సుఖంలేదురంట
తమ సొత్తు దోచుకునె – పెత్తందారులను
ఉత్త గొడులరంట – ఒరన్న ఉత్త గొడులరంట
నీళ్ళులేని కాడ బొండిగ గోసి
పాతబెడ్తరంట – ఒరన్న పండ్గజేస్తరంట ॥కార్మిక॥

మొదలు బెట్టిన పోరాటంను
నడుమ ఆపరంట – ఒరన్న నడుమ ఆపరంట
తుది విజయం సాధించేవరకు
ఈ లడాయాగదంట – ఒరన్న లడాయాగదంట ॥కార్మిక॥

భూమి బొడ్డుపై ఎర్రజెండను
ఎగురవేస్తరంట – ఒరన్న ఎగురవేస్తరంట
ప్రాణమున్న ప్రతి జీవకోటికా
జండే శరణమంట – ఒరన్న జండే శరణమంటా ॥కార్మిక॥

బొందిల ప్రాణం ఉన్నంతవరకు
బందూకిడువరంట – ఒరన్న బందూకిడువరంట.
పేదలరాజ్యం వచ్చేదాక వారు
కత్తుల్ దించరంట – ఒరన్న కత్తుల్ దించరంట ॥కార్మిక॥

# ఎప్పుడొస్తాడో కొడుకు....

ఎప్పుడొస్తాడో కొడుకు
యాడ ఉన్నాడో
పోయెటప్పుడన్న
చెప్పన్న పోలేదు
ఎప్పుడొస్తాడో కొడుకు...

యాడ ఉన్నాడో కొడుకు
ఏమి తిన్నాడో
సద్ది గడతావంటె
వొద్దని పోయిండు
వొరం జెక్కి నోడు
వొడ్లు బెట్టి నోడు
బండ్లు గొట్టి దొరల
బంగ్ల గట్టినోడు
ఎప్పుడొస్తాడో కొడుకు...

వొంటి రెక్కవాడు
మీసము రానోడు
వాని పేరింటె దొరలకు
వొనుకు బుడుతుందట
ఎప్పుడొస్తాడో కొడుకు...

తైద అంబలుంది
తాగిపో బిడ్డంటె
మనోళ్ళు వొస్తారు
కాపాడి ఉంచండు
ఎప్పుడొస్తాడో కొడుకు...

ఇంటికి మంటికి
ఒక్కడవే కొడుకంటె
కూలిరై తులంత
నీ కొడుకులే నండు
ఎప్పుడొస్తాడో కొడుకు...

వొంగి కాల్లు మొక్కి
వొడిలోన తలబెట్టి
అమ్మ నువు నన్ను దీవిస్తె
అంతెసాలు నండు
ఎప్పుడొస్తాడో కొడుకు...

పక్కూరి దొరనేమొ
పట్టి నరికిండంట
మావూరు దొరకొరకు
మాటు గాస్తుండంట
ఎప్పుడొస్తాడో కొడుకు...

నావోల్ల యెంటుంటె
నాకు భయమేలేదు
యెమినోల్ల చేతుల్లో
బడకుంటె సాలును
ఎప్పుడొస్తాడో కొడుకు...

యెన్నొ రాత్రులనుండి
ఎదురు చూస్తున్నాను
సచ్చెనో బతికెనో
జాడ దెలియక పాయె
ఎప్పుడొస్తాడో కొడుకు...

మావోడి కొరకేమో
పోలీసులు వొస్తె
రోకలందుకొని
మళ్ళి రావొద్దన్నాను
నా కొడుకు పెయ్యిమీద
చెయ్యెవ్వడేసినా
మావూరు దొర పని
మరువక బడ్తాను
ఎప్పుడొస్తాడో కొడుకు...

# మాయన్నా ఓ జీతగాడ!

మాయన్నా ఓ జీతగాడ
చెల్లి పోతివా

కంచెగాసి కంచెగాసి
కష్ట పడితివా
మాయన్నా ఓ జీతగాడ
కన్ను మూస్తివా

ఎడ్లుగాసి ఎడ్లుగాసి
బాద పడితివా
మాయన్నో ఓజీతగాడ
ఏడ్చి చస్తివా

కుప్పగొట్టి కుప్పగొట్టి
కుమిలి పోతివా
మాయన్నా ఓ జీతగా
కూలిపోతివా

కళ్ళుతెరిచి ఉన్నోళ్ళు
ఆట చూడారా
మాయన్నా ఓ జీతగాడి
ఆలకించరా

మూలబడ్డ గొడ్డండ్లకు
సాన బెట్టరా
మాయన్నా ఓ జీతగాడ
చేతబట్టరా

నీ కష్టం మేసెటోన్ని
మట్టు బెట్టరా
మాయన్నో ఓ జీతగాడ
మాతం చేయరా

జీతముండీ జీతముండీ
జిమ్మె బాయెనా
మాయన్నా ఓ జీతగాడా
జీవి బాయెనా

బాయి దొవ్వి బాయి దొవ్వి
బొక్కలిరిగెనా
మాయన్నా ఓ జీతగాడ
బొందకై తివా

బండి గొట్టి బండి గొట్టి
కండ దరిగెనా
మాయిన్నా ఓ జీతగాడ
కాటికై తివా

దుక్కి దున్ని దుక్కి దున్ని
రెక్కలిరిగెనా
మాయన్నా ఓ జీతగాడ
ఆరిపోతివా

నారు బోసి నారు బోసి
నడుములిర్గెనా
మాయన్నా ఓ జీతగాడ
నల్గిపోతివా

ఒరం జెక్కి ఒరం జెక్కి
ఒరిగి పోతివా
మాయన్నా ఓ జీతగాడ
పీడి పోతివా

చేను గాసి చేను గాసి
చిన్నబోతివా

పుస్తక పరిచయం :

# చైనా విప్లవ చరిత్రే మావో సే-టుంగ్

"మావో విప్లవ శిశువు; విప్లవ నాయకుడు
మావో జాతి జీవితం మూర్తీభవించిన మానవుడు; మానవసముద్రం
మావో తన ప్రజల విద్యార్థి; వారి అధ్యాపకుడు
మావో ప్రజల మేధస్సుకు ప్రతినిధి; వారి విజ్ఞానానికి విస్పష్ట ప్రకటన
మావో నవచైనా నిర్మాత; చైనాలోని పాత సాంప్రదాయాలకుసమాధి
మావో ప్రజలు పాలకులకులొంగి వుండేధోరణికి, విధేయతకు
గొడ్డలి పెట్టు"

సుప్రసిద్ధ రచయిత్రి హాన్ సూయిన్ ఈ మధ్యనే రాసిన "ప్రభాత వెల్లువ: మావో సే-టుంగ్ మరియు చైనా విప్లవం" (The morning delupe: Mao Tse-tung and The Chines Revolution - Publishcd by Jonathan Cape, 615 PP. Price £ 5) అనే గ్రంథంలో మావో గురించి పైవిధంగా రాశారు. 'ప్రభాత వెల్లువ' గ్రంథంలో చైనా విప్లవం నుండీ మావో విడదీయలేని వ్యక్తిగా ఆమె అభివ్యక్తీకరించారు. అందుకే మావో గురించి తెలుసుకోగోరేవారు చైనా విప్లవ చరిత్ర నధ్యయనం చేయకుండా ఆయనను గురించి తెలుసుకోలేరు.

హాన్‌సూయిన్ అసలుపేరు చౌ ఎలిజబెత్ కుయాంగ్హూ. ఆమె 1917 లో పెకింగ్‌లో జన్మించారు. ఆమె పెకింగ్‌లోనూ, పిమ్మట బ్రిస్సెల్సులోనూ అధ్యయనం చేశారు. 1938 లో ఆమె చైనాకు తిరిగివచ్చి కర్నల్ టాంగ్ పావో హుఆంగ్‌ను వివాహం చేసుకొన్నారు. (టాంగ్ తరువాత జనరల్ అయ్యాడు) చైనా జపాన్‌వ్యతిరేకయుద్ధకాలంలో హాన్ సూయిన్ మిడ్‌వైఫరీ ఆచరించింది 1942లో ఆమెభర్తతో కూడా లండన్‌వెళ్ళి అక్కడ తన వైద్యవిద్య కొనసాగించింది. 1948లో వైద్యవిద్య పూర్తి చేసి, హాంగ్‌కాంగ్ మలయా, సింగపూర్‌లలో వైద్యవృత్తి నాచరించింది. చివరికి సింగపూర్‌లో ఆమె స్థిరపడింది. 1964 లో ఆమె వైద్యవృత్తినాపివేసి చైనా కమ్యూనిస్టు సమాజము, కమ్యూన్లలో చైనా ప్రజల జీవితము తదితర విషయాలలో మహా విస్తృతంగా పరిశోధన సాగించింది ఆ పరిశోధనల ఫలితంగానే హాన్ సూయిన్ ఇంతకుముందు '2001లో చైనా'అనే పుస్తకంరాసింది. (ఈ పుస్తకాన్ని "రేపటిచైనా" అనే పేరుతో తెలుగులోకి శ్రీ ఎ.బి.కె. ప్రసాద్ అనువదించారు.)

ప్రస్తుతం పరిశీలిస్తున్న "ప్రభాత వెల్లువ..."పుస్తకంలో హాన్‌సూయిన్ 1953 వరకు జరిగిన చైనా విప్లవాన్ని, మావో జీవితాన్ని గురించి విస్తృతంగా చర్చించింది. మావో శైశవదశనుండీ ప్రారంభించిన ఈ పుస్తకంలో హాన్ సూయిన్, మావో తన కుటుంబంలో, పాఠశాలలో ఏవిధంగా స్వతంత్రమైన అలవాట్లను పెంపొందించుకొన్నాడో, అధికారాన్ని ఏవిధంగా ప్రశ్నించేవాడో, సకారణంగా తనవాదాలను ఏవిధంగా కొనసాగించేవాడో చాలా విపులంగా వివరించింది. మావో సాధారణంగా కాలినడకన సాగించే ప్రయాణాలు అవి మామూలు ప్రయాణాలుగా గాక అధ్యయనయాత్రలుగా వుండేవి. మావో తన పరిసరప్రాంతాల పర్యటననేగాక హ్యునాన్‌ప్రాంతాన్నంతటినీ పర్యటించాడు. చివరికి పెకింగ్, షాంగైలనుకూడా ఆయన పర్యటించాడు. 1919 లో హ్యునాన్ రాజధాని చాంగ్షాలో జరిగిన మే 4 విద్యార్థి ఉద్యమంలో మావోపాల్గొన్నాడు. మావోఆలోచనలు, ఆ ఉద్యమంలో పాల్గొన్న యితరుల ఆలోచనలు చైనా కమ్యూనిస్టు పార్టీని ఏర్పరచేలక్ష్యంవైపు అక్కడనే అభివృద్ధిచెందాయి. పర్యవసానంగా 1921 లో చైనాకమ్యూనిస్టుపార్టీ ఏర్పాటుచేయడం జరిగింది. పార్టీనేర్పరచిన తొలిదశలో అనేక తప్పులు, లోపాలు సంభవించినా చైనా కమ్యూనిస్టు పార్టీ పెరగనారంభించింది. కార్మికులు, రైతాంగం సమీకరింపబడ్డారు. వారిలో విప్లవబీజాలు నాటబడ్డాయి.

చింగ్‌కాంగ్ పర్వతాల్లో మొదటి విప్లవస్థావరాన్ని ఏర్పాటు చేయడం, పార్టీలో సైద్ధాంతిక, ఎత్తుగడల అంతరంగిక పోరాటాలు, చాంగ్‌కైషేక్ విద్రోహకరపాత్ర, పార్టీసభ్యుల వూచకోత, లాంగ్‌మార్చ్ సాగించే నిర్ణయం వగైరా విషయాలు యీ గ్రంథంలో హాన్ సూయిన్ చక్కగా వివరించింది.

చైనావిప్లవంలో 1935 నుండీ 1947 దాకా జరిగిన ఏనాన్‌దశ చాలా ప్రధానమైనది. ఈ దశగురించి హాన్ సూయిన్ చాలా విపులంగా "ప్రభాత వెల్లువ"లో చర్చించింది. ఈకాలంలో భూసంస్కరణలకు సంబంధించి ప్రధానమైన అనుభవాల్ని సంపాదించడం జరిగింది. తరువాతి విప్లవదశకు మావో ఈకాలంలో చేసిన సైద్ధాంతిక రచనలు, ఉపన్యాసాలు యెంతగానో తోడ్పడ్డాయి. ఈదశలోనే దేశం నలుమూలలనుండీ యువకులు దొరికిన ప్రయాణాల సాధనాల్ని ఉపయోగించి ఏనాన్ చేరుకొన్నారు. ఈ దశలో పొందిన సంపూర్ణ సైద్ధాంతిక అవగాహనతోనే 1947 మార్చిలో చాంగ్‌కైషేక్ యొక్క 230,000 దళాలను త్రిప్పికొట్టగలిగారు. చైనా విప్లవ అంతిమ విజయానికి యిది తొలిమెట్టు అని పార్టీకేడరు ఎంతో సంతోషించారు.

చైనావిప్లవం 1949 లో విజయం సాధించినవెంటనే కొరియాయుద్ధం సంభవించింది. చైనా విదేశాంగ విధానానికి యిదొక పరీక్షాత్మక సంఘటన. చైనా విప్లవ

కాలంలో ఛిన్నాభిన్నమైన ఆర్థిక విధానాన్ని పునఃపటిష్టం చేసుకోవడం, చైనాను ప్రాథమికంగా పునర్నిర్మించుకోవడమనే అత్యవసర విషయాలు చైనా ప్రజలముందున్నాయి. అయినా ఈ ప్రలోభాలకులోనై చైనాప్రజలు తమ సోషలిస్టు కర్తవ్యాన్ని విస్మరించలేదు. చైనా ప్రజావాలంటీర్లు కొరియా ప్రజల పిలుపునందుకొన్నారు. అమెరికా దగ్గరి అటంబాంబును వారు లెక్కచేయలేదు. తమ సోషలిస్టు సోదరులకు బాసటగానిలవడమే తమ కర్తవ్యమని భావించారు. చైనా ప్రజలు తమమాటలను ఆచరించడంలో వెనుదీయరని సామ్రాజ్యవాదులకు చాటిచెప్పారు. హాన్ సూయిన్ ఈ సంఘటనలపై చాలా కుతూహలకరమైన వివరాల్ని తమ గ్రంథంలో అందించారు.

ప్రస్తుతం వెలువడింది 'ప్రభాత వెల్లువ...'యొక్క మొదటిభాగం మాత్రమే. లండన్‌నుండీ వెలువడే 'బ్రాడ్‌షీట్' పత్రిక 1973 జనవరి సంచికలో ఈ 'ప్రభాత వెల్లువ' పుస్తక సమీక్షను మొదటిపేజీలో ప్రధానవ్యాసంగా ప్రచురించింది. 'ప్రభాతవెల్లువ' పుస్తకం యిప్పటివరకూ మావో జీవితంపై వచ్చిన పుస్తకాలన్నింటికంటే మంచి పుస్తకమని ఆ పత్రిక పేర్కొంది.

హాన్ సూయిన్ పుస్తకంలో అధికారనివేదికలనుండీ పేర్కొన్నభాగాలు అధికంగా లేకపోయినా, చైనాప్రజలతో ఆమె జరిపిన సంభాషణలు, చైనాతో ఆమెకున్న అనుభవం ఈ పుస్తకవిలువను ఎంతగానో పెంచుతాయి. చైనాగురించి తెలుసుకోగోరే వారు ప్రతిఒక్కరూ "ప్రభాత వెల్లువ" చదవాలి. ఈ పుస్తకపు రెండవభాగం త్వరలోనే వెలువడుతుందని ఆశిద్దాం.

— కాశీపతి

1-1-1974

"కమ్యూనిస్టులు ప్రతీ విషయాన్నిగురించీ 'ఎందువల్ల ?' అని ప్రశ్నించుకోవాలి; ఎల్లప్పుడూ తమ మెదడును ఉపయోగించాలి. ఏది ఎంతవరకు వాస్తవమో, దానికి కారణమేమిటో తెలుసుకొనేందుకు కష్టపడి ఆలోచించాలి; దేన్నీ గుడ్డిగా అనుసరించకూడదు; బానిసబుద్ధికి స్వస్తి చెప్పాలి."

— మావో సే-టుంగ్

పుస్తక పరిచయం :

## ఛత్రారామం

అరుణపతాక ఛాయలో చైనాలో నవసమాజాన్ని ఏర్పాటుచుకొన్న ప్రజలు, దానిని ఎలా ఆహ్వానించినదీ చిత్రించే నవల ఛత్రారామం. నూతన పరిస్థితులకీ, విద్యార్థులకీ మధ్యజరిగిన సంఘర్షణను, క్రొత్తకీ పాతకీ మధ్య సంఘర్షణను వివరించే నవల ఇది. నవచైనా తొలి ప్రాంగణంలో విమోచన సైన్యానికి స్వాగతంచెప్పిన పైటా విశ్వవిద్యాలయ విద్యార్థిని ఈ నవలారచయిత్రి మేరియాయెన్.

1949 జనవరి ఆఖరిరోజు పెకింగ్ నగరంలో జపాన్ పాలనకి ఆఖరిరోజు. అంతర్యుద్ధానికి అంతిమగీతం పాడీనరోజు. మరుసటిరోజు యువరక్తం వురకలువేసే విమోచన దళాలునగరంలో ప్రవేశిస్తాయి ఆక్రమణకిముందు పాతప్రభుత్వం నిరంకుశ పాలనని వివరిస్తుంది యెన్. ఒక ప్రొఫెసర్ మాటల్లో నాటిపరిస్థితి "భవిష్యత్తులో జరిగే సంఘటనలకీ విద్యార్థులు వాతావరణ సూచిక. అతిత్వరలో ప్రభుత్వ పతనం తథ్యం కమ్యూనిస్టుల విజయం సత్యం."

మంచూరియా. ఉత్తర చైనాలద్వారా దూసుకువచ్చిన రెడ్ ఆర్మీ పెకింగ్ నగరాన్ని నాలుగువైపులనుండీ దాటివేసింది ఫిరంగి మ్రోతలలో, ఆర్మీట్రక్కుల రొదతో నగరం నిండిపోయింది. జనవరి 22న పెకింగ్ నగరం రెడ్ ఆర్మీ స్వాధీనం అయింది. రెడ్ ఆర్మీకీ, మిగిలిన సైన్యాలకీవున్న భేదం విపరంగా చప్పించబడింది నవలలో. పి, ఎల్. ఎ. సోల్జర్స్ పాటించే 'ప్రజలనించి ఒక సూదిగానీ, దారంముక్కగానీ తీసికొనరాదు' లాంటి మూడు నిబంధనలు, ఎనిమిది ఆశయాలు ప్రజలకి వారిమీద గౌరవాన్ని, అభిమానాన్ని సంపాయించి పెట్టాయి తర్వాత, సైన్యం, క్రొత్తసైనికులని, సుశిక్షితులను కలుపుకోని నాన్‌కింగ్. షాంగ్‌హైల విమోచనకోసం ముందుకుసాగింది.

నూతనయుగం జనియించింది. నిజమైన ప్రజాస్వామ్యాన్ని పోరాటంద్వారా చైనా సాధించింది. కానీ, ప్రజల అభిప్రాయాల్లో, అభిరుచుల్లో మార్పు వెంటనే రాలేదు. ఇదే ఈ నవలలో చిత్రించబడింది. మేరియా అంటుంది "విప్లవం పూర్తి కాలేదు, ఇప్పుడే ప్రారంభమయింది." విద్యార్థుల్లో మార్పు తీసికురావడానికి కమ్యూనిస్టులుచేసిన కృషిని వివరించేనవల ఇది,

పాఠశాల అనేది విద్యార్థులదే అనేవిషయం విద్యార్థులకి తెలిసింది. శారీరక కృషికన్నా మానసిక కృషి ముఖ్యమయిందనే బూర్జువా సిద్ధాంతాన్ని కూల్చివేయడానికి

విద్యార్థులు సిద్ధమయ్యారు. వ్యవసాయ వుత్పత్తి కృషిలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్మికులు నూతనప్రపంచ నిర్మాతలన్న విషయం విద్యార్థులు గుర్తించగలిగారు. ఆలోచనకి, ఆచరణకివున్న సంబంధం ఇదే. అందుకే మావో అంటారు "ఆచరణద్వారానే మార్క్సిజంని అధ్యయనం చేయగలం".

విద్యార్థులు అనేక సమస్యలని ఎదుర్కొన్నారు ముఖ్యమైంది ఆహార సమస్య. దీనికితోడు గ్రాంటులవిషయంలో అసంతృప్తి. సరియైన ఆహారంలేకపోవడం అనేక వ్యాధులకి కారణమైంది. కాడర్లకికూడా క్షయవ్యాధిసోకింది. కానీ, కమ్యూనిస్టులకి తమ మేలుకాదు కావలసింది. యువ విప్లవకారులు వ్యాధిని తమ బాడ్జ్‌గా భావించారు. నడుముకి తుపాకీ సరికొత్తఫ్యాషన్ అయింది.

విమర్శ- ఆత్మవిమర్శ అనే ఆయుధాన్ని ఎలావుపయోగించాల్సిందీ, విద్యార్థుల రాజకీయ పఠనాన్ని, సమావేశాల్నిచూస్తే తెలుస్తుంది. యువజన సమితి సభ్యులు, కామ్రేడ్స్, విద్యార్థులందరినీ కనిపెట్టివుండేవారు. తిరిగి పాతపద్ధతులు తలెత్తకుండా విశ్వవిద్యాలయంలోపల, బయటకూడా చాలా జాగ్రత్తగావుండేవారు. ఒక విద్యార్థి అంటాడు- "పూర్వం కోల్‌హిల్ సౌధ నిర్మాణం, దాని అందం, స్తంభాలు, శిలాప్రతిమలూ శాశ్వత కళాఖండాలుగా కనిపించేవి. వసంతకాలం, మంచు బిందువులు మన శాంతినిచ్చేవిగా వుండేవి. కానీ, లిబరేషన్‌తర్వాత వాలో సంఘర్షణ మొదలైంది. విముక్తికోసం, తరతరాల బానిసత్వంనించి బయటపడటంకోసం తమ జీవితాలను మన కామ్రేడ్స్ త్యాగంచేస్తున్నారు. నేను... నిజం- కోల్‌హిల్. పూర్వపు చక్రవర్తుల కల్మషభూయిష్ట జీవితాలకి చిహ్నం. సామాన్యప్రజల నెత్తురుచెమటల్లో నిర్మించబడ్డ కట్టడాలను చూస్తుంటే అసహ్యమేస్తోంది. వీటిని నేలకూల్చాలన్నంత ఆవేశంగావుంది.

ఉత్సవాల్లో విద్యార్థులు ప్రజల్లో కలిసిపోయేవారు. ఉత్సవాల్లో పాల్గొనకపోవడం బూర్జువా మనస్తత్వానికి చిహ్నం. సమావేశాల్లో ఎందుకుపాల్గొనాలో ఒక కమ్యూనిస్టు నాయకుడు చాలా చక్కగాచెప్తాడు. ఆ ప్రజా సమావేశాల్లో, ఆ జనసందోహ గందరగోళాల్లో, కామ్రేడ్ మావోకి జయంపలుకుతూ నూతనజీవితంవైపు చేతులుజాచేవాళ్ళు విద్యార్థులు.

పైటా విశ్వవిద్యాలయంలో మతానికి అంత ప్రాముఖ్యంవుండేది కాదు. మత విశ్వాసాలు ఒకతరంనించి ఇంకోతరానికి సంక్రమిస్తూవుంటాయి. చైర్మన్ మావో 'నూతన ప్రజాస్వామ్యం'లో అంటారు "కమ్యూనిస్టు ప్రజాశక్తి నంతటినీ రాజకీయంగా కేంద్రీకరింపచేయటానికి అన్నిమతాలవారినికూడ దీసుకోవాలి. కానీ, వారి మత సిద్ధాంతాలను, నమ్మకాలను మనం ఆమోదించాము,"

కానీ, క్రమంగా "మతం అనేది ప్రజలపాలిట నల్లమందు. దీనిని సేవించే, పెట్టుబడిదారి బానిసలు తమ మానవత్వాన్ని, సభ్యతను కోల్పోతున్నారు" అన్న లెనిన్ మాటలు పైకివచ్చాయి. కాథలిక్ ఆధిపత్యం క్రమంగా విశ్వవిద్యాలయం (ఫూజెన్) నించి తొలగించబడింది.

అన్నివిధాలా విద్యార్థులలో మార్పులు తీసికరావటమే పైటా విశ్వవిద్యాలయంలో కమ్యూనిస్టుల లక్ష్యం. పైటా విప్లవకారులకు శిక్షణాకేంద్రంగా తయారైంది. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యక్రమాన్ని విద్యార్థులే నిర్ణయించేహక్కు వారికి యివ్వబడింది. రాజకీయ తరగతులలో మార్క్సిజాన్ని, మావో ఆలోచనా విధానాన్ని బోధించేవారు. 'పరీక్షలకోసం చదవటం' అనేది పూర్తిగా మారిపోయింది. నూతన ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన కార్యక్రమాలు నిర్వహించడానికి పెకింగ్ విద్యార్థులు శిక్షణపొందారు. విద్యార్థి - అధ్యాపక బాంధవ్యంలో మార్పువచ్చింది. లిబరేషన్ తర్వాత విద్యార్థులు, ప్రొఫెసర్లు చేతులుగలిపి పనిచేశారు. ప్రేమ, వివాహాల విషయంలో విద్యార్థుల భావాల్లోవచ్చిన మార్పులని తెలియచేస్తుంది నవలాకారిణి.

ప్రేమనిగురించి వారి సిద్ధాంతం "నామనస్సు బూర్జువా సిద్ధాంతాలనుండి వైదొలగి నూతన పంథాలకి అలవాటు కాగలిగితే, ప్రేమ, వివాహం, నామనస్సుని నా పని నించి, నాపార్టీ సేవనించి తొలగించలేవు.

నవల తర్వాతి అధ్యాయాల్లో మేరియా మానసిక సంఘర్షణ వ్యక్తమౌతుంది. మేరియాలో పలాయనవాదం ఎక్కువౌతుంది. ప్రజాస్వామిక పద్ధతులలో స్వార్థాన్ని వదులుకోని పనిచెయ్యలేకపోతుంది, విమోచనకిపూర్వం వున్నదానితో తృప్తిపడే మేరియా తర్వాత వచ్చిన మార్పులని తట్టుకోలేకపోతుంది. వ్యక్తిగత ఇష్టాలకి, సౌఖ్యాలకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. చివరికి బ్రిటీష్ వలసరాజ్యమైన హాంగ్‌కాంగ్ వెళ్తుంది.

అభిప్రాయాలని మార్చుకోలేని పిరికిపందలు, పెటీబూర్జువాలు ఎల్లప్పుడూ వుంటారు. కానీ, అధికభాగం విద్యార్థులు ప్రజలకోసం పడ్డకష్టం, విద్యార్థులలో వచ్చిన మార్పులు వివరంగా చర్చించబడ్డాయి ఈ నవలలో. కృషికి, శ్రామికశక్తికీ ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వంలో విద్యార్థుల అనుభవాలు, సమిష్టిగా వారుచేసిన కృషి నవలలో వ్యక్తమౌతాయి.

చైనీస్ రచన: మేరియాయెన్, ఆంగ్ల అనుసరణ: మేరియాయెన్ - రిచర్డు యం. మకార్థీ తెలుగు అనువాదం: మల్లాది నరసింహశాస్త్రి. 1958 లో యువ కర్షక సంస్థ, విజయవాడవారిచే ప్రచురింపబడింది.

సమీక్ష :

## అడివంటుకుంది

భూషణం కథలు : శ్రీకాకుళం ప్రచురణలు

భూషణం తూర్పు కొండల్లో పండించిన పోడుపంట అడివంటుకుంది. కొండల్లోకి షావుకార్లు చొరబడిన దగ్గర్నుంచి దోపిడీ శక్తులని గిరిజన రైతాంగం ప్రతిఘటించే దశవరకు శ్రీకాకుళం ఏజెన్సీ జీవితం ప్రధానంగా ఈకథల్లో మనకు దొరకుతుంది. జర్నలిస్టుల నిజాయితీకి చేతనయిన ప్రత్యక్ష కథనం ఈ రచనల బలం.

షావుకారు సత్తియ్య పల్లంలో చెడిపోయాడు. కొండల్లో సవరపల్లెల్లో తలమీద గంపతో ఉప్పు పొగాకూ బెల్లమూ మోసి ఇంతవాడు అంతవాడై అంతవాడు పోలీసుల్ని కోర్టుల్ని ఆజ్ఞాపించ గలిగినంతవాడై రాజ్యాంగానికి ప్రతినిధిగా అడివంతా తానే అయిపోయాడు.

దిక్కుమాలిన చావు చవ్వడానికి అడవుల్లోకి వచ్చినప్పుడు సవరగూడ పెద్ద సారికి సిద్దం బడిసాల్లోకి బత్తెం పంపించి పేసిగానికి తోడిచ్చి తిండిపెట్టి బతుకుమీద ఆశ కల్పించాడు. తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టాడు సత్తియ్య షావుకారు.

అడవుల్ని, జనరల్ ఎలక్షన్లనీ, పంచాయితీ ఎన్నికల్నీ, పంచవర్ష ప్రణాళికల్నీ, గిరిజనాభివృద్ధి పథకాల్నీ, కార్పొరేషన్లనీ, తినేసి బలిసి, దోపిడీశక్తుల నిరంకుశత్వానికి ప్రతినిధిగా షావుకారు సత్తియ్య తన తుపాకి గుండ్లకు సారికి సిద్దం కొడుకు మంగుల్ని పొట్టపెట్టుకున్న కథ ఇది. మూడురంగుల జెండా పేల్చిన తుపాకీగుండుకి ప్రతీకారంగా గిరిజన రైతాంగం గొడ్డళ్ళు, కొడవళ్ళు, బాకులు, బాణాలు పట్టుకుని అంటుకున్న అడవి నడుస్తున్నట్టుగా దోపిడీవర్గాలమీదికి పోతున్న దృశ్యం ఈ కథ.

'ఉద్ధరింపు' రెండో కథ. లెక్కలాంటిది. ఏజెన్సీలో షావుకార్ల దోపిడీనించి గిరిజనుల్ని కాపాట్టానికి దయగల ప్రభుత్వం కార్పొరేషన్లను నెలకొల్పింది. షావుకారు సరుకు గిరిజనుల్నించి కొనకూడదు. గిరిజనులు అమ్మకూడదు.

ఒకానొక నిమ్మక సంగమ్మ దగ్గర్నించి ఒకానొక చిన్న షావుకారు దొంగతనంగా ఇప్ప పప్పు కొంటుండంగా ఒకానొక కార్పొరేషన్ మనిషి కళ్ళల్లో పడ్డాడు. షావుకారుకి వార్నింగ్ ఇచ్చి పంపించేసి అదే పప్పును ఏలినవారి కార్పొరేషన్‌లో తూకం వేయించి గోదాంలో కలిపేయించాడు.

షావుకారు తూకం వేస్తే ఆరుకేజీలయిన ఇప్పపప్పు కార్పొరేషన్ తూకంలో మూడు కేజీలయింది. షావుకారు కేజీ రూపాయి ఎనభై పైసల్లెక్కన పది రూపాయిల ఎనభై పైసలైతే పదకొండు రూపాయిలు ఇవ్వజూపితే అదే ఇప్ప పప్పు ప్రభుత్వం ధర కేజీ రూపాయి ఇరవై పైసలు చొప్పున మూడు రూపాయల అరవై పైసల్ని దయగల ఏలినవారి కార్పొరేషన్ నిమ్మక సంగమ్మ చేతిలోపెట్టారు. ఎంత ఏడ్చినా పప్పు తిరిగి ఇవ్వలేదు సరికదా వాచ్‌మన్‌తో బయటికి గెంటించారు. తల్లి జబ్బు పాలయింది. డాక్టర్‌బాబు ఫీజుకోసం తను నెలరోజులు కష్టపడి ఏరిన ఇప్పపప్పు అమ్మాల్సి వచ్చింది. తీరా చేతికందిన ఫలితం అలాగే ఆచేతుల్లోనే డాక్టరు చేతుల్లో పోసింది నిమ్మక సంగమ్మ. డిస్టిల్డ్ వాటర్ సూదిమందు ఇచ్చి అక్కడికి అది సరిపోయిందనుకున్నాడు.

పది రూపాయిలకు ఏడురూపాయిలు లాభమయితే నూరు రూపాయిలకు ఎంత లాభం? వెయ్యి రూపాయిలకు ఎంత లాభం? ఈ లాభాలు ఎక్కడికి పోతున్నాయి? ఈ పెద్ద షావుకారు ఎవరు? వాడు ఈ లాభాల దోపిడీ వ్యాపారం సాగించడానికి వెనక ఉన్న సాధన సామగ్రి ఏమిటి? అదే సమయంలో పదిరూపాయిలకి ఏడు రూపాయిల చొప్పున నష్టపోతే నష్టశాతం ఎంత? కోట్లాది శ్రమజీవులకు ప్రతినిత్యం జరుగుతున్న ఈ నష్టం ఎంత? ఈ లెక్కలు వర్గచైతన్యం ఉన్న పాఠకులు చెయ్యాలి.

ఉద్ధరింపు కథలో మనకి స్పష్టంగా తెలిసేదేమిటంటే ప్రత్యక్షంగా ప్రభుత్వం ప్రొక్యూర్‌మెంట్, కార్పొరేషన్‌ల పేరుతో సాగించే దోపిడీ. నిమ్మక సంగమ్మల నెల రోజుల కష్టం ఈజ్ ఈక్వల్ టు డాక్టరుబాబు డిస్టిల్డ్‌వాటర్ సూదిమందు. ఏలినవారి ఉద్ధరింపు అదంతా.

మూడోకథ 'తీర్పు'. తెలుగులో వచ్చిన మంచి కథల జాబితాలో చేరాల్సినంత గొప్పకథ. శిల్పంలో వస్తువులో, పెద్ద కేన్వాసుమీద చిత్రీకరణలో రచయిత ప్రతిభని చూపించిన కథ. రచయిత సమర్థతని, తన సొంత ముద్రనీ చూపించిన కథ తీర్పు.

పాపినాయుడు భూకామందు. పాతికెకరాల మెట్టూ, పాతికెకరాల పల్లమూ కాక నాలుగ్గదుల డాబా, చింతపిక్కలాంటి కోడలు, మంచం పట్టేసిన పెళ్లము, గెడకర్ర లాంటి ఒకేఒక్క కొడుకూ, రెండొందల తులాల బంగారము, రెండు బీరువాల్లో లెక్కలేనంత రొక్కమూ పాపినాయుడుకున్న సంపద.

శివ్వాల సత్తిగాడు (కరెంట్‌గాడు) రోజుకూలీ. వాడికి వాడి వొళ్ళు కురిసే చిన్న ఇల్లు ఉన్న సంపద.

పట్టణాల్లో కూలీలు, కళాసీలు, పల్లెల్లో రైతుకూలీలు కంటె నికృష్టమయిన బతుకు కంబార్లు- జీతగాళ్ళ- పాలేర్లు అని చెప్పబడే శ్రమజీవులది. వీళ్ళు మన సమాజంలోని అర్ధబానిసలు. పెద్ద రైతులు, భూస్వాములు వీళ్ళని సంవత్సరానికి ఖరీదు కడ్తారు.

శివ్వాల సత్తిగాడు రోజుకూలిగా బతకలేక పాపినాయుడుదగ్గర కంబారిగా చేరిన పరిస్థితుల్ని, కంబార్ల బానిసత్వాన్ని చిత్రించే కథ తీర్పు.

సమితి ఎలక్షన్ రాజకీయాల్లో ఊరుకు కరెంట్‌వచ్చిన కొత్తలో నేస్తుల ఇగటాల్లో శివ్వాల సత్తిగాడు ఎలట్రిస్తంబం ఎక్కిపోయి తీగెల్ని పట్టేయబోయి అక్కణ్నించి షాక్‌తో కిందపడిదాంతో మంచంపట్టేసి, అప్పులపాలయి, బతికి బట్టకట్టి పాపినాయుడుదగ్గర కంబారితనానికి కుదురుకుని కరెంటుగాడయ్యాడు.

ఆ రోజుల్లో ఊళ్ళల్లో 'సంగాలు' వెలుస్తున్నాయి. పేదరైతుల్నీ, వ్యవసాయ కూలీల్నీ, కంబార్లనీ ఒక్కటిచేస్తున్నాయి. శ్రమజీవులకు వర్గదృక్పథం కలుగుతున్నది, వర్గచైతన్యం రగుల్కొంటున్నది. ప్రజల సంఘీభావాన్ని భూకామందులు భరించలేకపోతున్నారు, కరెంట్‌షాకుతో మంచానపడినప్పుడు సేవచేసిన పొట్టిసరస ప్రోత్సాహంతో సంగంలోచేరాడు సత్తిగాడు. తర్వాత సరస తన పెళ్ళమయింది.

సంగం కంబార్ల సమ్మెనడిపింది. గ్రామం తట్టుకోలేక మీటింగులు పెట్టుకుని సంగం అడిగినదాంట్లో సబువు ఒప్పుకుని బుగతలు తాత్కాలికంగా లొంగిపోయారు. బుగతల ఎత్తుగడ అది. వ్యవస్థపరంగా తమకు లభిస్తున్న అన్ని నిరంకుశహక్కుల్నీ, హంగుల్నీ సరిచేసుకుని సంగంమీద దెబ్బతీయడానికి బుగతలకు వ్యవధికావాలి.

ఆ కుట్రలోభాగంగా పాపినాయుడు సత్తిగాడిమీద మోపిన దొంగతనం. భూకామందులు, బుగతలు, నిండుచూలాలు సరసనితెచ్చి పాపినాయుడు గుమ్మంలో గుజానికి కట్టిఉంచారు. పోలీసులు ప్రత్యక్షంఅయ్యారు. ముందు పోలీస్‌స్టేషన్‌కి, కోర్టుకి, జైలుకి ఇదీ సంగంమీద దెబ్బతీయడానికి బుగతలముందున్న కార్యక్రమం.

సంగం ఇచ్చిన చైతన్యంతో తెగించేసాడు సత్తిగాడు. సరసని కట్టేసిన కట్లిప్పి 'ఎవళకి ముందు సవ్వాలనుంటే ఆలే తొలిరండి. దెబ్బకి బుక్కెడు రగతాన్ని కక్కుదురుగాని' అని తొడలుచరిచి కర్రపైకెత్తి నిలబడ్డాడు. చుట్టూ మంచాలమీద అరుగుల మీద కూచున్న బుగతలను ఉద్దేశించి. తనమీద తీర్పుచెప్పటానికి ఎదురుతిరిగి తానే తీర్పుచెప్పాడు.

ఈ సంపుటిలోని మూడుకథల్లో బాగా జీవితాన్నిపట్టుకున్న కథ 'తీర్పు'. పాత భూషణంస్థాయిలో ఉన్నకథ ఉద్దరింపు, శిల్పంగా బలహీనమైనా వస్తువు బలంగాఉన్న కథ 'అడివంటుకుంది'.

మొదటికథ 'అడివంటుకుంది' చచ్చిపోవడానికి అడివిలోకిపోతున్న సత్తెయ్య షావుకారుతో ఆరంభమవుతుంది. అయితే ఆ చెప్పడంతో కన్‌విన్స్‌కాము, కాశీమజిలీ కథలో ఉన్నట్టు ధ్వనిస్తుంది తప్పించి వాస్తవంలో తోచదు. క్లాసికల్ సింప్లిసిటీ కాశీ మజిలీ కథల్లోఉన్న లక్షణం అదికూడాకాదు. పాత్రని, కథని, సంఘటననీ రచయిత తొలి వాక్యాల్లో పరిచయంచేయాల్సి ఉంటుందికాబట్టే కథ ఆరంభంకోసం రచయితలు పడే ప్రసవవేదన ఈరాసామి పోలీసువేషం వేసుకుని మేకపిల్లని సవరగూడెంనించి పట్ట పగలు పబ్లిగ్గా ఎత్తుకుపోతున్న దృశ్యందగ్గర సత్తియ్య షావుకారును పరిచయంచేస్తే ఆరంభం బలంగాఉండేది. పెద్ద భూస్వాములకు, పెద్దవ్యాపారులకు, పోలీసు అధికారు లకు ఏజెంట్లుగాఉండే గుండాలకిమాత్రమే ఆదెమ్మ మేకపిల్లను ఎత్తుకుపోగల బలం ఉంటుంది. ఎప్పుడన్నా ఈరాసామిలాంటి వాళ్ళు ఇలాంటిమోసాలు చేయొచ్చుకాని పదే పదే చేయలేరు. తమకు సవరపల్లెల్లోఉన్న దోపిడీ హక్కును ఈరాసామిలాంటోళ్ళు కాజేయటానికి పోలీసులుగాని, భూస్వాములుగాని, వర్తకులుగాని, వాళ్ళ ఏజెంట్లుగాని ఒప్పుకోరు. 'కర్రెట్టుకోని జమీనుదారునాగ దమాయించేసి ఏదిదొరికితె అది లంకించు కుని వొచ్చేసి పల్లంలో అమ్మేత్తన్నాను' అంటాడు ఈరాసామి.

సత్తెయ్య షావుకారు వ్యాపారంలో దెబ్బతినేయడానికి రచయిత చెప్పే కారణాలు ఇవి. 'ధాన్యం బస్తాలకు అడ్వాన్స్‌గా ఇచ్చిన డబ్బులు భూస్వాములు ఎగమెట్టేసేరు. కాతాలు పట్టుకెళ్ళిన వాళ్ళు సగం సగం జమలిచ్చేసరికే తలప్రాణం తోక్కొచ్చినట్టు చేస్సి, దివాలాతీయించేసేరు. కరణం వల్లో పడిపోయిన పెళ్ళం ఇల్లు గుల్లచేసి ఉన్న పదీపరకా అతగాడికి దోపేసింది. అంతేకాకుండా కూతురు ఇరవైతులాల పాతబంగారం తీసుకుని మునసబుగారబ్బాయితో లేచిపోయింది.'

ఈ కథాకాలంనాటికి వర్తకులు దెబ్బతినేయడానికి ప్రధాన కారణం ఆర్థిక సం క్షోభం- పెద్దవర్తకుల దోపిడీకి చిన్నవర్తకులు బలవడం. ధరలు పెరిగి పెరిగి యుద్ధా నంతరం ఒక్కసారి పడిపోయాయి. ఈ దశలో చాలామంది వర్తకులు భూస్వాముల కిచ్చిన అడ్వాన్సులు వదులుకోవాల్సి వచ్చింది. పడిపోయిన ధరలకు కొనలేక సత్తియ్య షావుకారుకు ఎదురయిన కుటుంబ కారణాలు ఒకటోరెండో అక్కడా అక్కడా జరిగితే జరగొచ్చు. కాని దోపిడీ సమాజ స్వభావాన్ని పట్టిచ్చే రచనల్లో వర్గసమాజంలోని ఆర్థిక సంక్షోభాన్ని ఆ కారణాలు చూపలేవు.

తీర్పు కథలో సంగం చైతన్యాన్ని చెపుతూనే, సమ్మెచేసి సాధించిన విజయాన్ని చూపుతూనే కరెంటుగాడి (సత్తిగాడి) పెళ్ళం సరస కడుపుతో ఉంటే భూస్వాములు తెచ్చి గుమ్మంలో కట్టేసినపుడు, కరెంటుగాడిమీద దొంగతనం నేరం మోపినప్పుడు

ఏ సంగమూ కనబడదు. వ్యవసాయ కూలీలూ కనబడరు. కంబార్లూ కనబడరు. ఒక్క కరెంటుగాడే తన యుద్ధం తాను చేసుకుంటాడు. దీనిక్కారణం సంగం చైతన్యం లోపం కాదు– రచయిత అవగాహన లోపం స్పష్టం. సంగం సంగం అని చెప్తానే సంగం రాజకీయాలని చెప్పేదగ్గర రచయిత రాజీ ధోరణిలో కనబడతాడు. ఈ కథల్లో కమ్యూనిస్ట్, నక్సలైట్ అన్న పదాలు అవసరం, అనివార్యం అయిన దగ్గరకూడా అవి రాకుండా ఉండటానికి రచయిత చాల జాగ్రత్తపడ్డాడు. శ్రీకాకుళం జిల్లాలో గిరిజన రైతాంగం పోరాటంని నడిపింది కమ్యూనిస్ట్‌పార్టీ అని చెప్పటానికి రచయితకి ఏం అడ్డమొచ్చిందో అర్థంకాదు. శ్రమజీవులకు కమ్యూనిస్ట్ పార్టీ, ఎర్రజెండా తల్లీ తండ్రీ లాంటివి. ముఖ్యంగా దశాబ్దంపైగా చరిత్రఉన్న గిరిజన రైతాంగ ఉద్యమానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. భారత దేశ రాజకీయాలకు క్రొత్త వేగాన్ని ఇచ్చిందిక్కడ. మహోన్నతమైన రైతాంగ సాయుధ విప్లవాన్ని సృష్టించిన కమ్యూనిస్టుపార్టీ పాత్రపట్ల రచయిత ఉదాసీన వైఖరి చరిత్ర వక్రీకరణ ప్రమాదాన్ని తెచ్చిపెడ్తున్నది. ఐతే రచయిత నిజాయితీని శంకించాల్సిన పనిలేదు. రచయిత రాజకీయ అవగాహన లోపంవల్లనే ఈ పొరపాట్లు జరిగాయి. సంపుటి తప్పనిసరిగా కథారచనలో ముఖ్యంగా పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ రచయితలమీద పెద్ద ప్రభావాన్ని చూపగలుగుతుంది. కథాసాహిత్యంలో– రాచకొండ విశ్వనాథశాస్త్రి గారన్నట్టు– ఇవి మూడు (కొత్త) భూషణాలు.

— శ్రీపతి

---

## అడివంటుకుంది

వెల: 1-25 పైసలు | కథలు | — భూషణం

'శ్రీకాకుళ ప్రచురణలు' పార్వతీపురం

ప్రతులకు : ఉపాధ్యాయ ప్రచురణలు, విష్ణువర్ధనరావువీధి,
సూర్యారావుపేట, విజయవాడ - 2

సాహిత్యలేఖ :

డియర్ కామ్రేడ్

మీ ఉత్తరం అందగానే ఒకటి రెండు పనులు చేసేలోపుగానే జ్వరం రాక్షసి చుట్టుకున్నది. బెడ్ పైన 10 రోజులవరకు ఉండవలసేవచ్చింది. ఏకాస్త తగ్గిందన్న కాడినుండి అదో ఇదో రాతపనులు చేస్తూనేఉన్నా. అసలుమీకు ఉత్తరం ఎప్పుడో రాయవలసి ఉండవలసింది ఈలోగానే చాలా ఆలశ్యంఅయ్యింది. మన పనులు ఏ క్షణానికి ఆ క్షణాన్నె జరిగిపోవాలి. మరి ఎంతపనిచేసినా మన పాత జీవితం ఉండనేఉన్నది. అది మనకు చాలానే బద్ధకంనేర్పినది. మనం ఎంతోఆలశ్యంగా పనులుచేసేట్టుగా అది చేసింది. కాని అన్నింటిని తలదన్నుకొనివచ్చిన కాలం ఇది. కత్తిలాంటిది. తప్పని సరిగా మనని కత్తిలాగానే కదులుస్తూఉన్నది. ఏ క్షణం ఊపిరిపీల్చుకోయత్నించినా ఏంచేస్తున్నవు? అని ప్రశ్నిస్తున్నది. నిజంగా ఎంతగొప్ప జీవితంలోపడ్డాము. చందమామలాంటి మెత్తని, సూర్యునిలాంటి పదునైన పేదల బాధల గూళ్ళలోని అందాల రాముడు మనల్ని ఆదేశిస్తున్నాడు. 'పేదలగుండె'ను ప్రేమించక ఇంకెవరిని ప్రేమించమంటావు. నవ్వినప్పుడు నీళ్ళు, కసితో కోపంలో ఉన్నప్పుడు నీళ్ళు కళ్ళల్లో తిరిగేదిఐనా రెంటికి ఎంత వ్యత్యాసముందో? అలాగే పనులల్లో కర్తవ్యాల్లో తేడాలుఉంటాయి. రెంటిని నేర్చినప్పుడు గుండె ఆనందంతో జివ్వున రక్తం ప్రవహిస్తుంది. ఆ అనుభవాలు, అనుభూతులు– ఈ జీవితానికి ధన్యతనివ్వవు! తప్పకుండా– నేడు ప్రతినరము, ప్రతి అణువు, ప్రతి రక్తపుబొట్టు కర్తవ్యం నిర్దేశిస్తున్నది. జుత్తుపట్టి నిలబెడుతుంది వ్యక్తిగతమైన అన్నింటికి ఎదురుతిరగమంటున్నది. ఇది జీవితాన్ని హిమాలయ శిఖరాలపై నిలబెట్టే ప్రయత్నమే చేస్తున్నది. మనదారికి పాయలు లేక పిల్లబాటలులేవు. మనకళ్ళముందే ఉన్నదికాబట్టి మనచుట్టూ చూసుకోనక్కరనేలేదు. మనజీవితాలు ఒకరి జీవితం మరింకొకరికి ఎంతో ఉత్తేజితం కలిగించేవిగా ఉండాలె. ప్రతిక్షణాన్ని వినియోగపర్చుకోవాలె. ఎంతోవిభువైన వజ్ర వైడూర్యాలకన్నా ఎక్కువ మెరిసే మన అమరవీరుల రక్తపుచుక్కలు మన కళ్ళముందు ప్రతిక్షణం ఖణేల్ ఖణేల్‌మంటూ మెరవడంలేదు. ఆస్మృతి ఎంతో విషాదంతోపాటు కసిని కర్తవ్యనిర్దేశనను చవిచూపుటలేదా! భవిష్యత్‌పై కమ్మటి మమకారాలు ఆజీవులు మనలో సృష్టించినయి. మన పాదాల్లోని ప్రతిఅడుగు వారి ఆజ్ఞపైనే పడుతున్నాయా! అవసరమైనప్పుడు అమితమైన కసి రాజీలేని పోరాటం, ప్రతి శ్రామికవర్గ ప్రయోజనానికి స్పందించడం మనకళ్ళలో వాళ్ళు ప్రతిష్టించిపోయిన భావమేకదా! చూసిన ప్రతి ప్రదేశంలో, కలిశిన ప్రతి రైతు

కూలితో, కదిలించిన ప్రతి యువకుని భావనలో ఏమిటిగోచరిస్తున్నది? చెబితే విన యంగావినే ప్రతి పౌరునిలో, పాడితే ఆశ్చర్యంగా. ఆతృతగా ప్రేమగావినే ప్రతి ప్రేక్షకునిలో, ఆటతోకదిలే నినాదించే ప్రతి యువతగుండెలో ఏ ఊసులు కదులాడుతున్నయ్? బరివాతలదిరిగే పిలగాళ్ళనించి బుడ్డగోశి చెక్కినవాళ్ళవరకు ఎర్రజెండా పట్టడంతోనే పరవశించిపోయి కాలాన్నే సవాల్‌చేస్తున్న పిడికిళ్ళు ఏమని హుంకరిస్తున్నాయి? డప్పునుండి వెలువడే ప్రతి కోలచప్పుడు కొమ్ముతో పరాకాష్ఠనందుకునేరాగం ఎరుపుగుండెలో ఏయే బాసలుచేస్తున్నాయి.

"అప్పుడు (తెలంగాణ పోరాటం) పట్టింది ఎర్రజెండే
ఇప్పుడుపట్టింది ఎర్రజెండే
అప్పుడు తుపాకులు బుజానపెట్టుకొని నడిచింది ఎర్రజెండానీడనే
ఇప్పుడు ఎర్రజెండానే పట్టినమూ
తుపాకులు పట్టుకొని కదులుదాము పదసె
బుజాలు ఇంకా గట్టిగనె ఉన్నయి
బతికినా ఎర్రజెండకిందనే
సచ్చినా ఎర్రజెండకిందనే—" (ఒక రైతుమాటలివి)

"పల్లగిప్పుడు గనిపిచ్చినారు
సంఘమంటె గిదేనా!
దొరతోటి కొట్లాడుదామంటిరి
ఖతం చేద్దామంటిరి!
ఆన్ని ఖతంచేశెవరకు
అడే మమ్మల్నందర్ని ఖతంజేస్తడు
ఇగో! మీరు మేంజెప్పినట్టింటరా
లేక ఎప్పుడు మీరుజెప్పినట్లె ఇనాల్నా
మెల్లమెల్లగ జేద్దామంటె మాతోటిగాదు
సల్లసల్లగ వాడు మాపానాలు దీస్తడు
ఆవలిస్తె పేగుల్ లెక్కబెడ్తడు
ఆ ఊ అంటే పక్కలిరుగదంతడు.
మీరు మంచికె చెబుతుండ్రి
నదువుకున్నోళ్ళు. మామంచెకోరుతుండ్రు
గని అటు ఇటు మెశిలెవరకే
పిట్ట బుర్రిమంటది
గడిసుట్టు బందోబస్తుంటది
ఇగ అప్పుడు గిట్ల గూడువొదిలిమా
గుడిశెకేరాము.
సంఘపోల్లు మామాట ఇనుర్రి
ఇంక ఆల్సంజేయకుండ్రి
చేస్తె ఏదోఒకటి చేశెద్దా
ఎన్కముందు ఏందట
పడ్తె పనిపడ్తాము
లేకుంటె సప్పుడ్జేక ముదుర్కొని
పండుకుందాము- (కూలిజనాలగొంతు)

నీ మిత్రుడు

## మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీ రైతు గెరిల్లాలు
## శ్రీ కిష్టాగౌడ్, శ్రీ భూమయ్యలపై ఉరిశిక్షలు రద్దుచేయాలి

జంటనగరాల పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు
పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రకటన

శ్రీ నాగభూషణ పట్నాయక్ పై విధించిన ఉరిశిక్షను రద్దుచేసి యావజ్జీవ శిక్షగా మార్చడం దేశంలోని ప్రజాస్వామ్య శక్తుల విజయం.

శ్రీయుతులు కిష్టాగౌడ్, భూమయ్య ఆదిలాబాదు జిల్లాకు చెందిన మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ రైతు కార్యకర్తలు. వీళ్ళపై సెషన్స్‌కోర్టు విధించిన ఉరిశిక్షను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఖాయంచేసింది. వీళ్ళిప్పుడు సికింద్రాబాదులోని ముషీరాబాదు జెయిల్లో వున్నారు. 1947 తర్వాత రాజకీయ నేరాలకొరకు ఏరాజకీయ కార్యకర్త కూడ ఉరితీయబడలేదన్నది అందరికీ తెలిసినవిషయమే. ఇంతా రమణారెడ్డిపై వున్న మరణదండనను యావజ్జీవ శిక్షగా మారుస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 'ఆయన ఉద్దేశం (motive) ప్రజా సంబంధమైంద'ని చెప్పింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అపీల్ చేసుకుంటే అది పెండింగ్‌లోవున్నది. అందువల్ల, రాజకీయ సంబంధమైన నేరాల విషయంలో మరణశిక్షలను యావజ్జీవ శిక్షలుగా మార్చాలని, న్యాయమూర్తుల్లోనే కొందరు, ప్రజలందరూ అభిప్రాయపడుతున్నారనేది స్పష్టం.

శ్రీయుతులు కిష్టాగౌడ్, భూమయ్యలపై విధించిన మరణదండనలను యావజ్జీవ శిక్షలుగా మార్చాలని సంఘటితంగా పోరాటంచేయవలసిందిగా దేశంలోని ప్రజాస్వామ్య శక్తులను కోరుతున్నాం.

హైదరాబాదు
4-1-74

పత్తిపాటి వెంకటేశ్వర్లు
అడ్వొకేటు

---

### స వ ర ణ

36 వ పేజీ తర్వాత 37 కి బదులుగా పొరపాటున 41 తో అచ్చయ్యాయి. పాఠకులు యీ అసౌకర్యాన్ని సవరించుకొని అది 37 గానే గుర్తించి అదేవరుసలో చదువుకొన కోరుతున్నం.

SRJANA Telugu Monthly Feb. '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

కొత్త పుస్తకాలు :

1. చైనా కమ్యూనిస్టుపార్టీ 30 సంవత్సరాల చరిత్ర (1921–51) 1–75
2. చైనాలో పొడిచిన సూర్యుడు 0–80
3. రెడ్ శాల్యూట్ కవితా సంకలనం కాశీపతి 1–00

— విమోచన ప్రచురణలు

4. చారుమజుందార్ రచనలు 3–50
5. పార్టీలో కార్యవిధానాన్ని సరిచేసుకోవాల్సిన అవసరం 0–30
6. భారత ప్రజా విమోచనసైన్యం అవతరణను కీర్తించండి 0–15
7. భారతదేశంలో సోవియట్ రివిజనిజం కొనసాగిస్తున్న సోషల్ సామ్రాజ్యవాద ఆర్థికదోపిడి.
   పీపుల్స్ డెయిలీ వ్యాసం 0–05
8. సాయుధ విప్లవవెల్లువకు సంసిద్ధులుకండి– చారుమజుందార్ 0–05
9. భారత రైతాంగ సాయుధపోరాటం–జనచైనా వ్యాసాలు 1–00

— శ్రామికవర్గ ప్రచురణలు

10. చారుమజుందారి సంస్మరణకవితలు కవితా పబ్లికేషన్స్ 0–80
11. రాష్ట్రవిభజనోద్యమం మార్క్సిస్ట్-లెనినిస్ట్ దృక్పథం
    సోషలిస్ట్ యూత్‌లీగ్ 0–25
12. ఎన్నెస్ కథలు సాగర గ్రంథమాల 3–00
13. ఉప్పెన మొదటిభాగం చౌలి-పో నవల 2–50
14. జనం ఊపిరితో... ఖై దీగీతం 0–50
15. న్యూస్ అండ్ వ్యూస్ ఆన్ చైనా నవయుగ పబ్లిషర్స్ 0–70
16. బద్‌లా కథాసంకలనం ఉద్యమసాహితి 2–00
17. ఊరేగింపు కవితాసంకలనం వరవరరావు .. 1–25

SRJANA 1 Re.
Hanamkonda
Warangal 506001